# భారత శక్తి ®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 200 | హైదరాబాద్ | శుక్రవారం 30-01-2026 | పేజీలు : 12 | వెల : 1.00




11లో

అజిత్ పవార్ విమాన దుర్ఘటన... బ్లాక్ బాక్స్ దొరికింది!

## కేసీఆర్ కు..
## నోటీసులు అందించిన సిట్

- నంది నగర్ లోని నివాసంలో నోటీసులు అందించిన సిట్
- విచారణకు పీఎస్ కు రావాల్సిన అవసరం లేదన్న సిట్ అధికారులు
- ప్లేస్ చెబితే తామే అక్కడకు వస్తామని వెల్లడి



11లో



## మేడారంలో
## మొక్కులు చెల్లించుకున్న
## కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, జువల్ ఓరం

11లో

- మేడారం సమ్మక్కసారలమ్మ జాతరను సందర్శించిన కేంద్ర మంత్రులు
- బంగారం సమర్పించి మొక్కులు చెల్లించుకున్న ఓరం, కిషన్ రెడ్డి
- గిరిజనుల మహా కుంభమేళా ఈ జాతర అని అభివర్ణించిన జువల్ ఓరం
- రూ.890 కోట్లతో సమ్మక్కసారలమ్మ గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటు
- గిరిజన అభివృద్ధి, సంక్షేమానికి కేంద్రం పూర్తి మద్దతు ఇస్తుందని వెల్లడి

## పంజాబ్ సరిహద్దుల్లో
## భారీ కుట్ర భగ్నం..
### డ్రగ్స్, ఆయుధాల స్మగ్లింగ్ ముఠా గుట్టురట్టు


11లో

- అమృత్‌సర్ రూరల్ పోలీసుల మెరుపు దాడి
- 42,983 కిలోల హెరాయిన్, నాలుగు హ్యాండ్ గ్రెనేడ్లు, ఒక స్టార్ మార్క్ పిస్టల్, 46 లైవ్ బుల్లెట్లు స్వాధీనం
- వివరాలు ఎక్స్ వేదికగా పంజాబ్ డీజీపీ గౌరవ్ యాదవ్ వెల్లడి

## అజిత్ పవార్ అంత్యక్రియల్లో
## నారా లోకేశ్..

- బారామతిలో అజిత్ పవార్ అంత్యక్రియలు
- నివాళి అర్పించిన నారా లోకేశ్
- అంత్యక్రియలకు హాజరైన అనగాని, కృష్ణదేవరాయలు, మాగుంట


11లో

## ఆత్మవిశ్వాస భారత్‌కు
## ఈయూ ఒప్పందం నిదర్శనం

- భారత్-ఈయూ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై ప్రధాని మోదీ కీలక వ్యాఖ్యలు
- నాణ్యతతో యూరప్ మార్కెట్లను గెలుచుకోవాలని తయారీదారులకు సూచన
- 'వికసిత్ భారత్ 2047' సాధన దిశగా ప్రభుత్వం ముందుకు వెళ్తోందని స్పష్టీకరణ
- తొమ్మిదోసారి బడ్జెట్ ప్రవేశపెట్టడంపై నిర్మలా సీతారామన్‌ను అభినందించిన మోదీ


11లో

## ఏపీలో 2 లేన్ల జాతీయ రహదారులను
## 4 లేన్లుగా మార్చండి

- ఏపీలో జాతీయ రహదారుల ప్రాజెక్టులపై సీఎం చంద్రబాబు సమీక్ష
- రోడ్ నెట్‌వర్క్ విస్తరణ, రోడ్ డెన్సిటీ పెంపుపై కీలక చర్చ
- ప్రాజెక్టుల అమలులో ఏపీ బెంచ్‌మార్క్‌గా ఉండాలని దిశానిర్దేశం
- 2-లేన్ల రహదారులను 4-లేన్లుగా మార్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచన


11లో

## యూజీసీ 2026 నిబంధనలపై సుప్రీంకోర్టు స్టే



11లో

- యూజీసీ 2026 సమానత్వ నిబంధనలను నిలిపివేసిన సుప్రీంకోర్టు
- తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు 2012 నిబంధనలే అమల్లో ఉంటాయని ఆదేశం
- జనరల్ కేటగిరీకి అన్యాయం చేసేలా ఉన్నాయని దాఖలైన పిటిషన్లపై విచారణ

### మౌలిక సదుపాయాల్లో
## దూసుకెళుతున్న భారత్
### ఆర్థిక సర్వే 2026లో కీలక విషయాలు

- మౌలిక రంగంలో భారత్ దూకుడును వెల్లడించిన ఆర్థిక సర్వే 202526
- పదేళ్లలో మూడు రెట్లు పెరిగిన పునరుత్పాదక ఇంధన సామర్థ్యం
- 2014 నుంచి రెట్టింపునకు పైగా పెరిగిన విమానాశ్రయాల సంఖ్య
- జాతీయ రహదారుల నెట్‌వర్క్‌లో 60 శాతం వృద్ధి
- ప్రభుత్వ మూలధన వ్యయం 4.2 రెట్లు పెరిగిందని వెల్లడి


11లో

భారత శక్తి

# ధనవంతుల ఆస్తిగా బంగారం మారుతుందా

పెరుగుతున్న బంగారం ధరలు సరికొత్త రికార్డులు క్రియేట్ చేస్తున్నాయ్. బంగారం సాధారణ ప్రజలకు అందుబాటులో లేకుండా పోయి ధనవంతుల ఆస్తిగా మారే సమయం వస్తుందని బుషి బ్రహ్మంగారు సంవత్సరాల క్రితం అంచనా వేశారన్నది సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న మాట. బంగారం ధరల ఈ పెరుగుదల ఇంకా ఎంతకాలం కొనసాగుతుంది? ఈ పెరుగుదల వెనకున్న కారణాలేంటి ? ప్రస్తుతం బంగారంలో పెట్టుబడి పెట్టడం సురక్షితమేనా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.బంగారం ధరలు సామాన్యులకు అందనంతగా పెరుగుతున్నాయని బ్రహ్మంగారు చాలా కాలం క్రితమే అంచనా వేశారు.భారతీయ సమాజానికి బంగారం కేవలం ఒక లోహం మాత్రమే కాదు ఇది సంప్రదాయం, విశ్వాసం , శుభంతో కూడా ముడిపడి ఉంది. " బంగారం ఎప్పుడూ దుమ్ముగా మారదు " అని ఒక సామెత ఉంది. అందుకే ప్రజలు బంగారాన్ని కేవలం ఆభరణాలుగా లేదా లోహంగా మాత్రమే కాకుండా పెట్టుబడిగా మన్నికైన ఆస్తిగా కూడా చూస్తారు. శతాబ్దాలుగా బంగారాన్ని సాంప్రదాయ ఆర్థిక వస్తువుగా పరిగణిస్తున్నారు. భారతీయ సంప్రదాయం, హిందూ సంస్కృతిలో దీనికి ప్రత్యేక ప్రాముఖ్యత ఉంది. మంగళసూత్రాలు, గాజులు ధరించడం భారతీయ వివాహిత మహిళల విశ్వాసం. ఇటీవల బంగారం ధరలు పెరగడం ఆందోళన కలిగిస్తోంది.బంగారం మెరుపు ఎప్పుడూ వార్తల్లో ఉంటుంది, కానీ ఈ రోజుల్లో, దాని ధరలు నిరంతరం పెరుగుతుండటం చర్చనీయాంశంగా మారుతోంది. బంగారం ధరలు ప్రతిరోజూ కొత్త రికార్డులను సృష్టిస్తున్నాయి. కానీ బంగారం సాధారణ ప్రజలకు అందుబాటులో లేకుండా పోయి ధనవంతుల సొత్తుగా మారే సమయం వస్తుందని బ్రహ్మంగారు సంవత్సరాల క్రితం అంచనా వేశారట. ప్రస్తుత బంగారం ధరను చూస్తే, బ్రహ్మంగారు మాటలు ఇప్పుడు చాలావరకు నిజమయ్యాయనే చెప్పుకోవాలేమోచాలా సంవత్సరాల క్రితం కాలజ్ఞానం రాసిన పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దక్షిణ భారతదేశానికి గొప్ప జ్ఞాని , దార్శనికుడిగా భావిస్తారు. బంగారం ధరతో సహా ఆయన అంచనాలు చాలా క్రమంగా నిజమవుతున్నాయి. బంగారం ధర చాలా పెరుగుతుందని, మహిళలు బంగారానికి బదులుగా ఇతర, చౌకైన పదార్థాలతో తయారు చేసిన నగలను ధరించడం ప్రారంభిస్తారని బ్రహ్మంగారు ముందే అంచనావేశారు. అప్పట్లో ఇది సాధ్యమయ్యేపనేనా? ఇదొక ఊహ మాత్రమే అనిపించినా ప్రస్తుత పరిస్థితి చూస్తుంటే అలానే ఉంది. బంగారం కొనుగోళ్లు సామాన్యులకు భారంగా మారుతున్నాయి. పెరుగుతున్న బంగారం ధరలు ఇప్పుడు వివాహాలు, పండుగలు , సాంప్రదాయ షాపింగ్‌పై ప్రభావం చూపుతున్నాయి. ద్రవ్యోల్బణం కారణంగా, ప్రజలు ఇప్పుడు తక్కువ బరువు లేదా ఇతర లోహాలతో తయారు చేసిన ఆభరణాల వైపు మొగ్గు చూపుతున్నారు. బంగారం ధర పెరుగుతూనే ఉంది. ప్రస్తుతం, 24 క్యారెట్ల బంగారం ధర ?1,62,100, 22 క్యారెట్ల బంగారం ధర ?1,48,600, 18 క్యారెట్ల బంగారం ధర ?1,21,610. నగరం , రోజును బట్టి ధరల్లో చిన్న చిన్న మార్పులుంటాయపోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి కాలజ్ఞానంలో భవిష్యత్ గురించి చాలా అంశాలు పద్యాలు, వచనాల రూపంలో చెప్పారు. అయితే బంగారం గురించి నేరుగా, స్పష్టంగా ధరలు పెరగడం గురించి ప్రత్యేకంగా లేదనే వాదనలు ఉన్నాయి. వాస్తవానికి బంగారం, ధరలుఅమెరికా అధ్యక్షుడు డోనల్డ్ ట్రంప్ విధానాలు స్టాక్ మార్కెట్‌లో అనేక ఒడిదొడుకులకు కారణమయ్యాయి. ఫలితంగా, పెట్టుబడిదారులు బంగారం, వెండి వంటి లోహాలపై పెట్టుబడులు పెట్టేందుకు మొగ్గుచూపుతున్నారు.వెనెజ్వెలా అధ్యక్షుడు నికోలస్ మదురో నిర్బంధం తర్వాత బంగారం ధరలు పెరిగాయి. అలాగే, ఇరాన్ నిరసనకారులను హింసాత్మకంగా అణచివేస్తున్నారంటూ ట్రంప్ ఆ దేశ ప్రభుత్వంపై బెదిరింపులకు దిగారు. గ్రీన్‌లాండ్ స్వాధీనం గురించి కూడా ప్రస్తావించారు.సుంకాలు విధిస్తామంటూ యూరోపియన్ యూనియన్ దేశాలపై కూడా ఆయన బెదిరింపులకు దిగారు. వైట్‌హౌస్ నుంచి కొనసాగుతున్న ఈ అనిశ్చితి మార్కెట్లను భయాందోళనకు గురిచేస్తోంది.చైనాతో వాణిజ్య ఒప్పందంపై సంతకం చేస్తే 100 శాతం సుంకాలు విధిస్తామంటూ గత శనివారం డోనల్డ్ ట్రంప్ కెనడాను హెచ్చరించారు. అయితే, తమకు అలాంటి ఉద్దేశం లేదని కెనడా ఆ తర్వాత పేర్కొంది.ఇవన్నీ పెట్టుబడిదారులను భయాందోళనకు గురిచేశాయి. ప్రపంచంలో ఏవైనా యుద్ధాలు, దురాక్రమణ, రాజకీయంగా భారీ ఉద్రిక్తతలు నెలకొన్న సమయంలో ప్రజలు తమ డబ్బును స్టాక్ మార్కెట్ లేదా అలాంటి ఇతర ప్రమాదకరమైన ఆస్తుల నుంచి వెనక్కుతీసుకుని.. బంగారం వంటి సంప్రదాయ, సురక్షిత ఆస్తులవైపు మళ్లించేందుకు మొగ్గుచూపుతారు.ఈ అనిశ్చితి, ప్రపంచ రాజకీయ ఉద్రిక్తతల కారణంగా పెట్టుబడిదారులు బంగారం వైపు మొగ్గుచూపారు. ఈ మొగ్గు బంగారం డిమాండ్‌ను పెంచడంతో పాటు ధరలు వేగంగా పెరగడానికి కారణమైంది.అలాగే, 2025లో ట్రంప్ చాలా దేశాలపై సుంకాలు విధించిన సమయంలోనూ పెట్టుబడిదారులు "సురక్షిత పెట్టుబడులకు" మళ్లారు. ఫైనాన్షియల్ మార్కెట్లు నష్టాల బాటపట్టినా కూడా తమ పెట్టుబడుల విలువ తగ్గకుండా నిలుపుకునే ఆస్తులను "సురక్షిత పెట్టుబడులు" (సేఫ్ హెవెన్స్)గా వ్యవహరిస్తారు. క్లిష్టతర పరిస్థితుల్లోనూ వీటి విలువ పెరుగుతుంటుంది.సాధారణంగా, అమెరికన్ డాలర్ బలహీనపడితే.. బంగారం ధరలు పెరుగుతాయి.ఎందుకంటే, బంగారం క్రయవిక్రయాలు డాలర్లలో జరుగుతాయి. డాలర్ బలహీనపడితే, ఇతర దేశాల్లో బంగారం ధరలు తగ్గుతాయి. కాబట్టి, కొనుగోళ్లు పెరుగుతాయి. ఇది డిమాండ్‌ను పెంచడంతో పాటు ధరలనూ పెంచుతుంది.ద్రవ్యోల్బణం, లేదా ఆర్థిక అనిశ్చితి కారణంగా డాలర్ బలహీనపడుతుంటుంది. అలాంటి సమయాల్లో, ప్రజలు బంగారాన్ని సురక్షిత మార్గంగా భావిస్తారు.వాటికితోడు..

# అనంతలో ఏరోస్పేస్ సెంటర్

అనంతపురం, జనవరి 29, (భారత శక్తి ప్రతినిధి)

ఆంధ్రప్రదేశ్‌లో విమానాల తయారీ కేంద్రం ఏర్పాటు దిశగా అడుగులు పడుతున్నాయి. బ్రెజిల్‌కు చెందిన ఎంబ్రాయెర్ సంస్థ అదానీ ఏరోస్పేస్‌తో కలిసి ఇక్కడ తయారీ కేంద్రాన్ని నెలకొల్పేందుకు ఆసక్తి చూపుతోంది. అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లో భారీ పారిశ్రామిక పార్కులు, భూసేకరణ ప్రక్రియలు వేగవంతమయ్యాయి. ఈ ప్రాజెక్టుల రాకతో రాష్ట్రానికి రూ. వేల కోట్ల పెట్టుబడులను, వేలాది ఉద్యోగాలను తెచ్చే అవకాశం ఉంది అంటున్నారు.. అదానీ ఏరోస్పేస్‌తో బ్రెజిల్‌కు చెందిన ఎంబ్రాయెర్ సంస్థ ఒప్పందం చేసుకుంది. ఎంబ్రాయెర్‌కు వ్యాపార, వాణిజ్య, సైనిక విమానాలు, విడిభాగాల తయారీలో మంచి పేరుంది. ఈ సంస్థ దేశంలో విమానాల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయనుంది. ఈ ప్రాజెక్టుకు సంబంధించి ఆంధ్రప్రదేశ్‌తో పాటు గుజరాత్ రేసులో ఉన్నాయి. ఏపీ ప్రభుత్వం పరిశ్రమ ఏర్పాటుకు అవసరమైన భూములను అందించడానికి సంసిద్ధత వ్యక్తం చేసినట్లు సమాచారం. ఈ కొత్త పరిశ్రమ ద్వారా రాష్ట్రానికి వేల కోట్ల రూపాయల పెట్టుబడులు వస్తాయని అంచనా వేస్తున్నారు. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు సంబంధించి వచ్చే నెలలో ఈ ప్రాజెక్టుపై క్లారిటీ వస్తుందని చెబుతున్నారు. ఎంబ్రాయెర్ సంస్థ విమానాలు, విమానాల విడిభాగాల తయారీలో అంతర్జాతీయంగా గుర్తింపు పొందింది.ఏపీలో ఈ విమానాల తయారీ కేంద్రం ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ వస్తే కనుక.. అనంతపురం జిల్లాలో ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోందట. ఈ విమానాల తయారీ కేంద్రం కోసం అనంతపురం జిల్లాలో ఖాళీగా ఉన్న భూములను కేటాయించాలని ప్రతిపాదనలు వచ్చాయి. ఇప్పటికే ఈ ప్రాంతాన్ని విమానల తయారీ కేంద్రంగా మార్చాలని ప్లాన్ చేశారు. బెంగళూరుకు సమీపంలో ఉండటం ఈ ప్రాంతానికి ఒక పెద్ద ప్లస్ పాయింట్. సరళ ఏవియేషన్స్ సంస్థ ఎలక్ట్రికల్ వర్టికల్ టేకాఫ్‌కు ల్యాండింగ్ విమానాలను (రూ.1,300 కోట్ల పెట్టుబడితో 500 ఎకరాల్లో 6 సీటర్ల విమానాలు) తయారు చేయనుంది. వీటిని 'స్కై ఫ్యాక్టరీ'గా అభివృద్ధి చేయనున్నారు. ఈ ప్రాజెక్టుతో స్థానికంగా ఉపాధి అవకాశాలు కూడా మెరుగుపడతాయి. 2029 నాటికి ఎయిర్ ట్యాక్సీలను అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా ప్లాన్ చేశారు. అదానీ గ్రూప్, బ్రెజిలియన్ ఏరోనాటిక్స్ మేజర్ ఎంబ్రేర్ మంగళవారం వ్యూహాత్మక సహకారాన్ని ప్రకటించాయి. భారతదేశం ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న పౌర విమానయాన మార్కెట్లలో ఒకటి. ఈ భాగస్వామ్యం చిన్న, మధ్య తరహా నగరాలకు ఎయిర్ కనెక్టివిటీని మెరుగుపరచడంలో సహాయపడుతుంది. మంగళవారం దేశ రాజధానిలోని పౌర విమానయాన మంత్రిత్వ శాఖలో జరిగిన ఒక కార్యక్రమంలో ఈ భాగస్వామ్యాన్ని ప్రకటించారు. పౌర విమానయాన కార్యదర్శి సమీర్ కుమార్ సిన్హా మాట్లాడుతూ.. ఈ సహకారం కేవలం ప్రాంతీయ విమానాలను అసెంబుల్ చేయడానికి మాత్రమే పరిమితం కాదని అన్నారు.ప్రగతిశీల సాంకేతిక బదిలీ, నైపుణ్య అభివృద్ధి, బలమైన సప్లయ్ చైన, భారతదేశాన్ని ప్రాంతీయ విమానాలకు నమ్మకమైన తయారీ కేంద్రంగా మార్చడం కూడా ఇందులో ఉన్నాయి. అదానీ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ డైరెక్టర్ జీత్ అదానీ మాట్లాడుతూ.. ఎంబ్రేర్ సహకారంతో భారతదేశంలో ప్రాంతీయ విమానాల తయారీ కర్మాగారం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఎంబ్రేర్ 150 సీట్ల వరకు వాణిజ్య జెట్‌లను తయారు చేస్తుంది. ఈ భాగస్వామ్యంతో భారత విమానయాన రంగంలో ఇప్పటికే బలమైన ఉనికిని కలిగి ఉన్న అదానీ గ్రూప్, భారతదేశంలో విమానాల తయారీ రంగంలోకి ప్రవేశిస్తోంది. దేశంలో ప్రాంతీయ రవాణా విమానాల కోసం రెండు కంపెనీలు తుది అసెంబ్లీ లైన్ ను కూడా ఏర్పాటు చేస్తాయి.అయితే ఈ సంస్థ తమ తయారీ యూనిట్‌లను ఆంధ్రప్రదేశ్, గుజరాత్ లలో పెట్టనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే భోగాపురంలో ఎంబ్రాయర్ ఫ్యాక్టరీ పెట్టాలని ఏపీ ప్రయత్నం చేస్తోంది. భూమి, మౌలికసదుపాయాలను కల్పిస్తామని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎంబ్రాయర్ కి ఆఫర్ ఇచ్చింది. భోగాపురంలో ఎంఆర్ ఓ, ఏరోస్పేస్ క్లస్టర్లను కూడా ఏర్పాటు చేసే అవకాశం ఉంది.ఏపీ ప్రభుత్వం శ్రీ సత్యసాయి జిల్లాలో ఒక భారీ ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ పార్కు కోసం మొత్తం 20 వేల ఎకరాల భూమిని కేటాయించనున్నారు. ఇందులో ఇప్పటికే లేపాక్షి నాలెడ్జ్ హబ్‌కు కేటాయించిన 8,844 ఎకరాల భూమి కూడా ఉంది. ఈ భూములను కొడికొండ చెక్‌పోస్టు దగ్గర అభివృద్ధి చేయనున్నారు. ఈ ప్రాజెక్టు కోసం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ పరిధిలో ఉన్న భూములను వెనక్కు తీసుకునే ప్రయత్నాలు విజయవంతమయ్యాయని తెలుస్తోంది.. ఈ భూసేకరణ ప్రక్రియ దాదాపు పూర్తయింది. ఇప్పటికే చుట్టుపక్కల మండలాల్లో భూసేకరణ ప్రక్రియను ప్రభుత్వం ప్రారంభించింది.

# పీలా బ్రదర్స్ పొలిటికల్ వార్

విశాఖపట్టణం, జనవరి 29, (భారత శక్తి ప్రతినిధి)

ఉమ్మడి విశాఖ జిల్లాలో పీలా ఫ్యామిలీ టీడీపీకి నమ్మిన బంటు వంటిది. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి టీడీపీనే నమ్ముకుని రాజకీయాల్లో చక్రం తిప్పుతున్నారు. పీలా మహలక్ష్మి నాయుడు దగ్గరి నుంచి టీడీపీ అధిష్టానం కూడా ఆ ఫ్యామిలీకి చాలా ఇంపార్టెన్స్ ఇస్తూ వస్తోంది. విశాఖ జిల్లాలో గవర సామాజికవర్గం నుంచి అత్యంత బలమైన నాయకత్వంగా ఉన్నారు పీలా ఫ్యామిలీ. మహలక్ష్మి నాయుడు తర్వాత ఆయన కుమారులు రాజకీయాల్లోకి వచ్చారు. వ్యాపార వ్యవహారాలు సాగిస్తూ పాలిటిక్స్‌లో యాక్టీవ్‌గా ఉంటున్నారు. పీలా శ్రీనివాసరావు ప్రస్తుతం గ్రేటర్ విశాఖ కార్పొరేషన్ మేయర్‌గా ఉన్నారు. పీలా గోవింద్ అనకాపల్లి ఎమ్మెల్యేగా గతంలో పని చేసి ప్రస్తుతం అర్బన్ ఫైనాన్స్, ఇన్ ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ పోస్ట్‌లో కొనసాగుతున్నారు.అయితే విశాఖ పాలిటిక్స్‌లో పీలా బ్రదర్స్ ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారిపోయారు. క్యాడర్ మీద, కిందిస్థాయి నేతలపై చిర్రుబుర్రులాడుతూ..పెద్ద పెద్ద బహిరంగ వేదికలపై రచ్చ చేస్తూ టాక్ ఆఫ్ ది కాంట్రవర్సీగా ఉంటున్నారట. ఈ మధ్యే హోంమంత్రి అనిత అనకాపల్లి జిల్లాలో పర్యటించారు. ఆమె తిరుగు ప్రయాణమైన సమయంలో తన అనుచరులుతో కలిసి అనితతో మాట్లాడేందుకు పీలా గోవింద్ ప్రయత్నాలు చేశారు. అయితే తన బిజీ షెడ్యూల్ కారణంగా పీలా గోవింద్‌ను గమనించకుండా హోంమంత్రి కారెక్కి వెళ్లిపోయారుతాను పిలిచినా సరే కనీసం ఖాతరు చేయకుండా కారెక్కి వెళ్లిపోవడమేంటని పీలా గోవింద్ హోంమంత్రి అనితకు నేరుగా ఫోన్ కాల్ చేశారు. తన క్యాడర్ ముందు స్పీకర్ పెట్టి మాట్లాడారు. తాను మాజీ ఎమ్మెల్యేనని, లెక్క చేయకుండా వెళ్లిపోవడం ఏంటని రుసరుసలాడారు. దీంతో అనిత పరిస్థితిని వివరించి సర్ది చెప్పుకోవాల్సి వచ్చింది. తన అనుచరుల ముందు తనకు అవమానం జరిగిందంటూ పీలా గోవింద్ నానా యాగీ చేయడం చర్చనీయాంశంగా మారింది.ఇగో విషయంలో సోదరుడు పీలా గోవింద్‌కు తానేం తక్కువ కాదంటూ మేయర్ పీలా శ్రీనివాసరావు కూడా రెచ్చిపోయారు. విశాఖ ఉత్సవ్ ప్రారంభోత్సవ వేడుకలకు రాష్ట్ర మంత్రులు, జిల్లా ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. అయితే ప్రారంభోత్సవ సమయంలో వేదికపై సీట్ల సర్దుబాటులో భాగంగా కలెక్టర్ హరేందిర ప్రసాద్..జోక్యం చేసుకుని మేయర్ పీలా శ్రీనివాసరావును మరో చోటకు మారాలని సూచించారు. అంతే వెంటనే మేయర్ ఒంటికాలిపై లేచి కలెక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు.గ్రేటర్ విశాఖ కార్పొరేషన్ మేయర్ అంటే కనీసం గౌరవం లేదా.? నన్నే సీటు మారమంటారా.? ప్రొటోకాల్ తెలియదా.? నీ సంగతి చూస్తా అంటూ వార్నింగ్ ఇచ్చారు. కలెక్టర్ సర్ది చెప్పబోయినా సరే పీలా శ్రీనివాసారవు ఏమాత్రం పట్టించుకోలేదు. వేదికపై నుంచి కిందకు వెళ్లిపోయారు. ఉత్సవ్ ఓపెనింగ్‌కు వచ్చిన ప్రజలు, అటు ప్రజాప్రతినిధులు మేయర్ గారి దూకుడును చూసి విస్తుపోయారట.పీలా సోదరులు ఇలా చిందులేయడం ఇదేం కొత్త కాదంట. ఎన్నికల టైమ్‌లో టీడీపీ అధిష్టానం అనకాపల్లి ఎమ్మెల్యే సీటును జనసేనకు కేటాయించడంతో అప్పటి టికెట్ ఆశావహుడు పీలా గోవింద్ చేసిన రచ్చ అంతా ఇంతా కాదంటున్నారు. ఏకంగా చంద్రబాబును వ్యతిరేకిస్తూ తన క్యాడర్‌ను రంగంలోకి దించి దిష్టిబొమ్మలు తగులపెట్టడం, ఫ్లెక్సీలు చించడం, చంద్రబాబు, లోకేశ్‌పై దూషణలకు దిగారంటూ గుర్తు చేస్తున్నారు.అలాగే పీలా శ్రీనివాసరావు కూడా గత కార్పొరేషన్ ఎన్నికలకు ముందు పలువురు కార్పొరేటర్లకు ఫండింగ్ చేసి చీటికి మాటికి రెచ్చిపోయేవారట. అప్పట్లో పార్టీ పరిస్థితుల దృష్ట్యా నేతలంతా సర్దుకుపోయారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. టీడీపీ అధికారంలో ఉన్నా, విపక్షంలో ఉన్నా సరే పీలా సోదరులు ఏ మాత్రం మారడం లేదని తెలుగు తమ్ముళ్లు తలలు పట్టుకుంటున్నారట. చీటికి..మాటికి అలక పాన్పు ఎక్కడం.. లేకుంటే, సహనం కోల్పోయి, కోపంతో పక్కవారిపై అరవడం వీళ్లకు అలవాటుగా మారిందని గుసగుసలు పెట్టుకుంటున్నారట.తండ్రి మహలక్ష్మి నాయుడు పార్టీకి వీర విధేయుడని..కుమారులకు అవకాశాలు ఇస్తే ఇలా రోడ్ల మీద వీరంగం వేసి పార్టీని బజారుకు ఈడుస్తున్నారని మండిపడుతున్నారు పలువురు తెలుగు తమ్ముళ్లు. ఈ అన్నదమ్ముల వ్యవహార తీరు ఎప్పుడు మారుతుందో..తమకు ఎప్పుడు ఈ తలపోటు తప్పుతుందోనని రగిలిపోతున్నారట టీడీపీ లీడర్లు.

# మూడేళ్ల ముందు నుంచే అభ్యర్థులు

కడప, జనవరి 29, (భారత శక్తి ప్రతినిధి)

వైసీపీ అధినేత వైఎస్ జగన్ నియోజకవర్గాలపై ఫోకస్ పెట్టారు. ముందుగా కడప జిల్లాలో పట్టు మళ్లీ పెంచుకునే ప్రయత్నంలో పడ్డారు. గత ఎన్నికల్లో కడప జిల్లాలో కేవలం మూడు నియోజకవర్గాల్లో మాత్రమే వైసీపీ గెలిచింది. మొత్తం పది నియోజకవర్గాలుండగా అందులో మూడింటిలోనే విజయం సాధించడం జగన్ పై ఉన్న వ్యతిరేకతకు కారణమయింది. అయితే కడప జిల్లాలో ఓటమికి అనేక కారణాలున్నాయి. వాటిని ఒక్కొక్కటిగా తొలగించుకునే ప్రయత్నం చేస్తున్నారు. మైదుకూరు నియోజకవర్గంలో ఈసారి కొత్త ట్రెండ్ కు తెరలేపుతున్నారు. మైదుకూరు నియోజకవర్గం అంటే తొలి నుంచి కాంగ్రెస్ తర్వాత వైసీపీకి బలం ఉన్న ప్రాంతం. అక్కడ ఓటు బ్యాంకు ఎక్కువగా యాంటీ టీడీపీ ఉన్నట్లు అనేక ఫలితాలు వెల్లడించాయి.అయితే 2024 ఎన్నికల ఫలితాలు మాత్రం వైసీపీని దెబ్బతీశాయి. ఇందులో మరొక కోణం కూడా ఉంది. అదే సామాజికవర్గం కోణం. మైదుకూరు నియోజకవర్గంలో మొదటి నుంచి రెడ్డి సామాజికవర్గం నేతలే ఎన్నికవుతూ వస్తున్నారు. కానీ 2024 ఎన్నికల్లో మాత్రం తొలిసారి యాదవ సామాజికవర్గానికి చెందిన టీడీపీ నేత పుట్టాసుధాకర్ యాదవ్ కు మైదుకూరు ప్రజలు అండగా నిలిచారు. 1955లో ఏర్పడిన ఈ నియోజకవర్గంలో ఇప్పటి వరకూ పదిహేను సార్లు ఎన్నికలు జరిగితే పధ్నాలుగు సార్లు రెడ్డి సామాజికవర్గం నేతలే ఎన్నికయ్యారు. అయితే మొన్నటి ఎన్నికల్లో రెడ్డి యేతర సామాజికవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయి రికార్డు బ్రేక్ చేశారు. బీసీల్లోనూ యాదవులు ఎక్కువగా ఉండటంతో అక్కడ గెలుపు సాధ్యమయిందిదీంతో వచ్చే ఎన్నికల్లోనూ జగన్ యాదవ సామాజికవర్గానికి చెందిన నేతకే టిక్కెట్ ఇచ్చే ఆలోచనలో ఉన్నట్లు తెలిసింది. కడప పార్లమెంటు నియోజకవర్గంలోని ఏడు శాసనసభ నియోజకవర్గాల్లో ఒక్క బీసీకి కూడా టిక్కెట్ ఇవ్వకపోడం ఓటమికి కారణంగా జగన్ గుర్తించారు. కడప పట్టణ నియోజకవర్గం మాత్రం ముస్లిం మైనారిటీలకు ఇస్తూ వస్తున్నారు. మిగిలిన ఆరు నియోజకవర్గాల్లో రెడ్డి సామాజికవర్గానికే కేటాయిస్తూ వస్తున్నారు. దీంతో ఈ సారి ఆ విధానాన్ని మార్చి మైదుకూరులో బీసీని పోటీ చేయించాలన్న ఉద్దేశ్యంతో జగన్ ఉన్నారు.

# నిధుల కోసం ఢిల్లీకి జనసేనాని

కాకినాడ, జనవరి 29, (భారత శక్తి ప్రతినిధి)

ఏపీ ఉప ముఖ్యమంత్రి గా బాధ్యతలు చేపట్టిన తర్వాత జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఎక్కువగా రాష్ట్రంలోనే ఉండి తన శాఖల పనులను పర్యవేక్షిస్తున్న విషయం తెలిసిందే. దాదాపు గత ఇరవై నెలల కాలంలో ఒకటి రెండు సందర్భాలు తప్ప ఆయన ఢిల్లీ వెళ్లలేదు. పరిపాలనపై పూర్తి పట్టు సాధించాలనే ఉద్దేశంతో శాఖల పనితీరును దగ్గరుండి చూసుకుంటూ నిర్ణయాలు తీసుకుంటూ ముందుకు వెళ్తున్నారు. ఇదిలా ఉండగా, మరోవైపు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తో పాటు మంత్రి నారా లోకేష్ తరచూ ఢిల్లీ పర్యటనలు చేస్తూ కేంద్ర మంత్రులతో సమావేశమై రాష్ట్రానికి అవసరమైన నిధుల కోసం ప్రయత్నాలు చేస్తున్నారు.ఈ నేపథ్యంలో ఈసారి పవన్ కళ్యాణ్ కూడా ఢిల్లీ పర్యటనకు వెళ్లనున్నారనే వార్త రాజకీయ వర్గాల్లో ఆసక్తిని కలిగిస్తోంది. కేంద్ర బడ్జెట్ సమావేశాల మధ్యలో ఆయన పర్యటన ఉండబోతుందని జనసేన లోక్‌సభాపక్ష నేత బాలశౌరి వెల్లడించారు. ఈ పర్యటనలో పవన్ కేంద్ర ప్రభుత్వంలోని వివిధ శాఖల మంత్రులతో విడిగా భేటీ అయ్యి ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి అవసరమైన నిధులపై చర్చించనున్నారని తెలిపారు. ముఖ్యంగా రాష్ట్ర రాజధానిగా నిర్ణయించిన అమరావతి నిర్మాణానికి అవసరమైన ఆర్థిక సహాయాన్ని కేంద్రం నుంచి రాబట్టడం ఆయన ప్రధాన లక్ష్యంగా ఉండనుందని చెప్పారు.అమరావతితో పాటు గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి అదనపు నిధులు అవసరమని పవన్ కేంద్రం దృష్టికి తీసుకెళ్లనున్నారని జనసేన వర్గాలు పేర్కొంటున్నాయి. దేశ ప్రధాని నరేంద్ర మోడీ కేంద్ర హోంమంత్రి అమిత్ షా తో పవన్‌కు ఉన్న సాన్నిహిత్యాన్ని ఈ సందర్భంగా రాష్ట్ర ప్రయోజనాల కోసం వినియోగించుకుంటారని పార్టీ నేతలు భావిస్తున్నారు. రాష్ట్రానికి పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టాల్సిన అవసరం ఉన్నందున ఈ పర్యటన ప్రత్యేక ప్రాధాన్యం సంతరించుకుంటోంది.ఇటీవల కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన ఢిల్లీలో జరిగిన అఖిలపక్ష సమావేశంలో కూడా జనసేన తన అభిప్రాయాలను స్పష్టంగా వ్యక్తం చేసింది. ఆ సమావేశంలో బాలశౌరి మాట్లాడుతూ అమరావతికి చట్టబద్ధత కల్పించేలా కేంద్రం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే యువతలో పెరుగుతున్న డ్రగ్స్ సమస్యపై తల్లిదండ్రుల్లో ఉన్న ఆందోళనను కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. డ్రగ్స్ నియంత్రణతో పాటు సోషల్ మీడియా దుర్వినియోగంపై కఠిన చట్టాలు అవసరమని, వీటిపై పార్లమెంట్‌లో చర్చ జరగాలని జనసేన అభిప్రాయపడింది.అదేవిధంగా జల జీవన్ మిషన్ కింద ప్రతి గ్రామానికి తాగునీరు అందించే లక్ష్యంతో అన్ని జిల్లాలకు సరిపడా నిధులు కేటాయించాలని కోరింది. ఆక్వా కల్చర్ రంగంపై అమెరికా విధిస్తున్న పన్నుల ప్రభావం తీవ్రంగా ఉందని, ఆక్వా రైతుల సమస్యలపై పార్లమెంట్‌లో విస్తృత చర్చ జరిపి పరిష్కారం చూపాలని జనసేన కేంద్రాన్ని అభ్యర్థిస్తోంది. ఈ అన్ని అంశాలతో పవన్ కళ్యాణ్ ఢిల్లీ పర్యటన రాష్ట్ర భవిష్యత్తుకు కీలకంగా మారనుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

పిఠాపురం స్టేషన్ కు మహర్దశ

కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్‌తో ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సమావేశమయ్యారు. రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాల గురించి అశ్వినీ వైష్ణవ్‌తో చర్చించిన పవన్ కళ్యాణ్ పిఠాపురంలో రైల్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని కోరారు. రైల్ ఓవర్ బ్రిడ్జి లేని కారణంగా అనేక ఇబ్బందులు ప్రజలు పడుతున్నారని పవన్ కళ్యాణ్ కేంద్ర మంత్రికి తెలిపారు. మరొకవైపు పిఠాపురం రైల్వేస్టేషన్‌ను మోడల్ రైల్వేస్టేషన్‌గా అభివృద్ధి చేయాలని వినతి పత్రాన్ని అందచేశారు. కాకినాడ-పిఠాపురం మధ్య రైల్వే అనుసంధానం పెంచాలని కోరిన పవన్ కళ్యాణ్ దీనివల్ల పిఠాపురం నియోజకవర్గం కనెక్టివిటీ పెరుగుతుందని చెప్పారు. దీంతో పాటు రాష్ట్రానికి సంబంధించిన పలు ప్రాజెక్టుల గురించి కూడా చర్చించారు. సేతు బంధన్ పథకం కింద మంజూరు చేసిన రోడ్డు ఓవర్ బ్రిడ్జిని పీఎం గతిశక్తి పథకం పరిధిలోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. ఇది 2030 జాతీయ రైల్ ప్రణాళికకు అనుగుణంగా లెవల్ క్రాసింగులు తొలగించేందుకు, ట్రాఫిక్ నియంత్రణకు సహకరిస్తుందని తెలిపారు. పిఠాపురం ఆధ్యాత్మికంగా ముఖ్య పట్టణం అయినందున రైల్వే స్టేషన్ ను అమృత్ స్కీం కింద మోడల్ రైల్వే స్టేషన్ గా అభివృద్ధి చేయాలని కోరారు. అష్టాదశ శక్తిపీఠం, శ్రీ పాద శ్రీ వల్లభ స్వామి కొలువైన క్షేత్రం పిఠాపురంలో ఉన్నందున దర్శనం నిమిత్తం సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల సౌకర్యార్థం మౌలిక వసతులు కల్పించాలని విన్నవించారు. వీటితోపాటు రాష్ట్రంలో పెండింగ్ లో ఉన్న పలు రైల్వే ప్రాజెక్టుల గురించి పవన్ కళ్యాణ్ చర్చించారు. అశ్విని వైష్ణవ్ గారు సానుకూలంగా స్పందించినందుకుపవన్ కళ్యాణ్ గారు కృతజ్ఞతలు తెలిపారు.

# పదవి ఉన్నా... గౌరవం ఏదీ

శ్రీకాకుళం, జనవరి 29,

గొల్ల బాబూరావు. ఒకప్పుడు ఆయనో గ్రూప్ వన్ ఆఫీసర్. ఇప్పుడు పెద్దల సభలో వైసీపీ రాజ్యసభ సభ్యుడు. షార్ట్ టర్మ్‌లో పొలిటికల్ లక్కీ ఛాన్స్ కొట్టి రాజ్యసభకు వెళ్లిన ఆయనకు ఇప్పుడో డౌట్ కొడుతోందట. 16 ఏళ్లకు పైగా రాజకీయాల్లో ఎన్నో ఎత్తులు..పల్లాలు చూసిన ఆయనకు అస్సలు మనసు కుదట పడట్లేదట. నా సేవలను వాడుకోండి అంటూ ఓపెన్ ఆఫర్ ఇస్తున్నారట.కాస్త వెయిట్ చెయ్..టైమ్ వచ్చినప్పుడు మా వాడకమేంటో చూపిస్తామని వైసీపీ పెద్దలు చెప్తున్నా..బాబూరావు మాత్రం నో కాంప్రమైజ్ అంటున్నారట. ఇప్పుడే తన వర్క్ స్టైల్ ఏంటో చూపిస్తానంటూ ఆసక్తి చూపిస్తున్నారట. చెప్పుకోదగ్గ పదవి ఉన్నా..పార్టీ మీటింగ్‌లలో..చివరకు అధినేత పర్యటనలకు కూడా తనకు ప్రత్యేక ఆహ్వానం లేదంటూ అనుచరుల దగ్గర ఫ్రస్టేట్ అవుతున్నారట.రాజ్యసక్ష సభ్యుడిగా హోదా ప్రకారం ప్రోటోకాల్ ఇచ్చి ప్రభుత్వ అధికారులు గౌరవ మర్యాదలు పాటిస్తున్నా సరే, పార్టీ పరంగా పెద్దగా ఇంపార్టెన్స్ ఇవ్వడం లేదని తెగ బాధపడిపోతున్నారట. వైసీపీ అధికారం అనేక కీలక సమావేశాలు, నిరసనలు, సభలు నిర్వహించినా సరే ఓ దళిత రాజ్యసభ సభ్యుడుగా తనకు మినిమం ప్రయారిటీ ఇవ్వలేదన్న ఫీలింగ్ ఆయనలో ఎక్కువైపోయిందట. అధికారం కోల్పోయిన తర్వాత వైసీపీ చేపట్టినా కార్యక్రమాల్లో గొల్ల బాబూరావు ఎక్కడా కనిపించలేదు.దళితులపై దాడులు, వివాదాల అంశంలో వైసీపీ అధ్యక్షుడు జగన్ పరామర్శలకు వెళ్లినా సరే గొల్ల బాబూరావుకు కనీసం సమాచారం కూడా ఇవ్వడం లేదట. దళిత సామాజికవర్గం నుంచి రాజ్యసభ సభ్యుడుగా ఉన్నా సరే కనీసం ఆహ్వానం లేకపోవడం..పార్టీ తరుపున తన వాయిస్ కూడా ప్రజల్లోకి వెళ్లకుండా చేయడం వెనుక ఏదో కుట్ర దాగి ఉందనేది గొల్ల బాబూరావు అనుమానమట. ఇటీవల ఆయన ఫ్రస్ట్రేషన్ స్లో..స్లోగా మొదలై, ఇప్పుడు పీక్స్‌కు చేరిందట.త్వరలో పార్టీ అధ్యక్షుడు జగన్ దగ్గరే పంచాయితీ పెట్టాలని ఫిక్స్ అయిపోయారట గొల్ల బాబూరావు. కేవలం తన భవిష్యత్తుకు మాత్రమే పరిమితం కాకుండా, వైసీపీలో తన కుమారుడు పొలిటికల్ ఫ్యూచర్‌పై కూడా తాడో పేడో తేల్చుకునేందుకు సిద్ధమవుతున్నారట. పెద్దల సభకు ప్రాతనిధ్యం వహిస్తున్నా సరే పార్టీలో తన ప్లేస్ ఏంటో తనకే తెలియక కన్ఫ్యూజన్‌లో పార్టీలో ఎవరిని ఎటాక్ చేయాలో తెలియక గొల్ల అయోమయంలో అల్లాడిపోతున్నారట.గొల్ల బాబూరావు..వైసీపీ ఆవిర్భావం నుంచి అధినేత జగన్ వెంట నడిచారు. పాయకరావుపేట నియోజకవర్గంలో వైసీపీని పటిష్టం చేశారు. టీడీపీకి కంచుకోట వంటి పేట కోటను బద్దలు కొట్టి గొల్ల బాబూరావు తన సామ్రాజ్యాన్ని విస్తరించారు. మొదటి గ్రూప్ వన్ ఉద్యోగం చేసుకునే గొల్ల బాబూరావు 2009లో ఫస్ట్ టైమ్ కాంగ్రెస్ పార్టీ తరఫున పాయకరావుపేట అసెంబ్లీ నియోజకవర్గం నుంచి గెలిచారు.వైసీపీ ఆవిర్భావం తర్వాత జగన్‌మోహన్‌రెడ్డితో కలిసి జర్నీ స్టార్ట్ చేసి 2012 బైఎలక్షన్, 2019 సాధారణ ఎన్నికల్లోనూ ఫ్యాన్ పార్టీ తరఫున పోటీ చేసి విజయం సాధించారు. 2019 ఎన్నికల్లో వైసీపీ అఖండ విజయం సాధించడంతో పార్టీలో సీనియార్టీ పరంగా, జగన్‌తో ఉన్న సాన్నిహిత్యంతో మంత్రి పదవి దక్కుతుందని ఆశించారు గొల్ల బాబూరావు. కానీ ఆయనకు భంగపాటు తప్పలేదు. వైసీపీ హయాంలో సెకండ్ టర్మ్‌లోనైనా మంత్రి పదవి వస్తుందని ఆశలు పెంచుకోగా, అవి కూడా అడియాశలయ్యాయి.అప్పటి నుంచి వైసీపీలో సీనియారిటీ, జగన్ పట్ల సిన్సియారిటీని పక్కన పెట్టి పార్టీకి వ్యతిరేకంగా, అధినేత జగన్‌ను లెక్క చేయకుండా గొల్ల బాబూరావు రచ్చకెక్కడం మొదలు పెట్టారు. మంత్రి పదవి దక్కకపోవడం, అవమానకరంగా, ఆత్మగౌరవ వ్యవహారంగా ఫీల్ కావడంతో బాబూరావు తన పొలిటికల్ మైండ్‌కు పని చెప్పారు. కొందరు పార్టీ పెద్దలు తన మంత్రి అవకాశాలకు అడ్డుపడ్డారని, సందర్భం వచ్చినప్పుడు తనలో విప్లవకారుడిని చూస్తారంటూ ఆయన ఇచ్చిన వార్నింగ్‌లు అప్పట్లో ఫ్యాన్ పార్టీలో దుమారం రేపాయి.అయితే 2024 ఎన్నికల నాటికి పాయకరావుపేటలో అంతర్గత రాజకీయాలు అదుపు తప్పడంతో ఏకంగా సిట్టింగ్ ఎమ్మెల్యే బాబూరావును కాదని..పొరుగు జిల్లాకు చెందిన కంబాల జోగులును బరిలోకి దించింది వైసీపీ. ఇది అట్టర్ ఫ్లాఫ్ పొలిటికల్ ఎక్స్ పరిమెంట్‌గా ఎలక్షన్ రిజల్ట్ వచ్చాక గాని వైసీపీకి అర్థం కాలేదు. ఈ పరిణామాల తర్వాత గొల్ల బాబూరావు రాజకీయ భవిష్యత్తు డైలమాలో పడ్డట్లు అయింది.కానీ, అదృష్టం ఏ రూపంలో వస్తుందో ఎవరూ ఊహించలేరన్నట్టు రాజ్యసభ సీటు బాబూరావుని వెతుక్కుంటూ వచ్చి ఆయన ఇంటి ముందు వాలిపోయింది. దీంతో గొల్ల బాబూరావు మంత్రి పదవి రాకపోయినా సరే ఏదో రాజ్యసభ దక్కిందని సరిపెట్టుకుని ఢిల్లీకి పయనమైపోయారు. కానీ ఇప్పుడు సరైన ప్రాధాన్యత దక్కట్లేదు..తన సేవలను సరిగ్గా వాడుకోవట్లేదన్న ఆవేదనలో ఉన్నారట ఆయన.త్వరలో అధినేతను కలిసి తన మనసులో మాటను చెప్పడంతో పాటు..తన కుమారుడి పొలిటికల్ ఫ్యూచర్‌పై కూడా జగన్‌ను ముందు ఓ ప్రపోజల్ పెట్టాలని డిసైడ్ అయ్యారట. మరి బాబూరావు రిక్వెస్ట్‌ను జగన్ ఎంతవరకు పరిగణలోకి తీసుకుంటారో..ఆయన సేవలను పార్టీ ఎలా వాడుకుంటుందో వేచి చూడాలి.

# జూన్ 26న భోగాపురం ఎయిర్ పోర్ట్ రెడీ

విజయనగరం, జనవరి 29, (న్యూస్ పల్స్)

ఏపీ ప్రజలకు గుడ్ న్యూస్. ఏపీలో ఇప్పటికే చాలా ఎయిర్‌పోర్టులు అందుబాటలో ఉన్నాయి. విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, కడప, కర్నూలు, రాజమండ్రి వంటి జిల్లాల్లో ఎయిర్‌పోర్టులు ప్రజలకు సేవలు అందిస్తున్నాయి. త్వరలో మరో కొత్త ఎయిర్‌పోర్ట్ ఏపీ ప్రజలకు అందుబాటులోకి రానుంది. దీని వల్ల ప్రధానంగా ఉత్తరాంధ్ర ప్రజలకు భారీ లబ్ది చేకూరనుంది. ప్రయాణ సౌకర్యంతో పాటు ఎయిర్‌పోర్ట్ వల్ల రవాణా సౌకర్యాలు పెరగడం వల్ల కొత్త కంపెనీలు రానున్నాయి. దీంతో హోటళ్లు, లాజిస్టిక్ వ్యాపారం పెరిగి స్థానికులకు ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఇప్పటికే ఈ ఎయిర్‌పోర్ట్ పనులు పూర్తవ్వగా.. ఏప్రిల్‌లో ప్రారంభించనున్నారు. ఇప్పటికే ట్రయల్ రన్స్ పూర్తయ్యాయి.భోగాపురం ఎయిర్‌పోర్ట్ ఎప్పుడు ప్రారంభం అవుతుందనే దానిపై కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు క్లారిటీ ఇచ్చారు. జూన్ 26న భోగాపురం ఎయిర్‌పోర్ట్‌ను ప్రారంభించనున్నట్లు తెలిపారు. జనవరి 1వ తేదీన ట్రయల్ రన్ కింద తొలి విమానం ల్యాండ్ అయినట్లు తెలిపారు. ఈ ట్రయల్ రన్‌లో భాగంగా ఢిల్లీ నుంచి ఇండిగో విమానం భోగాపురంకు చేరుకుంది. ఈ విమానంలో రామ్మోహన్ నాయుడితో పాటు ఎంపీలు, విమానయాన సంస్థ ఉన్నతాధికారులు ప్రయాణించారు. ఈ ఎయిర్‌పోర్ట్ పనులు దాదాపు అన్నీ పూర్తయ్యాయని, ప్రారంభించేందుకు పనులు వేగంగా జరుగుతున్నాయని తాజాగా రామ్మోహన్ నాయుడు అన్నారు. అటు భారత్‌లో విమానాల తయారీకి బ్రెజిల్ విమాన తయారీ సంస్థ ఎంబ్రాయర్ సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా ఏపీ, గుజరాత్‌లో తయారీ యూనిట్లను ఏర్పాటు చేయనుంది. ఈ క్రమంలో భోగాపురంలో చేత యూనిట్‌ను ఎంబ్రాయ్ సంస్థ ఏర్పాటు చేసేలా ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. భూమి కేటాయించడంతో పాటు మౌలిక సదుపాయాల కోసం వసతులు కల్పిస్తామని ప్రభుత్వం ఆఫర్ ఇచ్చిందిఎంబ్రాయర్ సంస్థ చిన్న, మధ్యస్థ, సైనిక, ట్రాన్స్‌పోర్ట్ విమానాలను తయారు చేయనుంది. దీంతో భోగాపురంలో మెయింటనెన్స్ రిపేర్ అండ్ ఓవర్ హల్, ఏరోస్పేస్ కస్టర్లు ఏర్పాటు చేసేలా ఏపీ ప్రభుత్వం చర్చలు జరుపుతోంది. భోగాపురంలో ఇది ఏర్పాటు చేస్తే మరింత ప్రయోజనం జరగనుంది. భారత్‌లో ఎంబ్రాయర్ సంస్థ విమాన తయారీ యూనిట్లను ఏర్పాటు చేయనుండంపై రామ్మోహన్ నాయుడు హర్షం వ్యక్తం చేశారు. భారత్‌తో ఒప్పందం కుదుర్చుకోవడం శుభపరిణామమని తెలిపారు. భారత్ విమానయాన రంగంలో ఇదొక కీలక మైలురాయిగా పేర్కొన్నారు.ఈ భూముల్లో విమానాల తయారీ ప్రాజెక్టును కూడా ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. ఈ పారిశ్రామిక పార్కుకు భూములు చాలా అనుకూలమైన ప్రదేశంలో ఉన్నాయి. ఇవి జాతీయ రహదారికి దగ్గరగా ఉన్నాయి.. అలాగే బెంగళూరు దేవనహళ్లి అంతర్జాతీయ విమానాశ్రయానికి కూడా సమీపంలోనే ఉన్నాయి. ఈ కారణాల వల్ల రవాణా సౌకర్యం చాలా బాగుంటుందని చెబుతున్నారు. మొత్తం మీద విమానాల తయారీ కేంద్రాలు కనుక ఏర్పాటు చేస్తే.. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలకు దశ తిరిగినట్లే.

# బడ్జెట్ పై రియల్ ఆశలు

ముంబై, జనవరి 29 (

ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఫిబ్రవరి 1న కేంద్ర బడ్జెట్ 2026ను ప్రవేశపెట్టడానికి సిద్ధమవుతున్న తరుణంలో, రియల్ ఎస్టేట్ రంగం మరోసారి భారీ అంచనాలు పెట్టుకుంది. పుంజుకుంటున్న ప్రీమియం హౌసింగ్ డిమాండ్, మౌలిక సదుపాయాల ఆధారిత వృద్ధి, పెరుగుతున్న నిర్మాణ వ్యయాలతో, పరిశ్రమ సమస్యలు పరిష్కరించగల, పర్మిషన్స్ వేగవంతం చేయగల, విస్తరిస్తున్న రంగానికి అనుగుణంగా చేపట్టే సంస్కరణల బడ్జెట్ కోసం రియల్ ఎస్టేట్ రంగం ఎదురు చూస్తోంది. గృహ





రుణ పన్నుపై ఉపశమనం కోరుకునే గృహ కొనుగోలుదారుల నుంచి పరిశ్రమ హోదా, వేగవంతమైన అనుమతులను కోరుతున్న డెవలపర్‌ల వరకు, భారతదేశ పట్టణ వృద్ధికి సంబంధించిన తదుపరి దశను రూపొందించడానికి బడ్జెట్ 2026 ఒక కీలకమైన క్షణంగా భావిస్తున్నారు.భారతీయ రియల్ ఎస్టేట్ మార్కెట్ ఇటీవలి త్రైమాసికాల్లో గణనీయమైన వృద్ధిని ప్రదర్శించింది, దీనికి బలమైన తుది-వినియోగదారుల డిమాండ్, పెరుగుతున్న ఆకాంక్షలు, మౌలిక సదుపాయాలలో స్థిరమైన ప్రభుత్వ పెట్టుబడి కారణమయ్యాయి. అయినప్పటికీ, సవాళ్లు కొనసాగుతున్నాయి. కొనుగోలుదారులలో ఎక్కువ మందికి ఆర్థిక వెసులుబాటు ఒక అడ్డంకిగా ఉంది, అయితే డెవలపర్లు ఫైనాన్సింగ్ ఖర్చులు, నియంత్రణ జాప్యాలు, పెరుగుతున్న ఇన్‌పుట్ ధరలతో ఇబ్బంది పడుతున్నారు.పాధి కల్పన, ఉఆఖలో ఈ రంగం పాత్ర బలమైన ముద్ర వేస్తోంది. అందుకే సరైన గుర్తింపును కోరుతుందని పరిశ్రమ లీడర్లు వాదిస్తున్నారు. రియల్ ఎస్టేట్ అధికారికంగా పరిశ్రమ హోదాను మంజూరు చేయాలనే దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న డిమాండ్ . దీన్ని నెరవేర్చాలని కోరుతున్నారు. ఇది చౌకైన వ్యవస్థీకృత నిధులను అన్‌లాక్ చేస్తుంది. నియంత్రణ పర్యవేక్షణను క్రమబద్ధీకరిస్తుంది.పట్టణ ప్రాంతాల్లో సరసమైన గృహాల విస్తరించడానికి చాలా స్కోప్ ఉంది. వేగంగా అభివృద్ధి చెందుతున్న టైర్ 2, టైర్ 3 నగరాల్లో భూమి, నిర్మాణ ఖర్చులను ప్రస్తుత ధరల పరిమితులు ఇకపై ప్రతిబింబించవని డెవలపర్లు వాదిస్తున్నారు, ఇక్కడ గృహ డిమాండ్ పెరుగుతోంది కానీ అధికారిక ప్రయోజనాలు పరిమితంగా ఉంటాయని అంటున్నారు.ప్రీమియం, లగ్జరీ హౌసింగ్ వైపు పెరుగుతున్న డిమాండ్ బడ్జెట్ అంచనాలను రూపొందించే మరొక ధోరణి. అనేక మార్కెట్లలో మిడ్-ప్రీమియం, హై-ఎండ్ విభాగాలు సరసమైన గృహాలను అధిగమిస్తుండటంతో, డెవలపర్లు సంస్థాగత పెట్టుబడి, దీర్ఘకాలిక మూలధన ప్రవాహాలకు మద్దతు ఇచ్చే విధానాలను కోరుకుంటున్నారు.సౌకర్యవంతమైన వర్క్‌స్పేస్ విభాగంలో, 315 వర్క్ అవెన్యూ వ్యవస్థాపకుడు మానస్ మెహ్రోత్రా, కోవర్కింగ్ సేవలకు, ముఖ్యంగా స్టార్టప్‌లు, చిన్న వ్యాపారాలకు రాయితీ, స్లాబ్ ఆధారిత ఉూ రేట్ల కోసం పిలుపునిస్తున్నారు. ఇంటీరియర్ ఫిట్-అవుట్‌లపై బ్లాక్ చేసిన ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్‌ను తొలగించాలని, కోవర్కింగ్ చెల్లింపులపై 10 శాతం ుఆూ హేతుబద్ధీకరణను కూడా ఆయన కోరుకుంటున్నారు. భారతదేశ కోవర్కింగ్ పర్యావరణ వ్యవస్థను స్కేల్ చేయడానికి మెరుగైన నగదు ప్రవాహ నిర్వహణ, సంస్థాగత ఫైనాన్స్‌కు ప్రాముఖ్యత చాలా అవసరం అని అంటున్నారు. భారతదేశం రియల్ ఎస్టేట్ రంగం టైర్ 2కు విస్తరణ తదుపరి దశలోకి ప్రవేశిస్తున్నందువ గృహ డిమాండ్‌ను నిర్మాణాత్మకంగా పెంచడానికి బడ్జెట్ 2026 ఒక అవకాశం అని ఖీఇం ఇండియా అఇూ ప్రవీణ్ శర్మ అన్నారు. డిజిటల్ గవర్నెన్స్ ద్వారా స్థిరమైన సరసమైన గృహ మద్దతు, మరింత ఆచరణాత్మక గృహ రుణ పన్ను ప్రయోజనాలు, వేగవంతమైన ఆమోదాల అవసరాన్ని ఆయన ఎత్తి చూపారు.గృహ డిమాండ్ మాత్రమే కాదు, రాబోయే దశాబ్దంలో భారతదేశ వృద్ధిని నిర్వచించే విస్తృత పట్టణ పరివర్తన కూడా ప్రమాదంలో ఉంది. దాదాపు 250 అనుబంధ పరిశ్రమలకు రియల్ ఎస్టేట్ ఇంధనంగా పనిచేస్తుండటంతో, మద్దతు ఇచ్చే, ఊహించదగిన, సంస్కరణ-ఆధారిత బడ్జెట్ పెట్టుబడిదారుల విశ్వాసాన్ని బలోపేతం చేయగలదని, స్థోమతను మెరుగుపరచగలదని, భారతదేశ రియల్ ఎస్టేట్ మార్కెట్‌ను మరింత ప్రపంచవ్యాప్తంగా పోటీతత్వ ప్రాతిపదికన ఉంచగలదని పరిశ్రమ నాయకులు వాదిస్తున్నారు.

# సిద్ధార్ధాలూద్రాకు కాసులే.. కాసులు

విజయవాడ, జనవరి 29,

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అత్యున్నత స్థాయి చట్టపరమైన పోరాటాల కోసం భారీగా ఖర్చు చేస్తోంది. రాష్ట్రంలో సంచలనం సృష్టించిన మద్యం కుంభకోణం కేసులో ప్రభుత్వం తరపున వాదించిన సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూత్రాకు తాజాగా రూ. 1,15,50,000 ఫీజుగా చెల్లిస్తూ హోం శాఖ రెండు వేర్వేరు జీవోలను విడుదల చేసింది. క్రైమ్ నెం. 21/2024 కు సంబంధించిన ఈ కేసులో నిందితులకు బెయిల్ రాకుండా అడ్డుకోవడంలో లూత్రా కీలక పాత్ర పోషించారు.ప్రభుత్వం జారీ చేసిన జీవో నెం. 104 ప్రకారం, సెప్టెంబర్ 2025లో ఐదు రోజుల పాటు (19, 22, 23, 24, 26 తేదీల్లో) హైకోర్టులో జరిగిన విచారణకు సిద్ధార్థ్ లూత్రా హాజరయ్యారు. ఈ ఐదు రోజులకు గానూ ఆయనకు కోటి రూపాయల ప్రొఫెషనల్ ఫీజును ప్రభుత్వం ఖరారు చేసింది. ఇందులో విశేషమేమిటంటే, సెప్టెంబర్ 24న ఒక్క రోజు హాజరీకే ఆయనకు రూ. 40 లక్షలు చెల్లించారు. మిగిలిన నాలుగు రోజులకు రోజుకు రూ. 10 లక్షల చొప్పున ఫీజు లెక్కించారు. దీనికి అదనంగా 10 శాతం క్లర్కేజీ (రూ. 10 లక్షలు) కలిపి మొత్తం రూ. 1.10 కోట్లు మంజూరు చేశారు.మరోవైపు, నవంబర్ 18, 2025న జరిగిన ఒకే ఒక్క విచారణ కోసం ప్రభుత్వం మరో రూ. 5.50 లక్షలను (రూ. 5 లక్షల ఫీజు + రూ. 50 వేల క్లర్కేజీ) జీవో నెం. 103 ద్వారా విడుదల చేసింది.సిద్ధార్థ్ లూత్రా వంటి టాప్ రేటెడ్ లాయర్లను రంగంలోకి దించారంటేనే ఈ కేసు ఎంత సీరియస్సో అర్థం చేసుకోవచ్చు. గత ప్రభుత్వ హయాంలో ఆంధ్రప్రదేశ్ స్టేట్ బెవరేజస్ కార్పొరేషన్ వేదికగా వేల కోట్ల రూపాయల అవినీతి జరిగిందని ప్రస్తుత ప్రభుత్వం ఆరోపిస్తోంది. నిబంధనలకు విరుద్ధంగా మద్యం పాలసీని మార్చడం ద్వారా ప్రభుత్వ ఖజానాకు సుమారు రూ. 3,500 కోట్ల నుండి రూ. 5,000 కోట్ల వరకు నష్టం వాటిల్లిందని సీఐడీ అభియోగం మోపింది. కొన్ని ప్రత్యేక డిస్టిలరీలకే మేలు చేసేలా టెండర్లు కట్టబెట్టడం, ప్రముఖ బ్రాండ్లను రాష్ట్రం నుండి తప్పించి నాణ్యత లేని లోకల్ బ్రాండ్లను ప్రోత్సహించడం ద్వారా భారీగా ముడుపులు అందాయని కేసు నమోదైంది. ఈ కేసులో గత ప్రభుత్వంలోని కీలక నేతలు, కొందరు ఐఏఎస్ అధికారులు నిందితులుగా ఉండటంతో ఇది రాజకీయంగా పెను దుమారం రేపుతోంది.ఈ కేసు కేవలం ఒక అవినీతి కేసు మాత్రమే కాదు, రాజకీయంగా కూడా ప్రభుత్వానికి అత్యంత ప్రతిష్టాత్మకం. మద్యం కుంభకోణం ద్వారా సామాన్య ప్రజల ఆరోగ్యం దెబ్బతినడమే కాకుండా, రాష్ట్ర ఆదాయానికి పెద్ద ఎత్తున గండి పడిందని ప్రభుత్వం భావిస్తోంది. ఈ కేసులో నిందితులు చాలా బలవంతులు కావడంతో, హైకోర్టులో వారికి బెయిల్ రాకుండా చూడటం, క్వాష్ పిటిషన్లను ఎదుర్కోవడానికి సిద్ధార్థ్ లూత్రా వంటి నిపుణుల అవసరం ఏర్పడింది.సాధారణంగా ప్రభుత్వం నిర్దేశించిన ఫీజు పరిమితుల కంటే సిద్ధార్థ్ లూత్రా ఫీజు ఎక్కువగా ఉన్నప్పటికీ, కేసు ప్రాముఖ్యత దృష్ట్యా నిబంధనలను సడలించి మరీ ఈ నిధులను మంజూరు చేసింది. సిద్ధార్థ్ లూత్రా గతంలోనూ రాష్ట్రానికి సంబంధించిన అనేక హై-ప్రొఫైల్ కేసులను డీల్ చేసిన అనుభవం ఉండటంతో, ప్రభుత్వం ఆయనపైనే పూర్తి నమ్మకం ఉంచింది.ఈ ఫీజులను చెల్లించడానికి ప్రభుత్వం ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ నుండి ప్రత్యేక అనుమతులు తీసుకుంది. అమరావతిలోని డిప్యూటీ పే అండ్ అకౌంట్స్ ఆఫీసర్ ద్వారా ఈ మొత్తాన్ని నేరుగా లూత్రా బ్యాంక్ ఖాతాకు జమ చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. రాష్ట్ర ఖజానాపై ఇంత భారీ భారం పడుతున్నా, మద్యం స్కాం దోషులను బోనులో నిలబెట్టడమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది.

# కేంద్ర కేబినెట్ లో నాగబాబు..?

విజయవాడ, జనవరి 29 (

ఏపీలోశరవేగంగా రాజకీయాలు మారుతున్నాయి. కూటమి అధికారంలోకి వచ్చి 20 నెలలు అవుతోంది. రాజకీయంగా పట్టు బిగించాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ భావిస్తోంది. కానీ ఆ పార్టీకి ఎంత మాత్రం అవకాశం ఇవ్వకూడదని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ భావిస్తున్నారు. అయితే పాలనాపరంగా చంద్రబాబు బిజీగా ఉండగా.. కూటమికి రాజకీయ రక్షణగా పవన్ కళ్యాణ్ ఉ



ంటున్నారు. అందుకే విదేశీ పర్యటనలతో పాటు పెట్టుబడుల అన్వేషణ, అమరావతి రాజధాని నిర్మాణం, పోలవరం వంటి అంశాలపై ఫుల్ ఫోకస్ పెట్టారు చంద్రబాబు. అయితే పవన్ కళ్యాణ్ మాత్రం తన గ్రామీణ శాఖలతో పాటు రాజకీయపరమైన అంశాలకు పరిమితమవుతున్నారు. ఇటువంటి తరుణంలో పవన్ కళ్యాణ్ ఢిల్లీ పర్యటన కొనసాగుతుండడం అనేక రకాల చర్చ నడుస్తోంది. ఈరోజు కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా తో పాటు రైల్వే శాఖ మంత్రి వైష్ణవును కలుసుకోనున్నారు పవన్. రాష్ట్రంలో పెండింగ్ ప్రాజెక్టుల ను పూర్తి చేయడం, కూటమిపరంగా రాజకీయ అంశాలపై కీలక చర్చలు జరుపుతారని తెలుస్తోంది.ఈ ఏడాది జూన్లో ఏపీ నుంచి నాలుగు రాజ్యసభ స్థానాలు ఖాళీ అవుతాయి. అయితే ఆ నాలుగు స్థానాలు టిడిపి కూటమికి దక్కుతాయి. గతంలో రెండు సార్లు రాజ్యసభ పదవులకు ఖాళీ ఏర్పడింది. టిడిపి తో పాటు బిజెపి ఆ పదవులను దక్కించుకుంది. జనసేనకు వివిధ సమీకరణలో భాగంగా చాన్స్ లేకుండా పోయింది. జనసేనకు ఇంతవరకు రాజ్యసభ ప్రాతినిధ్యం లేదు. ఈసారి రాజ్యసభ సీటుతో పాటు కేంద్ర మంత్రివర్గంలో స్థానం దక్కించుకోవాలని పవన్ భావిస్తున్నారు. ప్రస్తుతం ఢిల్లీ పర్యటనలో ఉన్న పవన్ కేంద్ర హోమ్ శాఖ మంత్రి అమిత్ షా తో ఇదే విషయం చర్చిస్తారని తెలుస్తోంది. రాజ్యసభ పదవితో పాటు కేంద్ర మంత్రి పదవి తమ పార్టీకి ఇవ్వాలన్న ప్రతిపాదన ెపెట్టనున్నట్లు సమాచారం. ఒకవేళ జనసేనకు రాజ్యసభ తో పాటు మంత్రి పదవి వస్తే ఎవరికి ఇస్తారు అన్నది ఇప్పుడు ప్రశ్న. ఇప్పటికే జనసేనకు ఇద్దరు లోక్సభ సభ్యులు ఉన్నారు. మచిలీపట్నం నుండి వల్లభనేని బాలశౌరి ఉన్నారు. కేంద్ర క్యాబినెట్లో జనసేనకు అవకాశం ఇస్తే ఆయన పేరును పరిశీలించే అవకాశం ఉంది. అయితే మెగా బ్రదర్ నాగబాబుకు కేంద్ర రాజకీయాలు అంటే ఇష్టం. రాజ్యసభ ద్వారా పెద్దల సభలో అడుగు పెట్టాలని ఆలోచన ఉండేది. ఆ ఛాన్స్ రాకపోయేసరికి సీఎం చంద్రబాబు గత ఏడాది నాగబాబును రాష్ట్ర మంత్రివర్గంలోకి తీసుకుంటామని ప్రకటించారు. అయితే ఎమ్మెల్సీ అయ్యారు కానీ ఏడాది అవుతున్న మంత్రి వర్గంలోకి తీసుకోలేదు. అయితే ఇప్పుడు జనసేనకు రాజ్యసభ పదవి ఇచ్చి కేంద్ర క్యాబినెట్లో ఛాన్స్ ఇస్తే నాగబాబుని పంపిస్తారని ప్రచారం నడుస్తోంది. దానిపై కూడా పవన్ కళ్యాణ్ హోం శాఖ మంత్రి అమిత్ షా తో చర్చిస్తారని జనసేన వర్గాలు చెబుతున్నాయి. మరి ఈ ప్రచారంలో నిజం ఎంత ఉందో చూడాలి

=================

# మోడీ నోట భజన్ క్లబ్బింగ్..

ముంబై, జనవరి 29 (

ప్రధాని నరేంద్రమోదీ ప్రధాని అయిన తర్వాత చేపట్టిన కొత్త కార్యక్రమాల్లో మన్‌కీబాత్ ఒకటి. రేడియో ద్వారా మారుమూల ప్రజలకు సైతం ఆయన సందేశాని పంతున్నాడు. ఇక ప్రతీ మన్‌కీబాద్‌తో ఒక కొత్త విషయాన్ని ప్రస్తావిస్తున్నారు. తెలుగు రాష్ట్రాలకు సంబంధించిన అనేక అంశాలను ఆయన పేర్కొన్నారు. తాజాగా అనంతపూర్ నీటి పొదపుపును ప్రశంసించారు. ఇదే సమయంలో జెన్ జెడ్ యువత చేస్తున్న 'భజన్ క్లబ్బింగ్'ను ప్రస్తావించారు. దీంతో నెటిజన్లలో ఆసక్తి రేగింది. సంప్రదాయ భజనలు, కీర్తనలు, శ్లోకాలతో నైట్‌లైఫ్‌ను పునర్వ్యవస్థీకరించే ఈ ట్రెండ్, ఆధ్యాత్మికతను క్లబ్ కల్చర్‌తో ముడిపెడుతోంది.ఇది కేవలం ట్రెండ్ కాదు.. మానసిక శాంతికి కొత్త మార్గం. లిక్కర్, స్మోకింగ్ లేని ఈ ఈవెంట్లు లైవ్ కాన్సర్ట్‌ల రూపంలో జరుగుతూ, యువతను ఆకర్షిస్తున్నాయి.



పాశ్చాత్య క్లబ్ సంస్కృతిలో డీజేలు, లైటింగ్, డ్యాన్స్ ఫ్లోర్ ఉ ంటే,ఈ భజన్ క్లబ్బింగ్‌లో భక్తి సంగీతం, మాండలిన్, టేబులా లాంటి సంగీత వాద్యాలు కీలకం. రాత్రి సమయంలో జరిగే ఈ కార్యక్రమాలు యువతకు ఒత్తిడి నివారణగా మారాయి. పోస్ట్?కోవిడ్‌లో మానసిక ఆరోగ్య సమస్యలు పెరగడంతో ఇది ట్రెండ్ అవుతోంది. సోషల్ మీడియాలో వైరల్ వీడియోలు దీన్ని ప్రపంచవ్యాప్తం చేశాయి. భారతదేశంలో హైదరాబాద్, ముంబై, బెంగళూరు వంటి నగరాల్లో ఈ ఈవెంట్లు జనాదరణ పొందుతున్నాయి.ఈ ట్రెండ్ యువతలో మానసిక స్థిరత్వాన్ని పెంచుతోంది. స్టడీల ప్రకారం, భజనలు ఆనంద హార్మోన్లను ఉ త్పత్తి చేస్తాయి, ఒత్తిడిని తగ్గిస్తాయి. అలాగే, సాంకేతికత దూరంగా ఉంచి సామూహిక భక్తిని ప్రోత్సహిస్తోంది. సాంస్కృతికంగా, ఇది భారతీయ విలువలను ఆధునిక యువకులకు అనుకూలంగా చేస్తోంది. పాశ్చాత్య ప్రభావాల మధ్య స్వదేశీ ఆధ్యాత్మికతను పునరుజ్జీవనం చేస్తున్నట్లు కనిపిస్తోంది. మోదీ ప్రస్తావన దీన్ని జాతీయ స్థాయికి తీసుకెళ్లింది.అయితే, వాణిజ్యీకరణతో భక్తి స్పృహ క్షీణించే ప్రమాదం ఉంది. కొన్ని ఈవెంట్లు టికెట్ ధరలు ఎక్కువ చేసి డబ్బు సంపాదనపై దృష్టి పెడుతున్నాయి. ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు దీన్ని సమాజకార్యాలతో ముడిపెట్టాలి. భవిష్యత్తులో ఈ ట్రెండ్ గ్లోబల్ స్థాయికి వెళ్లే అవకాశం ఉంది. భారతదేశం యోగా, మెడిటేషన్‌తోపాటు భజన్ క్లబ్బింగ్‌ను 'సాఫ్ట్ పవర్'గా ప్రపంచానికి అందించవచ్చు

# కమలానికి మున్సిపల్ పరీక్ష

హైదరాబాద్, జనవరి 29

ఈసారి పురపోరు బీజేపీకి ప్రతిష్టాత్మకంగా మారనుంది. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో అంతంత మాత్రంగానే సీట్లు దక్కించుకున్న బీజేపీకి ఈ ఎన్నికలు అగ్నిపరీక్ష కానున్నాయి. అధికారంలోని కాంగ్రెస్ పార్టీకి తామే ప్రత్యామ్నాయమని చెప్పుకునే కమలం పార్టీ ఇప్పు డు ఆశలన్నీ మున్సిపల్‌పైనే పెట్టుకుంది. రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షంగా ఎదగాలంటే ప్రతి ఎన్నికల్లోనూ బీజేపీ గెలవాల్సిన పరిస్థితి. ఈ ఫలితాలను బట్టే ప్రజల్లోకి పాజిటివ్ సంకేతాలు వెళ్తాయి.మొదటి నుంచి తమకు అర్బ న్ (పట్టణ) ప్రాంతాల్లోనే బలం ఉందని చెప్పుకుంటున్న బీజేపీ ఈ ఎన్నికల్లో అత్యధికంగా కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు,



వార్డులను కైవసం చేసుకోవాల్సి ఉంటుంది. ఇందులో భాగంగానే వరుసగా ఎన్నికల సన్నాహక సమావేశాలను నిర్వహిస్తూ నాయకులకు ఇన్‌చార్జీలు దిశానిర్దేశం చేస్తున్నారు. ఇప్పటికే జాతీయ నాయకత్వం ముగ్గురు ఎన్నికల ఇన్‌చార్జీలు, కో ఇన్‌చార్జ్‌లను నియమించగా త్వర లోనే జాతీయ అధ్యక్షుడితోపాటు పలువురు జాతీయ నాయకులకు ఏకంగా రంగంలోకి దింపబోతోందిరాష్ట్రంలో ఏడు కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీలు, 2,996 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి. నామినేషన్ ప్రక్రియకు రేపటితో ఆఖరు గడువు. అయితే గత మున్సిపల్ ఎన్నికల్లో 322 కౌన్సిలర్లు, కార్పొరేటర్లను బీజేపీ గెలుచుకుంది. వీటితోపాటు ఐదు మున్సిపల్ చైర్మన్లను బీజేపీ తమ ఖాతాలో వేసుకుంది. మొన్న జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో 5000 మందిని బరిలోకి దింపి 800 నుంచి 1000 వరకు పంచాయతీలను గెలుచుకుంది.గ్రామీణంలో తమకు పెద్దగా బలం లేదని, పట్టణమే తమ బలమని కమలం పార్టీ ముందు నుంచి అంటోంది. ప్రజల్లోనూ బీజేపీ అంటే అర్బన్ పార్టీ అనే ముద్రనే ఉంది. ఇప్పుడిదే బీజేపీకి అగ్నిపరీక్షగా మారింది. మరోవైపు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కూడా అస్త్రశస్త్రాలను సిద్ధం చేసుకుంటున్నాయి. రాజకీయ పార్టీల గుర్తుల మీద ఈ ఎన్నికలు జరుగనుండటంతో పురపోరులో ఏ పార్టీ బలమెంతో స్పష్టమవుతుంది. తమకున్న పేరును నిలుపుకోవాలన్నా...వచ్చే జీహెచ్ఎంసీ, అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించాలన్నా ఈ ఎన్నికల్లో కచ్చితంగా విజయబావుటా ఎగురవేయాల్సిందే.ఇందులో భాగంగానే బీజేపీ ఈసారి పెద్ద టార్గెట్‌ను పెట్టుకుంది. మొత్తం మున్సిపాలిటీల్లో 50 నుంచి 60 శాతం వరకు గెలవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది. అలాగే ఏడు కార్పొరేషన్లలో నాలుగు నుంచి ఐదు వరకు గెలుచుకునేలా వ్యూహాలను అమలు చేస్తోంది. వీటితోపాటు పార్టీ తన ఉనికిని చాటుకునేలా ఎక్కువ కార్పొరేటర్లు, కౌన్సిలర్లను గెలుచుకోవడమే లక్ష్యంగా బరిలోకి దిగుతోంది.నూతనంగా ఎన్నికైన జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్‌తో వారం రోజుల క్రితం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు భేటీ అయ్యారు. ఢిల్లీ నుంచి ఆయన వచ్చిన వెంటనే అత్యవసరంగా పార్టీ పదాధికారుల మీటింగ్ నిర్వహించి నాయకులకు దిశానిర్దేశం చేశారు. జాతీయ నాయకత్వం ఇప్పటికే ముగ్గురిని రంగంలోకి దింపిందని, వారికి మున్సిల్ ఎన్నికల ఇన్‌చార్జ్‌లుగా నియమినస్తూ.. మహారాష్ట్ర మంత్రి ఆశిష్ శెలార్‌కు, కోఇన్‌చార్జ్‌లుగా రేఖా శర్మ, అశోక్‌కు బాధ్యతలను అప్పగించిందని పేర్కొన్నారువీరు ముఖ్యనాయకులతో వరుసగా ఎన్నికల సన్నాహాక సమావేశాలను నిర్వహిస్తూ ఎన్నికల వ్యూహాలను రచిస్తున్నారు. పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలకు ఆయా జిల్లాలు, నియోజకవర్గాలు, పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా ఎన్నికల టాస్క్‌లను అప్పగించారు. వీటికితోడూ ఇప్పటికే జిల్లా, మున్సిపాలిటీల వారీగా మరికొంత మంది రాష్ట్ర నేతలను ఇన్‌చార్జ్‌లుగా రాష్ట్ర నాయకత్వం నియమించింది. రాష్ట్రవ్యాప్తంగా రెండు భారీ బహిరంగ సభలను నిర్వహించాలని పార్టీ నిర్ణయించినట్లు తెలుస్తోంది.ఫిబ్రవరి 7, 9వ తేదీల్లో వీటిని నిర్వహించాలని ప్లాన్ చేసినట్లు తెలిసింది. ఈ సభలను ఉత్తర తెలంగాణ, దక్షిణ తెలంగాణలో నిర్వహించాలని నిర్ణయించారు. తొలుత ఐదు సభలను నిర్వహించాలని అనుకున్న పార్టీ నేతలు దాన్ని రెండుకు కుదించినట్లుగా తెలిసింది. ఈ సభల ద్వారా ఓటర్లను ఆకర్షించేందుకు బీజేపీ జాతీయ స్థాయి దిగ్గజాలను రంగంలోకి దించుతోంది.పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ సిన్హాతో పాటు కీలక నేత అమిత్‌షా హాజరుకానున్నట్లు తెలుస్తోంది. అయితే ఎన్నికలకు చాలా తక్కువ సమయం ఉండడంతో ఎన్ని సభలు నిర్వహిస్తారో...ఎంత మంది నేతలు వస్తారనేది ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావాలంటే కమలనాథులకు ఈ పురపోరు ఎన్నికలు మాత్రం పరీక్షే అని చెప్పాలి.

# 'సింహం' గుర్తుపై జాగృతి అభ్యర్థుల పోటీ

హైదరాబాద్, జనవరి 29,

తెలంగాణ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో తెలంగాణ జాగృతి, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ కలిసి పోటీ చేయనున్నాయి. జాగృతి అభ్యర్థులు ఫార్వర్డ్ బ్లాక్ 'సింహం' గుర్తుపై పోటీ చేయనున్నారు. ఇక తొలిరోజు 902 నామినేషన్లు దాఖలు కాగా.. ఫిబ్రవరి 11న పోలింగ్ జరగనున్న సంగతి తెలిసిందే.తెలంగాణ మున్సిపల్ ఎన్నికల నగారా మోగడంతో రాష్ట్ర రాజకీయాలు హీటెక్కాయి. ప్రధాన పార్టీలతో పాటు చిన్న పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు తమ వ్యూహాలకు పదును పెడుతున్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత మద్దతుదారులు ఎన్నికల బరిలో నిలిచేందుకు సిద్ధమయ్యారు. ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీతో కలిసి పోటీ చేసేందుకు రెడీ అయ్యారు.ఈ మేరకు జాగృతి అధ్యక్షురాలు కవిత, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర నాయకత్వం మధ్య జరిగిన కీలక చర్చలు ఫలించాయి. రానున్న పురపాలక ఎన్నికల్లో తెలంగాణ జాగృతికి చెందిన ఔత్సాహిక అభ్యర్థులు ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీకి చెందిన 'సింహం' గుర్తుపై పోటీ చేయాలని నిర్ణయించారు. కేవలం ఈ ఎన్నికలకే పరిమితం కాకుండా.. భవిష్యత్తులో కూడా ప్రజా సమస్యలపై ఉమ్మడిగా పోరాడాలని ఇరు పక్షాలు అంగీకారానికి వచ్చాయి. హైదరాబాద్‌లోని ఫార్వర్డ్ బ్లాక్ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశం, కొత్త రాజకీయ సమీకరణాలకు నాంది పలికింది.ఇక బుధవారం నామినేషన్ల స్వీకరణ మొదటి రోజే అభ్యర్థులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. మొత్తం 2,996 వార్డులకు గాను తొలిరోజే 902 నామినేషన్లు దాఖలయ్యాయి. 890 మంది అభ్యర్థులు పోటీలో నిలవగా.. కొందరు అభ్యర్థులు రెండేసి సెట్ల నామపత్రాలను సమర్పించారు. క్షేత్రస్థాయిలో తమ పట్టు నిరూపించుకునేందుకు అభ్యర్థులు ఉత్సాహం చూపుతున్నారు. మొదటి రోజు నామినేషన్ల పర్వంలో కాంగ్రెస్ పార్టీ అత్యధికంగా 382 నామినేషన్లతో అగ్రస్థానంలో నిలిచింది. బీఆర్ఎస్ 258 నామినేషన్లతో రెండవ స్థానంలో ఉండగా, బీజేపీ నుంచి 169 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు.నామినేషన్ల స్వీకరణకు శుక్రవారమే ఆఖరి గడువు కావడంతో.. నేడు, రేపు అభ్యర్థుల తాకిడి భారీగా పెరిగే అవకాశం ఉంది. దీనిని దృష్టిలో ఉంచుకుని ఎన్నికల అధికారులు ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అదనపు సిబ్బందితో ప్రక్రియను వేగవంతం చేస్తున్నారు. కాగా.. ఫిబ్రవరి 11న మున్సిపల్ ఎన్నికల పోలింగ్ జరగనున్నాయి.


తెలంగాణ రాజకీయాల్లో కొత్త సమీకరణాలు ఏర్పడే అవకాశం ఉంది.

ఈ పరిణామం ముఖ్యమైంది ఎందుకంటే తెలంగాణ జాగృతి సాధారణంగా సాంస్కృతిక, సామాజిక సంస్థగా పిలుస్తున్నా, ఇప్పుడు నేరుగా ఎన్నికల బరిలోకి దిగడం ద్వారా తన రాజకీయ బలాన్ని ప్రదర్శించాలని చూస్తోంది. ఫార్వర్డ్ బ్లాక్ పార్టీకి చెందిన "సింహం" చిహ్నం ఇప్పటికే రాష్ట్ర ప్రజలకు పరిచయమైందని, జాగృతి కార్మికుల చేరిక దాన్ని మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఉ పయోగపడుతుందని కవిత భావిస్తున్నారు. ఈ ఒప్పందం తెలంగాణ స్థానిక రాజకీయాల్లో కొత్త ఎత్తుగడకు కారణమవుతుందని అంటున్నారు. ఈ మధ్య కవిత, ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్‌తో సమావేశమయ్యారు. రాజకీయ పార్టీ ఏర్పాటు, విధి విధాలు, ప్రచార వ్యూహాలపై లోతుగా చర్చించారు. ఆ పనులు ఒకవైపు సాగుతుండగానే మరోవైపు మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసి అసలైన బలాన్ని అంచనా వేసుకోవాలని కవిత భావిస్తున్నారు. అందుకే ఈ నిర్ణయం తీసుకున్నారు.

# మేడారంలో భగ్గుంటున్న ధరలు

వరంగల్, జనవరి 29,

మేడారం జాతర ప్రారంభమైంది. వనదేవతల దర్శనానికి భక్తులు భారీగా తరలివస్తున్నారు. అయితే, జాతర నేపథ్యంలో కొబ్బరికాయల నుంచి కోళ్లు, మేకల ధరలు, ఇళ్ల అద్దెల వరకు అన్నీ ఆకాశాన్నంటుతున్నాయి.



స్థానికులు ఇళ్లలో కనీస వసతులు లేకున్నా అధిక మొత్తంలో అద్దెలు వసూలు చేస్తూ భక్తులను దోచుకుంటున్నారు. చెట్టు నీడకు కూడా కిరాయి వసూలు చేయడం గమనార్హం. ఈ మూడు రోజులు ధరలు మరింత పెరుగుతాయంటున్నారు. పెరిగిన ధరలతో భక్తులు ఇబ్బంది పడుతున్నారు.తెలంగాణ కుంభమేళా మేడారం జాతర ప్రారంభమైంది. నేటి నుంచి నాలుగు రోజుల పాటు జరగనున్న వనదేవతల జాతరకు భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాక, పక్క రాష్ట్రాల నుంచి కూడా భారీ సంఖ్యలో భక్తులు తరలివస్తున్నారు. తెలంగాణ జాతరకు వెళ్లే భక్తుల కోసం టీజీఆర్టీసీ 4 వేల బస్సులు ప్రత్యేకంగా ఏర్పాటు చేసింది.దిలా ఉంటే జాతర నేపథ్యంలో మేడారం పరిసర ప్రాంతాల్లో ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. కొబ్బరికాయ మొదలు అమ్మలకు సమర్పించే బంగారం (బెల్లం), కోళ్లు, మేకల ధరలతో పాటు, ఇళ్లు, ప్రత్యేక గదుల అద్దెలను భారీగా పెంచి భక్తులను దోచుకుంటున్నారు. ఆఖరికి చెట్టు నీడకు కూడా కిరాయి వసూలు చేస్తున్నారంటే జాతరలో దోపిడీ ఏ స్థాయిలో జరుగుతుందో ఊహించవచ్చు.మేడారం జాతరలో భాగంగా భక్తులు మొక్కులు చెల్లించుకోవడానికి బంగారం (బెల్లం)తో పాటు కోళ్లు, మేకలను సమర్పిస్తారు. ఇదే అదునుగా మేడారం జాతర వద్ద కోళ్లు, మేకల ధరలను భారీగా పెంచారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు వెంట తీసుకురాలేక, జాతరకు వచ్చాక అక్కడే కొనుగోలు చేస్తుంటారు. ఈ క్రమంలో వ్యాపారులు ధరలను రెట్టింపు చేశారు.మేకపోతు లైవ్ కిలో రూ. 420 ఉండగా, మేడారంలో మాత్రం రూ. 900 నుంచి రూ. 1000 వరకు అమ్ముతున్నారు. మటన్ ధర రూ. 1500 వరకు పలుకుతోంది. బయట రూ. 170-180 కి దొరికే కిలో కోడిని జాతర దగ్గర రూ. 300-350 వరకు అమ్ముతున్నారు. మొన్నటి వరకు కూడా కిలో రూ. 350-400 ఉన్న నాటుకోడిని ఇప్పుడు రూ. 700లకు అమ్ముతున్నారు. జాతర చివరి మూడు రోజుల్లో ఈ ధరలు మరింత పెరిగే అవకాశం ఉంది.ఇళ్ల అద్దెలు కూడా భక్తులకు చుక్కలు చూపిస్తున్నాయి. కనీస వసతి సౌకర్యాలు లేకపోయినా సరే అద్దెలు ఆకాశాన్నంటాయి. ఆఖరికి చెట్ల నీడలో సేదతీరడానికి కూడా అద్దెలు వసూలు చేస్తున్నారు. పిల్లలు, వృద్ధులతో వచ్చిన భక్తులు ఉండటానికి ఇళ్లు వెతుకుతుండటంతో స్థానికులు భారీ మొత్తంలో అద్దెలు వసూలు చేస్తున్నారు. ఒక్క ఫ్యాన్ తప్ప మరే ఇతర సౌకర్యాలు లేని గదులకు కూడా రోజుకు రూ. 6 వేల వరకు వసూలు చేస్తున్నారు.గదులు దొరకని వారు చెట్ల నీడలో సేదతీరడానికి ప్రయత్నిస్తుండగా, తోట యజమానులు వాటికి కూడా అద్దెలు వసూలు చేస్తున్నారు. జాతరకు దగ్గరలో తోటలున్న స్థానికులు భక్తులకు చెట్లను అద్దెకు ఇస్తున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేయడానికి ఒక్కో చెట్టుకు రూ. 1000 చొప్పున వసూలు చేస్తున్నారు.

# గ్యాంగ్‌స్టర్ నయీం కేసులో ఈడీ ఛార్జిషీట్..

హైదరాబాద్, జనవరి 29,

గ్యాంగ్‌స్టర్ నయీం అక్రమాస్తుల కేసులో ఈడీ దూకుడు పెంచింది. రూ. 11.30 కోట్ల విలువైన 35 ఆస్తులు.. నయీం అక్రమంగా సంపాదించినట్లు ఛార్జిషీట్ దాఖలు చేసింది. ఆ ఆస్తులను అతడి కుటుంబ సభ్యులు, సన్నిహితులు ఇతర



బినామీల పేర్లపై రిజిస్టర్ చేసినట్లు గుర్తించారు. అంతేకాకుండా నయీం అక్రమాస్తుల విషయంలో పోలీసు, రాజకీయ సంబంధాలపై కూడా ఈడీ ఆరా తీస్తోంది. 2016లో జరిగిన ఎదురుకాల్పుల్లో నయీం హతం అయ్యాడు. గ్యాంగ్‌స్టర్ నయీం 2016లో జరిగిన ఎదురుకాల్పుల్లో మృతి చెందిన విషయం తెలిసిందే. అతడికి సంబంధించిన అక్రమాస్తుల కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) వేగం పెంచింది. నయీంపై జరిగిన మనీలాండరింగ్ ఆరోపణలపై ఈడీ దర్యాప్తు జరిపింది. తాజాగా నాంపల్లి కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేశారు. ఈడీ దాఖలు చేసిన ఛార్జిషీట్‌ను పరిశీలించిన కోర్టు విచారణకు అంగీకరించింది. కాగా, గ్యాంగ్‌స్టర్ నయీం.. తన గ్యాంగ్ సభ్యులతో కలిసి దాదాపు రూ. 11. 30 కోట్ల విలువైన 35 ఆస్తులను అక్రమంగా సంపాదించినట్లు ఈడీ ఛార్జిషీటులో పేర్కొంది.

కాగా, నయీంకు సంబంధించిన అక్రమాస్తులపై ఈడీ 10 మందిపై అభియోగాలు మోపింది. ఛార్జిషీట్ ప్రకారం.. నయీం యాదాద్రి భువనగిరి జిల్లాలోని షాపింగ్ కాంప్లెక్స్‌లు, వ్యవసాయ భూములు కూడా ఉన్నాయి. ఈ ఆస్తులన్నీ నయీం తన కుటుంబ సభ్యులు, సన్నిహితులు ఇతర బినామీల పేర్లపై రిజిస్టర్ చేసినట్లుగా ఈడీ అధికారులు గుర్తించారు. కాగా, నయీం అక్రమాస్తుల కేసులో అతడి భార్య హసీనా బేగంతో పాటు పలువురు కుటుంబ సభ్యుల పేర్లను ఈడీ తన ఛార్జిషీట్‌లో పేర్కొంది. అయితే ఈడీ ఆరోపిస్తున్న అక్రమాస్తులకు సంబంధిచి కొన్నిసార్లు నోటీసులు జారీ చేసినా.. స్పందించకపోవడం, ఐటీఆర్ పత్రాలు చూపించకపోవడంతో కేంద్ర దర్యాప్తు సంస్థ చర్యలు తీసుకునేందుకు సిద్ధమైంది. మరోవైపు, నయీంకు ఉన్న పోలీసులు, పొలిటికల్ సంబంధాలపై కూడా ఈడీ కూపీ లాగుతున్నట్లు తెలుస్తోంది. అక్రమంగా సంపాదించిన సొమ్ము ఎక్కడికి వెళ్లింది.. ఇందులో అధికారులు, రాజకీయ నాయకుల హస్తం ఏమైనా ఉందా అనే కోణంలో ఈడీ దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం. కాగా, ఈ కేసులో త్వరలో నిందితులకు కోర్టు నోటీసులు జారీ చేయనున్నట్లు తెలుస్తోంది.

తెలుగు రాష్ట్రాల్లో అండర్ వరల్డ్ డాన్‌గా పేరున్న నయీం 2016 ఆగస్టు 8న ఎన్‌కౌంటర్‌లో హతమయ్యాడు. భూ సెటిల్‌మెంట్లు, చేస్తూ తనకంటూ ఓ గ్యాంగ్ ను మెయింటెన్ చేస్తూ ప్రభుత్వాలను ముచ్చెమటలు పట్టించాడు.

దీంతో ఇతడి అక్రమాలపై తెలంగాణ ప్రభుత్వం ఫోకస్ పెట్టింది. ఈ క్రమంలో నందిగామ గ్రామంలోని మిలీనియం టౌన్ షిప్ లోని ఓ వ్యక్తి ఇంట్లో ఉంటూ స్థానిక భూదందాలు చేస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. అనంతరం వారున్న స్థలానికి వెళ్లగా.. పోలీసులకు నయీం అనుచరులు కాల్పులు జరిపారు. ఆ తర్వాత పోలీసులు జరిపిన ఎదురు కాల్పుల్లో నయీం మృతి చెందాడు.ఐపీఎస్ వ్యాస్, మావోయిస్టు సాంబశివుడి వంటి వారి హత్య కేసులో నయీం ప్రధాన నిందితుడిగా ఉన్నాడు. కాగా, నయీం మృతితో బాధితులంతా బయటకు వచ్చి ఫిర్యాదులు చేశారు. దీంతో బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ కేసు విచారణకు సిట్ ఏర్పాటు చేసింది. నయీంపై దాదాపు 250 కేసులు నమోదు చేయగా మనీ లాండరింగ్ ఆరోపణలపై ఈడీ రంగంలో దిగి దర్యాప్తు చేపట్టింది.

# మొక్కు తీర్చుకునేందుకు ఎడ్లబండ్లే...

వరంగల్, జనవరి 29,

మేడారం సమ్మక్క సారలమ్మ జాతర అత్యంత వైభంగా జరుగుతోంది. హైదరాబాద్ నుంచి ఆదిలాబాద్ వరకూ మాత్రమేకాదు, తెలుగు రాష్ట్రాలు, దూరప్రాంతాల నుంచి రోజూ లక్షలాదిగా భక్తులు వేడారం జతరకు తరలివెళు తున్నారు.మేడారం సమ్మక్కా ,సారలమ్మ జాతర దర్శించుకోవడానికి



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోని వివిధ ప్రాంతాల నుంచి కాలినడకన వచ్చేవారు. ఆ తరువాత కాలంలో ఎడ్ల బండ్లపై రావడం ఆనవాయితీగా మారింది. వ్యవసాయ ఆధారిత గ్రామాలు కావడంతో తెలుగు రాష్ట్రాల నుంచి ఎడ్లబండ్లపై అమ్మవారి జాతరకు ఓ నాలుగు రోజుల ముందే కుటుంబ సమేతంగా బయలుదేరేవారు. ముఖ్యంగా తెలంగాణలో ప్రతీ గ్రామం నుంచి బండెనక బండి కట్టి, పదహారు బళ్లు కట్టి అన్నట్లుగా ఒక్కో ఊరు నుంచి వందల బళ్లు మేడారం జాతరకు కదిలేవి. ఈ ఏడాది కూడా ఎడ్ల బండి సెంటిమెంట్ విషయంలో ఎక్కడా తగ్గేదే లేదంటున్నారు మేడారం భక్తులు. ఏఐ యుగంలోకి ప్రవేశించినా ఎడ్ల బండ్లంటేనే అమ్మవారికి మహా ఇష్టమంటున్నారు. ఈ ఏడాది మేడారం జాతరకు తెలంగాణ ప్రభుత్వం గతంలో ఎన్నడూ లేనంతగా అద్భుతంగా ఏర్పాట్లు చేసింది. మేడారం ప్రాంగణాన్ని వందల కోట్లతో కన్నుల పండుగగా అభివృద్ధి చేయడమేకాదు, దూర ప్రాంతాల నుండి మేడారం వెళ్లే భక్తుల కోసం వేలాదిగా ఆర్టీసి బస్సు సర్వీసులు నడపడమేకాదు, ఏకంగా తొలిసారి రెండు హెలికాప్టర్ల ను ఏర్పాటు చేసి గంటన్నరలో మేడారం దర్శనం చేసి తీసుకొచ్చేందుకు సర్వం సిద్దం చేసింది. హనుమకొండలో మీరు అలా హెలికాప్టర్ ఎక్కితే కేవలం 35 నిమిషాల్లో మేడారం , 30నిమిషాల్లోపు మేడారం దర్శనం, మరో 35 నిమిషాల్లో తిరిగి హనుమకొండకు చేర్చేలా హెలికాప్ట్ సేవలు అందుబాటులోకి తెచ్చారు. ఒక్కో వ్యక్తికి 36వేలు టిక్కెట్ ఖర్చుతో మొత్తం మేడారం దర్శనం అనుభూతి కల్పిస్తున్నారు.కేవలం గంటన్నరలోనే దర్శనం పూర్తి చేసుకునే అవకాశంతోపాటు అందుబాటులో ఆర్టీసి బస్సులు, ప్రవేటు వాహనాలు ఇలా అనేక మార్గాల ద్వారా మేడారం చేరుకునే సదుపాయాలు ఉన్నా, నేటికీ తెలంగాణలోని అనేక గ్రామాల నుండి ఎడ్ల బండ్లపై భక్తులు భారీగా తరలిరావడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. మాకు మగ బిడ్డ పుడితే ఎడ్ల బండిపై మేడారం వస్తామని మొక్కుకున్నాం. అమ్మ అనుగ్రహించింది ,మగ బిడ్డ పుట్టాడు. అందుకే ప్రతీ ఏడాది ఎడ్ల బండిపైనే మేడారం గద్దెలను దర్శించుకుంటున్నామని జాతరకు వస్తున్న కొందరు భక్తులు చెబుతున్నారు. ఇలా కొందరు సంతానం కోసం, మరికొందరు అనుకున్నది సాధించడం కోసం.. ఇలా మొక్కులు తీరడంతో ఎడ్ల బండ్లపైనే ప్రతీ జాతరకు సుదూర ప్రాంతాల నుండి సైతం తరలివస్తున్నారు.ఒక్కో ఎడ్ల బండిపై ఒక్కో కుటుంబం , వారితోపాటు అమ్మవారికి మొక్కులు తీర్చుకోవడానికి మేకపోతు,నాటు కోడి, నాలుగు రోజులకు అవసరమైన మద్యం, ఎడ్లకు ఓ ఐదు రో?జులకు సరిపడా ఎండుగడ్డి, ఎడ్ల బండ్లు మధ్యలో ఆపి సేదతీరెందుకు , పొలామధ్యలో డారాలు వేసి రాత్రి సమయంలో నిద్రించేందుకు పరదాలు, వంటకు అవసరమైన రైస్, కూరగాయలు, ఉప్పు, పప్పు, కట్టెలు, ఇలా అన్నీ ఎడ్ల బండిపైన సర్దుకుని మేడారం జాతరకు కుటుంబ సమేతంగా బయలుదేరడం తరతరాలుగా లక్షలాది మంది భక్తులకు ఓ సెంటిమెంట్ గా వస్తోంది. తెల్లవారుజామున లేచి, ఆరోజుకు సరిపడా మూడుపూటల భోజనం సిద్దం చేసుకుని ఇంటి వద్ద మొదలైన మేడారం ప్రయాణం, ప్రతీ పది లేదా పదిహేను కిలోమీటర్లకోసారి ఎడ్లను ఆపి, కాసేపు అందమైన పంటచేల మధ్యలో , ఆహ్లాదరకమైన అడవి మార్గంలో సేద తీరుతీరుతుంటారు. వాగులకు సమీపంలో భోజనం చేయడం, రాత్రి సమయంలో అక్కడే డేరాలు వేసుకుని నిద్రించడం, తిరిగి తెల్లవారుజామున మళ్లీ ప్రయాణం మొదలుపెట్టడం.. ఇలా మేడారం చేరుచుకునే మార్గమధ్యలో ఎడ్లబండి ప్రయాణం అంటే మాటల్లో చెప్పలేని సరికొత్త అనుభూతి అనడంలో ఏ మాత్రం సందేహంలేదు.అన్నదమ్ములు, ఆడపడుచులు, అక్క చెల్లెళ్లు , అత్త కోడళ్లు.. ఇలా అంతా తమ ఎడ్లబండ్లపై మేడారం సమీపంలో ఒకేచోటకు చేరుకుంటారు. అక్కడే ఎడ్లబండ్లకు డేరాలు కట్టి గుడారాలుగా మార్చుకుంటారు. అలా నాలుగు రోజులపాటు మేడారం పరిసర ప్రాంతాల్లో ఎన్నో కుటుంబాలు ఒక్కటై మేడారం గద్దెల వద్ద మొక్కులు తీర్చుకుంటారు. మందు ,ముక్క లేకుండా జాతర పూర్తవ్వదనే విషయం తెలిసిందే.. అలా సరదాగా గడపడం కోసం రెండేళ్ల కోసారి తెలంగాణలో రైతుల కుటుంబాలేకాదు, రైతులను నమ్ముకున్న ఎద్దులు సైతం ఎదురుస్తుంటాయట, ఓ ఏడాది జాతరకు వెళ్లిన ఎద్దులు, అదే మార్గం గుర్తుపెట్టుకుని రైతు చెప్పకుండానే మేడారం జాతర వద్దకు తీసుకెళ్లడం మరో విశేషంగా చెప్పవచ్చు.

# యూటర్న్ లో దానం...?

హైదరాబాద్, జనవరి 29,

తెలంగాణలో పార్టీ ఫిరాయింపుల ఎమ్మెల్యేలలో ఏడుగురికి అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ క్లీన్ చిట్ ఇచ్చారు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి విషయం తేల్చాల్సి ఉంది. ఫిరాయింపులపై ఇదే లాస్ట్ ఛాన్స్ అని సుప్రీం కోర్టు ఇప్పటికే డెడ్‌లైన్ విధించింది. ఈ నేపథ్యంలో ఇప్పుడు ఈ ముగ్గురి లెక్క తేల్చే పనిలో పడ్డారు స్పీకర్.ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు స్పీకర్ ఈసారి కఠినమైన నోటీసుల జారీ చేశారు. ఏది ఏమైనా ఈనెల 30లోగా విచారణకు హాజరు కావాలని ఆదేశించారు. పార్టీ ఫిరాయింపులపై వివరణ ఇవ్వాలని పేర్కొన్నారు. లేదంటే పార్టీ ఫిరాయించినట్లుగానే పరిగణించాల్సి ఉంటుందని పరోక్షంగా చెప్పారు. తాజా నోటీసులు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమయ్యాయి.స్పీకర్ తీర్మానం ప్రకారం, దానం నాగేందర్‌ను ఈ నెల 30 తేదీన విచారణకు కట్టుబడి హాజరు కావాలి. లేదంటే ఇది సభా నియమాల ఉల్లంఘనలకు సంబంధించిన చర్యగా కనిపిస్తోంది. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకే దానం నాగేందర్‌కు నోటీసులు పంపినట్లు సమాచారం. పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పైచేయి సాధించింది. మున్సిపల్ ఎన్నికల్లోనూ సాధిస్తామన్న ధీమాతో ఉంది. ఆ నమ్మకంతోనే దానంతో రాజీనామా చేయించే ఆలోచనలో కాంగ్రెస్ అధిష్టానం ఉన్నట్లు తెలుస్తోంది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల తరహాలో దానంతో కాంగ్రెస్ టికెట్‌పై మళ్లీ పోటీ చేయించాలన్న ఆలోచన ఉన్నట్లు సమాచాం.ఇక దానం విచారణకు వస్తే అడ్డంగా దొరికిపోతారు. ఎందుకంటే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ టికెట్‌పై గెలిచిన దానం.. లోక్‌సభ ఎన్నికల్లో ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేకుండానే కాంగ్రెస్ టికెట్‌పై సికింద్రాబాద్ ఎమ్మెల్యేగా పోటీ చేశారు. ఒక పార్టీ ఎమ్మెల్యేగా ఉంటూ మరో పార్టీ టికెట్‌పై పోటీ చేడయడం పార్టీ ఫిరాయింపు కిందకే వస్తుంది. దీంతో విచారణలో తాను బీఆర్ఎస్‌లో ఉన్నానని చెప్పి తప్పించుకునే అవకాశం లేదు.సుప్రీం కోర్టు డెడ్‌లైన్ నేపథ్యంలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, కాంగ్రెస్ అధిష్టానం అన్నింటికి సిద్దపడ్డట్లు తెలుస్తోంది. ఒకవైపు కాంగ్రెస్ కండువా కప్పుకుని, ఆ పార్టీ తరపున ఎంపీగా పోటీ చేసినప్పటికీ, సాంకేతికంగా తాను పార్టీని వీడలేదని వాదించడం ద్వారా అనర్హత వేటు పడకుండా చట్టపరమైన లొసుగులను వెతుక్కున్నట్లుగా కనిపిస్తోంది. దానం నాగేందర్ తన వివరణలో వినిపించిన అత్యంత కీలకమైన వాదన ఆయన వ్యక్తిగత హోదా . 2024 మార్చిలో తాను కాంగ్రెస్ పార్టీ సమావేశానికి హాజరైన మాట వాస్తవమేనని అంగీకరిస్తూనే, అది కేవలం వ్యక్తిగత హోదాలో మాత్రమేనని, దానిని పార్టీ మార్పిడిగా పరిగణించలేమని ఆయన సమర్థించుకున్నారు. మీడియా కథనాల ఆధారంగా తాను పార్టీ



మారినట్లు బీఆర్ఎస్ భావించడం సరికాదని, చట్టపరంగా తాను బీఆర్ఎస్ ఎమ్మెల్యేగానే కొనసాగుతున్నానని ఆయన వాదిస్తున్నారు. పార్టీ తనను సస్పెండ్ చేసినట్లు కూడా ఎలాంటి సమాచారం లేదని చెప్పడం ద్వారా, బంతిని మళ్లీ బీఆర్ఎస్, స్పీకర్ కోర్టులోకి నెట్టారు. అయితే దానం నాగేందర్ కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్న దృశ్యాలు, కాంగ్రెస్ అభ్యర్థిగా సికింద్రాబాద్ నుండి లోక్‌సభకు పోటీ చేసిన రికార్డులు కళ్లముందే ఉన్నాయని బీఆర్ఎస్ నేతలంటున్నారు. రాజ్యాంగంలోని పదో షెడ్యూల్ ప్రకారం స్వచ్ఛందంగా పార్టీ సభ్యత్వాన్ని వదులుకోవడం అనే నిబంధన దానంకు స్పష్టంగా వర్తిస్తుందని, ఎంపీగా కాంగ్రెస్ టికెట్‌పై పోటీ చేయడమే దానికి అతిపెద్ద నిదర్శనమని బీఆర్ఎస్ వాదిస్తోంది. ఈ పరిస్థితుల్లో దానం చేసిన వ్యక్తిగత హోదా వాదన కేవలం కాలయాపన చేసేందుకు ఆడుతున్న నాటకమని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. మొదట దానంపై అనర్హత వేటు వేయకుండానే రాజీనామా చేయించే ఆలోచనలో ఉంది. స్పీకర్ నోటీసుల నేపథ్యంలో దానం రేపో మాపో రాజీనామా చేసే అవకాశం ఉంది. దీంతో మరో ఆరు నెలల్లో ఖైరతాబాద్‌కు ఉప ఎన్నికలు రానున్నాయి. ఉప ఎన్నికలకు కాంగ్రెస్ అధిష్టానం సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది.

# రేవంత్ శాఖ నే టార్గెట్ చేసిన కోమటిరెడ్డి

నల్గొండ, జనవరి 29,

తెలంగాణ రాజకీయాలలో సంచలనాలు అంతకంతకు చోటు చేసుకుంటున్నాయి. ఎప్పుడు ఎటువంటి పరిణామం జరుగుతుందో అర్థం కావడం లేదు. మంత్రుల నుంచి మొదలు పెడితే ప్రతిపక్ష నాయకుల వరకు ప్రతి ఒక్కరు ఏదో ఒక విధమైన కామెంట్లు చేస్తున్నారు. అవి కాస్త సోషల్ మీడియా నుంచి



ప్రధాన మీడియా వరకు వివరీతంగా చర్చలో ఉంటున్నాయి.ఇటీవల కోమటిరెడ్డి వెంకటరెడ్డి పై ఓ న్యూస్ ఛానల్ కథనాన్ని ప్రసారం చేసింది. ఈ కథనం తెలంగాణ రాజకీయాలనే కాదు ఏకంగా ఏపీ రాజకీయాలను కూడా ప్రభావితం చేసింది. ఈ వ్యవహారంలోకి కొంతమంది మీడియా ప్రతినిధులు ప్రవేశించడంతో మరింత వివాదంగా మారింది. దీనిపై ఏకంగా ముఖ్యమంత్రి స్పందించడం.. ఉప ముఖ్యమంత్రి కలగజేసుకోవడం.. ఆ తర్వాత బొగ్గు టెండర్లను రద్దు చేయడం వంటి పరిణామాలు జరిగాయిఈ పరిణామాల కంటే ముందు కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పందించారు. విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కీలక వ్యాఖ్యలు చేశారు. తన మీద కక్ష తీరకపోతే.. ఇంత విషం పెట్టి చంపాలని ఆవేదనతో మాట్లాడారు. ఆయన మాట్లాడిన మాటలు ఒకరకంగా తెలంగాణ రాజకీయాలలో సంచలనం సృష్టించాయి. ఇప్పుడు వాటిని మర్చిపోకముందే కోమటిరెడ్డి వెంకటరెడ్డి మరోసారి తనదైన శైలిలో వ్యాఖ్యలు చేశారు.కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రస్తుతం తెలంగాణ క్యాబినెట్లో కీలకమైన మంత్రిగా కొనసాగుతున్నారు. ఈ క్రమంలో ఆయన తెలంగాణ విద్యా వ్యవస్థకు సంబంధించి కీలక వ్యాఖ్యలు చేశారు. '' నేనే విద్యాశాఖ మంత్రిని అయితే కార్పొరేట్ పాఠశాలలను మూసి వేస్తాను. నారాయణ కాలేజీలో డిగ్రీ చేసిన వారు ఉంటే ప్రభుత్వ కాలేజీలలో పీహెచ్డీ చేసిన వారు ఉంటారు. ఏ ఉద్యోగం రాకుండా లక్షల ఉద్యోగం చేస్తున్నారు. బట్టి పట్టిస్తే వందల మంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకోవాలి. విద్య అనేది వ్యాపారం కాదు. విద్యను వ్యాపారంగా మార్చడం సరికాదని" కోమటిరెడ్డి అన్నారు. మంగళవారం నల్గొండలో జరిగిన ఓ సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.తెలంగాణ రాష్ట్రంలో విద్యాశాఖను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యవేక్షిస్తున్నారు. రేవంత్ రెడ్డి పర్యవేక్షిస్తున్న శాఖను ఉద్దేశించి కోమటిరెడ్డి ఆ వ్యాఖ్యలు చేయడంతో సహజంగానే రాజకీయంగా చర్చకు దారి తీస్తోంది. కోమటిరెడ్డి మాట్లాడిన మాటలను గులాబీ మీడియా విపరీతమైన నెగిటివ్ ప్రచారం చేస్తోంది.. అయితే తాను చేసిన వ్యాఖ్యలను వేరే కోణంలో చూడవద్దని ఇప్పటికే కోమటిరెడ్డి వెంకటరెడ్డి చెప్పడం గమనార్హం.

# కులగణన విషయంలో మాట తప్పిన బీజేపీ : కల్వకుంట్ల కవిత

హైదరాబాద్.✓, జనవరి 29,

దేశ వ్యాప్తంగా జనగణన, కులగణన పై ఎక్సర్ సైజ్ జరుగుతోంది. నిజానికి పదేళ్ల కు ఒకసారి జనగణన చేయాలి. 2021 లో జనగణన చేయాల్సి ఉండే.కానీ కోవిడ్ కారణంగా జనగణన చేయలేదని జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత



అన్నారు.

గురువారం బంజారాహిల్స్ ఖాజా మాన్షన్ లో జరిగిన జాతీయ జన గణనలో కులగణన – సమగ్ర చర్చ రౌండ్ టేబుల్ సమావేశం లో ఆమె మాట్లాడారు.

కవిత మాట్లాడుతూ ఐతే కులగణన పై అన్ని రాష్ట్రాల్లో డిమాండ్ రావటంతో కేంద్రం అందుకు అంగీకరించింది. నిజానికి కులగణన చేయాలన్న బుద్ధి బీజేపీ రావటం మమ్మల్ని ఆశ్చర్యపరించింది. జనగణన చేసినప్పుడే ఏ వర్గం ఎంత ఉంది? వారికి బడ్జెట్, ఉద్యోగ అవకాశాలు ఎలా ఉంటాయన్నది తెలుస్తుంది. కులగణనకు కేంద్రం ముందుకు రావటంతో సంతోషించాం. కానీ ఎప్పుడైతే డాక్యుమెంట్ విడుదల చేశారో అప్పుడే వాళ్ల బుద్ధి బయట పడింది. ఎస్సీ, ఎస్టీ ల కాలం పెట్టారు. ఓబీసీ లేకుండా కులం అనే కాలం మాత్రమే డాక్యుమెంట్ లో పెట్టారు. దీని ద్వారా భారతీయ జనతా పార్టీ...భారత ప్రజలను మోసం చేస్తోందని అన్నారు.

కులాల విషయంలో ఒక్కో రాష్ట్రంలో ఒక్కో విధంగా కులాలను పిలుస్తారు. నన్నే తీసుకుంటే నేను వెలమ. తెలంగాణలో ఓసీ, మహారాష్ట్రలో ఎస్సీ, ఏపీ లో బీసీని. చిన్న సంఖ్యలో ఉన్న కులానికే ఇన్ని వైరుధ్యాలు ఉన్నాయి. మరి 56 శాతం ఉన్న బీసీల విషయంలో ఎంత గందరగోళం ఉంటుందో ఆలోచించాలి. గతంలో అగ్రకులాల్లో పేదలకు రిజర్వేషన్లు ఇచ్చారు. వాళ్లు ఏ కేటగిరీలో వస్తారో చెప్పలేదు. ఇవ్వాళ మన రౌండ్ టేబుల్ సమావేశానికి అన్ని కమ్యూనిటీల వాళ్లు వచ్చారు.

మనం ఇచ్చే అభిప్రాయం రిజర్వేషన్ల విషయంలో కేంద్రానికి సూచికలా ఉండాలి. బీజేపీ కులగణన విషయంలో ఇచ్చిన మాట తప్పినట్లు స్పష్టంగా తెలుస్తోంది. అన్ని రాష్ట్రాల్లో ఈ అంశంపై చర్చ జరుగుతోంది. తెలంగాణ నుంచి మన అభిప్రాయం కూడా ఇవ్వాలని రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించాం. తెలంగాణలో ఉన్న కులాలు, వాటి ఉపకులాల నివేదిక జాగృతి సిద్ధం చేస్తుంది. నిజానికి ఈ పని ప్రభుత్వమే చేయాలి. కానీ వాళ్లకు చిత్తశుద్ధి లేదు. అందుకే మేము అందరినీ ఒపీనియన్స్ తీసుకోవాలని నిర్ణయించాం. తెలంగాణ థింక్స్, ఇండియా ఫాలోస్ నెక్స్ట్ అనే విధంగా మనం ఉంటాం. కులగణన విషయంలోనూ మనం అదే విధంగా నివేదికను కేంద్రానికి ఇద్దాం. ప్రతి కులానికి అన్ని హక్కులు సాధించుకునేలా ప్రయత్నం చేద్దాం. ఇలాంటి అంశంలో రాజకీయ పార్టీల పాత్ర కీలక. కచ్చితంగా ఈ అంశంపై ప్రతి పార్టీకి ఒక స్టాండ్ ఉండాలి. కానీ బీఆర్ఎస్ మాత్రం ఈ విషయంలో ఏమీ మాట్లాడటం లేదు. కాంగ్రెస్ పరిస్థితి అంతే. బీజేపీయే డాక్యుమెంట్ విడుదల చేసింది. కనుక వాళ్లు ఆ డాక్యుమెంట్ గా మద్దతుగా మాట్లాడుతున్నారు. కానీ అన్ని పార్టీలు కూడా తమ స్టాండ్ ఏంటో చెప్పాల్సిందేనని అన్నారు.

=====================

# అమరావతి వెలిగొండ ప్రాజెక్టును జాతికి అంకితం చేసామని చెప్పి రాష్ట్ర ప్రజలను జగన్ మోసం చేశారు : మంత్రి నిమ్మల రామానాయుడు


జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు వెలిగొండ ప్రాజెక్టు విషయంలో గత ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. వెలిగొండ ప్రాజెక్టును 2026 కల్లా పూర్తి చేయాలనే గట్టి సంకల్పంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉన్నారని, దానికి అనుగుణంగానే పనులు వేగంగా జరుగుతున్నాయని మంత్రి నిమ్మల పేర్కొన్నారు.గతంలో మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి వెలిగొండ ప్రాజెక్టును జాతికి అంకితం చేశామని చెప్పి రాష్ట్ర ప్రజలను మోసం చేశారని మంత్రి విమర్శించారు. ప్రాజెక్టు పనులు ఇంకా అసంపూర్తిగానే ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు. హెడ్ రెగ్యులేటర్ పనులు, టన్నెల్-1 మరియు టన్నెల్-2 పనులు, బెంచింగ్ మరియు లైనింగ్ పనులు ఇంకా పూర్తి కాలేదని ఆయన వివరించారు. టన్నెల్‌లో ఒక బోరింగ్ మెషిన్ చిక్కుకుపోయి ఉందని, కోర్టు స్టే ఆర్డర్ల వల్ల అది అక్కడే నిలిచిపోయిందని, అది తొలగించకుండా నీటిని ముందుకు పంపడం అసాధ్యమని మంత్రి పేర్కొన్నారు. నిర్వాసితులకు గత ఐదేళ్లలో ఒక్క రూపాయి కూడా వారికి ఇవ్వలేదని ఆయన



ఆరోపించారు. అసంపూర్తిగా ఉన్న పనుల కోసం ప్రస్తుతం ప్రభుత్వం ?456 కోట్లు విడుదల చేసిందని, సీసీ వాల్స్, లైనింగ్ పనులను వేగవంతం చేస్తామని చెప్పారు. ప్రకాశం జిల్లాకు అన్యాయం: జగన్ మోహన్ రెడ్డి ప్రకాశం జిల్లా ప్రజలను మోసం చేశారని, ప్రాజెక్టు పూర్తి కాకుండానే అయిపోయిందని అబద్ధాలు చెప్పి జాతికి అంకితం చేయడం హాస్యాస్పదమని మంత్రి అన్నారు.

# జిల్లాలో మాతృ--శిశు మరణాలు జరగకుండా అందరూ సమిష్టిగా కృషి చేయాలి : అడిషనల్ కలెక్టర్ మధు మోహన్

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) జనవరి 29: జిల్లా సమీకృత అధికారుల కార్యాలయంలో గురువారం అడిషనల్ కలెక్టర్ మధు మోహన్ ఆధ్వర్యంలో ప్రతి ఆరు నెలల కొకసారి నిర్వహించే మాతృ మరణాలు, శిశు మరణాలు, నేషనల్ హెల్త్ ప్రోగ్రావ్స్ పై సమీక్షా సమావేశం నిర్వహించబడింది.




జిల్లాలో ఏప్రిల్ నుండి డిసెంబర్ 2025 వరకు మొత్తం 8 మాతృ మరణాలు సంభవించినట్లు తెలిపారు. వాటిలో 6 ఆసుపత్రుల్లో, ఒకటి ఇంటిలో, ఒకటి ప్రయాణ సమయంలో జరిగాయని వివరించారు. ఈ మాతృ మరణాలు దేవునిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (2), డోంగ్లి (2), బీర్కూర్, రాజంపేట, నిజాంసాగర్, పుల్కల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఒక్కొక్కటి చొప్పున జరిగినట్లు తెలిపారు.

మాతృ మరణాలకు గల కారణాలపై అడిషనల్ కలెక్టర్‌కు పూర్తి వివరాలు సమర్పించగా, గర్భిణీల ఆరోగ్య పరిస్థితులు, నిర్వహించిన పరీక్షలు, ఐరన్--ఫోలిక్ యాసిడ్, క్యాల్షియం మాత్రల పంపిణీ, వినియోగం గురించి వివరించారు. మాతృ మరణాలకు ప్రధాన కారణాలుగా సెప్సిస్, సెప్టిక్ షాక్, మల్టిపుల్ ఆర్గాన్ ఫెయిల్యూర్, అధిక రక్తపోటు, షుగర్, తక్కువ హిమోగ్లోబిన్, సెకండరీ పీపీహెచ్, ఐబీపీ వంటి కారణాలు ఉన్నట్లు తెలిపారు.

ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మధు మోహన్ మాట్లాడుతూ, మాతృ మరణాల కారణాలను గుర్తించి, ఇకపై అలాంటి మరణాలు జరగకుండా నివారణ చర్యలు చేపట్టడమే ఈ సమీక్ష సమావేశం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. గర్భిణీలకు రెగ్యులర్ ఆరోగ్య పరీక్షలు, బీపీ, షుగర్, హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించి, అధిక ప్రమాద గర్భిణీలను ముందుగానే గుర్తించి ప్రసవానికి సంబంధించిన స్పష్టమైన ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. అవసరమైన సందర్భాల్లో ఈసీజీ, 2డీ ఈకో, ఫీటల్ పరీక్షలు తప్పనిసరిగా నిర్వహించాలని, బ్లడ్ బ్యాంకుల్లో రక్త నిల్వలు అందుబాటులో ఉంచాలని, సరైన సమయంలో సమీప ప్రభుత్వ ఆసుపత్రులు, ఎంసీహెచ్ కేంద్రాలకు రిఫర్ చేయాలని సూచించారు.

జిల్లాలో 14 సీడీఆర్ (శిశు మరణాలు) జరిగినట్లు తెలిపారు. లింగంపేట్, బిబిపేట్ తదితర ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో జరిగిన ఈ మరణాలను నివారించేందుకు క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని డాక్టర్ విద్యా సూచించారు. జిల్లాలో మాతృ--శిశు మరణాలు జరగకుండా అందరూ సమిష్టిగా కృషి చేయాలని ఆదేశించారు.

టీహెచ్ఎస్ డాక్టర్ విజయభాస్కర్ మాట్లాడుతూ పేషంట్ ఎడ్యుకేషన్ తప్పనిసరి అని తెలిపారు. ఎనీమియా ప్రమాదాలు, శిశువులకు పాలు ఇచ్చే సరైన పద్ధతులు, నిద్రపోతూ పాలు ఇవ్వకూడదని, రెగ్యులర్ ఏఎన్సీ చెకప్‌లు చేయించుకోవాలని సూచించారు. ప్రమాదకర లక్షణాలు కనిపించిన వెంటనే గర్భిణీలను జీజీహెచ్ లేదా ఎంసీహెచ్ కేంద్రాలకు రిఫర్ చేయాలని తెలిపారు.

ఈ సమావేశంలో డాక్టర్ విజయరాజ్, డాక్టర్ శ్రీలత, ఎండీఆర్--సీడీఆర్ కమిటీ సభ్యులు ప్రమాదకర లక్షణాలు, నివారణ చర్యలపై వైద్య సిబ్బందికి అవగాహన కల్పించారు. ప్రతి పీహెచ్‌సీ నుంచి 50 శాంపిళ్లు టీ--ల్యాబ్‌కు పంపించాలని డీఎంహెచ్ఓ ఆదేశించారు. సికిల్ సెల్ వ్యాధికి సంబంధించిన రక్త పరీక్షలు తప్పనిసరిగా నిర్వహించాలని, ప్రతి ఏఎన్సీకి ఈసీజీ, టీఫ్, 2డీ ఈకో, ఫీటల్ పరీక్షలు చేయాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో డాక్టర్ విజయరాజ్, డాక్టర్ శ్రీలత, డాక్టర్ ఏమీ, డాక్టర్ విజయభాస్కర్, డాక్టర్ ప్రవీణ్, డెమో వేణుగోపాల్, చలపతి, శ్రీధర్, నయీమ్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మేడారం ను ప్రసిద్ధ పుణ్యక్షేత్రం చేసేలా శాశ్వత కట్టడాలు: మంత్రి పొంగులేటి

మేడారం/ములుగు జిల్లా ప్రతినిధి, జనవరి 29 (భారత శక్తి): బాసర నుంచి భద్రాచలం వరకు 2వేల5 వందల కోట్లతో టెంపుల్ సర్క్యూట్ అభివృద్ధి70 ఎకరాలలో కాటేజీలు, కళ్యాణ మండపం ఏర్పాట్లు మీడియా సెంటర్ లో పాత్రికేయులతో (చిట్ చాట్) సమావేశం నిర్వహించిన మంత్రి పొంగులేటిమేడారం ను ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కింద అభివృద్ధి చేసేలా శాశ్వత కట్టడాలు చేపట్టామని రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు.మంత్రి పొంగులేటి గురువారం మేడారం జాతర లోని మీడియా సెంటర్ వద్ద మంత్రి దనసరి అనసూయ సీతక్క తో కలిసి పత్రికా సమావేశం నిర్వహించారు. మంత్రి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ కుంభమేళా మరిపించే విధంగా లక్షలాది మంది భక్తులు ఇప్పటికే సమక్క సారలమ్మ జాతరకు 10 కిమి రేడియస్ పరిధిలో భక్తులు పెద్ద ఎత్తున కనిపిస్తున్నారని , జాతర ఏర్పాట్లను మంత్రి సీతక్క ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నారని అన్నారు. జాతరకు విచ్చేసిన కేంద్రం మంత్రులకు ప్రోటోకాల్ ప్రకారం స్వాగతం పలికి అమ్మవారి దర్శనం చేయించామని అన్నారు. సమక్క సారలమ్మ జాతరకు దేశంలో అనేక ప్రాంతాల నుంచి భక్తులు వస్తున్నారని, జాతరకు అవసరమైన అన్ని రకాల మౌలిక వసతులు ముందుగానే చేపట్టామని అన్నారు.నేడు సాయంత్రం 6 గంటల తర్వాత సమ్మక్క గద్దె మీదకు వస్తుందని అప్పుడు భక్తులు తాకిడి మరింత పెరిగే అవకాశం ఉంటుందని, ఒకేసారి కోటి పైగా ప్రజలు వచ్చే అవకాశం ఉన్నందున అవసరమైన మేర చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. సామాజిక మాధ్యమాలలో దుష్ప్రచారులను నమ్మవద్దని మంత్రి తెలిపారు. జాతరకు 10 కిలోమీటర్ల రేడియస్ పరిధిలో రోడ్లను ఫోర్ లైన్ చేశామని అన్నారు. 29 ఎకరాల భూ సేకరణ చేసి మరో 40 పైగా ఎకరాల భూ సేకరణ జరుగుతుందని, 70 ఎకరాల వరకు సేకరించి అవసరమైన కాటేజీలు, వివాహాలు జరిపించుకునేందుకు వీలుగా కళ్యాణ మండపాలు, టాయిలెట్స్, జంపన్న వాగు పై శాశ్వతంగా చెక్ డ్యాం నిర్మాణానికి ప్రణాళికలు తయారు చేస్తున్నామని తెలిపారు.365 రోజులు జంపన్న వాగులో నీరు ఉండే విధంగా



రామప్ప నుంచి లక్నావరం మీదుగా జంపన్న వాగుకు లింక్ చేసేలా చర్యలు చేపడుతున్నామని అన్నారు.బాసర నుంచి భద్రాచలం వరకు 2500 కోట్లతో టెంపుల్ సర్క్యూట్ అభివృద్ధి చేసేందుకు ప్రజా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, టెంపుల్ సర్కిల్ మేడారం ను కూడా భాగస్వామ్యం చేస్తామని అన్నారు. గోదావరి పరివాహక ప్రాంతంలో ఉన్న దేవాలయాలను సకల వసతులతో అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటుందని అన్నారు.

మంత్రి సీతక్క మాట్లాడుతూ: సమ్మక్క సారలమ్మ జాతరకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామని అన్నారు. 45 రోజుల నుంచి మేడారం కు భక్తులు భారీ ఎత్తున వస్తున్నారని అన్నారు. ప్రభుత్వం పట్టుదలతో రికార్డు సమయంలో సమక్క సారలమ్మ ఆశీర్వాదంతో జాతర శాశ్వత పనులు పూర్తి చేశామని అన్నారు. 2010 నుంచి సీఎం రేవంత్ రెడ్డి సమక్క సారలమ్మ జాతరకు వస్తున్నారని, ముఖ్యమంత్రి కాగానే ఇక్కడ మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారని తెలిపారు. రోడ్డు విస్తరణ 4 లైన్లు చేయడం వల్ల భక్తులకు చాలా ఇబ్బందులు తగ్గాయని అన్నారు. మంచి నీటి వ్యవస్థ, టాయిలెట్స్ శాశ్వతంగా కల్పించేలా చర్యలు చేపట్టామని అన్నారు. సమక్క సారలమ్మ జాతర ప్రదేశంలో పచ్చదనం ఉండేలా చెట్ల పెంపకం చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో పాత్రికేయులు, సమాచార శాఖ సంయుక్త సంచాలకులు, డి.ఎస్. జగన్ , తదితరులు పాల్గొన్నారు.

# భారత శక్తి నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ

## సీనియర్ జర్నలిస్టులు, గోల్డ్ మెడలిస్ట్ డాక్టర్ బంటు కృష్ణ

## ది సూర్యపేట ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి కందుకూరి యాదగిరి

సూర్యాపేట (భారత శక్తి జిల్లా ప్రతినిధి) జనవరి 29:

ప్రముఖ తెలుగు దినపత్రిక భారత శక్తి 2026 నూతన సంవత్సర క్యాలెండర్ ను గురువారం సూర్యాపేట జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో సీనియర్ జర్నలిస్టులు గోల్డ్ మెడలిస్టు డాక్టరేట్ అవార్డు గ్రహీత డాక్టర్ బంటు కృష్ణ, భారత శక్తి జిల్లా సూర్యాపేట జిల్లా ప్రతినిధి,ది సూర్యపేట ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి కందుకూరి యాదగిరి అదేవిధంగా పలువురు జర్నలిస్టులు ఆవిష్కరించారు.ఈ సందర్భంగా బంటు కృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా కొనసాగుతున్న సమాచార పౌర సంబంధాల శాఖ రాష్ట్రంలో ఉన్న ప్రతి జర్నలిస్టు సంక్షేమం కోసం ఆలోచన చేయాలని తెలిపారు.ప్రజా సమస్యలు ప్రభుత్వం దృష్టికి చేరవేయడంలో భారత శక్తి దినపత్రిక ప్రత్యేక స్థానాన్ని పొందుకొని ప్రజలకు చేరువైందని పేర్కొన్నారు. మంచి మంచి కథనాలతో పత్రిక విలువలకు తగినట్టుగా భారత శక్తి పత్రిక వస్తుందని అన్నారు. అనంతరం కందుకూరి యాదగిరి మాట్లాడుతూ పత్రిక ప్రారంభించిన నాటినుండి రెండు దశాబ్దాలుగా అన్ని వర్గాల ప్రజల సమస్యలను



ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తూ ప్రభుత్వ పథకాలను ప్రజల కు చేరవేస్తూ పత్రిక నైతిక బాధ్యతలను భారత శక్తి పోషిస్తుందని తెలిపారు. భారతశక్తి పత్రికను ఆదరిస్తున్న ప్రతి ఒక్కరికి ప్రత్యేక కృతజ్ఞతలు చెప్పారు.ఆవిష్కరణ కార్యక్రమంలో పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు

# గీతంలో భారత సాహిత్య సంస్కృతులపై చర్చాగోష్ఠి

## దేశ నలుమూలల నుంచి తరలి వచ్చిన ప్రసిద్ధ ప్రొఫెసర్లు

సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, జనవరి 29:

గీతం స్కూల్ ఆఫ్ హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ లోని ఆంగ్లం, ఇతర భాషల విభాగం ఆధ్వర్యంలో 'పరివర్తన దశ: భారతదేశంలో సాహిత్య సంస్కృతులు, సామాజిక-రాజకీయ ఉద్యమాలు' అనే అంశంపై నిర్వహిస్తున్న రెండు రోజుల చర్చాగోష్ఠిని గురువారం లాంఛనంగా ప్రారంభించారు. భారతీయ సందర్భంలో సాహిత్యం, భావజాలం, సంస్కృతి, సామాజిక పరివర్తనపై విమర్శనాత్మక చర్చల కోసం ప్రముఖ పండితులు,



విద్యావేత్తలను ఈ సింపోజియం ఒకచోట చేర్చింది.వలసవాద, ప్రారంభ ఆధునిక భారతదేశంలో సాహిత్యం, భావజాలం, సామాజిక ప్రతిఘటన' అనే అంశంపై అమృత్ సర్ లోని గురునానక్ దేవ్ విశ్వవిద్యాలయం, ఎస్.ఆర్. ప్రభుత్వ మహిళా కళాశాలకు చెందిన డాక్టర్ అమన్ దీప్ కౌర్, డాక్టర్ జగ్వీర్ సింగ్ లతో పాటు గీతం అధ్యాపకుడు డాక్టర్ జోంధలే రాహుల్ హిరామన్ ఉపన్యసించారు. కులాన్ని పున:నిర్వచించడం: 1872 నాటి ఒక తెలుగు నవల' అనే అంశంపై హైదరాబాదు విశ్వవిద్యాలయ విశ్రాంత ఆచార్యులు ప్రొఫెసర్ అల్లాడి ఉమ, ప్రొఫెసర్ ఎం.శ్రీధర్ కీలకోపన్యాసాలు చేశారు. ఒక నవల ఒకే సమయంలో కల్పితంగా, చారిత్రకంగా ఎలా ఉండగలదో ప్రొఫెసర్ శ్రీధర్ వివరించారు. శతాబ్దాలుగా ప్రబలంగా ఉన్న కుల వ్యవస్థను అది చిత్రించడంలో దాని చారిత్రకత ఉందని, అయితే శ్రీరంగరాజు అనే విజయనగర రాజు లేకపోవడంలో దాని కల్పిత అంశం స్పష్టంగా కనిపిస్తుందని చెప్పారు. సోనాబాయి ఒక లంబాడా అమ్మాయి నుంచి నాయక కుటుంబ సభ్యురాలిగా మారడం కూడా వాస్తవికతను కల్పితంగా పునర్నిర్మించడాన్ని ప్రతిబింబిస్తోందన్నారు. ఈ కథ ఎంపిక సూచించేదేమంటే, ఆమె లంబాడా మహిళగానే ఉండి ఉంటే, ఆనాటి కుల వివక్షతో నిండిన సమాజం ఈ నవలను అంగీకరించి ఉండేది కాదని, అయితే, అంటరాని కులాల పట్ల నవలా రచయిత వైఖరిని విమర్శించవచ్చన్నారు. ఈ విధంగా ప్రొఫెసర్ శ్రీధర్ సాహిత్యంలో ఆధునికత గురించి కీలకమైన ప్రశ్నలను లేవనెత్తి, హిందూ సమాజ వ్యవస్థకు కేంద్రంగా ఉన్న కులం, గిరిజన దృక్కోణాల ద్వారా శ్రీరంగనాథ చరితము వంటి గ్రంథాలను పున:పరిశీలించాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు.వలసవాద స్థానిక సంస్కృతులలో లింగం, లైంగికత, నైతిక ఆందోళన' అనే అంశంపై జరిగిన కార్యక్రమంలో సంబల్ పూర్ లోని గంగాధర్ మెహర్ విశ్వవిద్యాలయ ఆచార్యుడు డాక్టర్ పి.మురళీధర్ శర్మ, వెల్లూరు ఇన్ స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి అధ్యాపకురాలు డాక్టర్ మీను బి., గీతం ఆంగ్ల విభాగాధిపతి డాక్టర్ సయంతన్ మండల్ ఆలోచింపజేసే ప్రసంగాలను అందించారు. వక్తలు లింగం, నైతికత, స్థానిక సాహిత్య సంప్రదాయాల మధ్య ఉన్న సంబంధాలను విశ్లేషించారు. జీఎస్ హెచ్ఎస్ ఇన్ ఛార్జి డైరెక్టర్ డాక్టర్ శామ్యూల్ తరు, ప్రొఫెసర్ డీ.ఆర్.పీ.చంద్రశేఖర్, పలువురు అధ్యాపకులు, విద్యార్థులు కూడా ఈ సింపోజియంలో పాల్గొన్నారు.భక్తి, అంతర్గతత్వం, ఆధునిక భారతదేశంలో నైతిక-రాజకీయ కర్తలను రూపొందించడం' అనే కార్యక్రమంలో రెండో రోజు సింపోజియం ఆరంభం కానుంది. దేవ్ గఢ్ కళాశాలకు చెందిన డాక్టర్ శిఖా మహర్షి, రావెన్ షా విశ్వవిద్యాలయ ఆచార్యులు ఉర్మిశ్రీ బెడమట్ట, గీతం అధ్యాపకుడు డాక్టర్ అభిలాష్ ఉపన్యసించనున్నారు. జవహర్ లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయ ఆచార్యుడు ప్రొఫెసర్ ఉదయ కుమార్ 'సామాజికత యొక్క సాహిత్యం, భాషలు: కేరళ నుంచి కొన్ని గమనికలు' అనే అంశంపై కీలకోపన్యాసం చేస్తారు.ఈ రెండు రోజుల సింపోజియం 'పరివర్తన దశలోని విషయాలు, పరివర్తనాత్మక గ్రంథాలు, ఆధునికత' అనే కార్యక్రమంతో ముగియనుంది. ఇందులో ముంబై లోని ఎస్ఎన్ డీటీ మహిళా విశ్వవిద్యాలయ ఆచార్యులు డాక్టర్ ధ్రుపది చటోపాధ్యాయ, షిల్లాంగ్ లోని ఈశాన్య హిల్ యూనివర్సిటీ ఆచార్యులు డాక్టర్ సోమజ్యోతి మృధా, గీతం-విశాఖ అధ్యాపకుడు ఫుజైల్ అసర్ సిద్ధిఖీ ప్రసంగించనున్నారు. ఈ చర్చలు భారతీయ సామాజిక-సాంస్కృతిక సందర్భాలలో సాహిత్య ఆధునికత యొక్క పరిణామ స్వభావాన్ని, పరివర్తన చెందుతున్న విధానాన్ని ప్రస్ఫుటీకరిస్తాయి.మనదేశంలోని సాహిత్య సంస్కృతులు, సామాజిక-రాజకీయ ఉద్యమాలతో విమర్శనాత్మక సంబంధాన్ని పెంపొందిస్తూ, అంతర్-విభాగ సంభాషణకు ఒక శక్తివంతమైన వేదికను ఈ సింపోజియం అందజేస్తోంది.

# వ్యవసాయ అధికారి లావణ్యను కలిసిన బద్వేల్ మార్కెట్ యార్డ్ చైర్మన్ సుప్రజ



పోరుమామిళ్ళ, భారతశక్తి ప్రతినిధి, జనవరి 29: వ్యవసాయ ఉప మార్కెటింగ్ సంచాలకులు శ్రీమతి లావణ్య ను కలిసి పోరుమామిళ్ల లో ఉన్న ఉప మార్కెట్ యార్డ్ ను పూర్తి చేసి రైతులకు అందుబాటులోకి తీసుకరావాలని కోరడం జరిగింది. అందుకు ఆమె సానుకూలంగా స్పందించి త్వరగా పూర్తి అయ్యేవిధంగా కృషిచేస్తామని చెప్పడం జరిగింది . అదేవిధంగా పోరుమామిళ్ల కేంద్రంగా రైతు బజార్ కోసం సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని కోరడం జరిగింది.

# నేడు,రేపు టైప్ రైటింగ్ పరీక్షలు

సంగారెడ్డి,భారత శక్తి ప్రతినిధి, జనవరి 29:

టైపు రైటింగ్లో హయ్యర్ లోయర్ పూర్తి చేసుకున్న అభ్యర్థులు ఈనెల 30, 31 తేదీలలో నిర్వహించనున్న పరీక్షలకు హాజరుకావాలని శ్రీ ధరణి టైపు రైటింగ్ ఇన్స్టిట్యూట్ ప్రిన్సిపల్, తెలంగాణ స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ బి కృష్ణమూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు రోజులపాటు జరిగే ఈ పరీక్షలను స్థానిక పాలిటెక్నిక్ కళాశాల, ఇస్మాయిల్ ఖాన్ పెట్ సమీపంలోని హనుమాన్ గడ్డ వద్ద రెండు కేంద్రాలుగా ఉదయం 8:30 నుండి సాయంత్రం ఐదు గంటల వరకు రోజుకు నాలుగు బ్యాచుల చొప్పున రెండు రోజులు టైప్ రైటింగ్ పరీక్షలు నిర్వహించబడునని తెలిపారు. పరీక్షలు రాసే అభ్యర్థులు సమయానికి హాజరై అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మిగతా వివరాలకు 6303241350, 9441065092 నంబర్లో సంప్రదించాలని ఆయన సూచించారు.

# రాయలసీమకు ద్రోహం చేసిన క్రెడిట్ జగన్‌దే

:- టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు రెడ్డప్పగారి శ్రీనివాసరెడ్డి

రాయలసీమ రైతాంగానికి గత ఐదేళ్ల పాలనలో ద్రోహం జరిగితే... రాయలసీమ కరువును శాశ్వత పరిష్కరించే దిశగా సీఎం చంద్రబాబు ప్రభుత్వంలో న్యాయం జరుగుతుందని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు రెడ్డప్పగారి శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం ఆయన మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అన్న ఎన్టీఆర్ రాయలసీమ కరువు సీమ, కరువుకు శాశ్వత పరిష్కారం కనుగొనాలనే ఆలోచనతో తెలుగు గంగ, హంద్రీనీవా, గాలేరు నగరి, వెలిగొండ, కేసీ కెనాల్, ఎస్ఆర్బీసీ ప్రారంభించారు. నెల్లూరు, ప్రకాశం జిల్లాలను కలుపుకొని గ్రేటర్ రాయలసీమకు నీరు పారించే విధంగా అంకురార్పణకు చేశారు. నేడు సీఎం చంద్రబాబు ఆ ప్రాజెక్టులను పూర్తి చేసి రాయలసీమను ఉద్యాన పంటల సీమగా మార్చారు. దేశంలోనే తొలిసారి డ్రిప్ ఇరిగేషన్ ను 1999 -2004 మధ్య కాలంలో సీఎం చంద్రబాబు తీసుకొచ్చారు. 2014-19 మధ్య కాలంలో బిందు సేద్యం ద్వారా రాయలసీమ జిల్లాలను ఉద్యాన పంటలకు హబ్ గా మార్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

# మీడియా సెంటర్ ను ప్రారంభించిన స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధు మోహన్, అదనపు కలెక్టర్ విక్టర్

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) జనవరి 29: కామారెడ్డి జిల్లా ఐడీఓసీ భవనంలోని 21వ గది నంబర్ లో ఏర్పాటు చేసిన మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎమ్ సి ఎమ్ సి) మీడియా కేంద్రాన్ని గురువారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్/ అదనపు ఎన్నికల అధికారి మధుమోహన్, రెవెన్యూ అదనపు కలెక్టర్ విక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రోజువారీ వివిధ దినపత్రికలు,చానళ్లలో ప్రసారమయ్యే పెయిడ్ న్యూస్‌ను గుర్తించి, వాటిని సంబంధిత రిజిస్టర్లలో నమోదు చేయాలని సూచించారు. ఎన్నికల నియమావళి ప్రకారం మీడియా పర్యవేక్షణను కట్టుదిట్టంగా నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సంబంధాల అధికారిణి



తిరుమల, ఉర్దూ మైనారిటీ అధికారి మహ్మద్ అర్షద్ అలీ, సంబంధిత సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కంట్రోల్ రూమ్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

## ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి:జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, జనవరి 29 (భారత శక్తి): మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ సిబ్బంది అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశించారు. గురువారం ఆమె కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూమ్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నామినేషన్ కేంద్రాల్లో జరుగుతున్న ప్రక్రియను వెబ్ కాస్టింగ్ ద్వారా ప్రత్యక్షంగా వీక్షించి, అధికారులకు పలు సూచనలు చేశారు.

ఎన్నికల నిర్వహణలో ఎదురయ్యే సమస్యలు, ఫిర్యాదుల పరిష్కారం కోసం కలెక్టరేట్‌లో ప్రత్యేక హెల్ప్‌లైన్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రజలు ఎవరైనా 9100577132 నంబర్‌కు ఫోన్ చేసి తమ ఫిర్యాదులను తెలియజేయవచ్చని సూచించారు. కంట్రోల్ రూమ్‌కు వచ్చే ప్రతి ఫోన్ కాల్‌ను సిబ్బంది స్వీకరించాలని, ఫిర్యాదుల వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేసి, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి వెంటనే పరిష్కరించాలని సూచించారు. ఎన్నికల విధుల్లో ఎటువంటి




అలసత్వం వహించినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఈ తనిఖీలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, ఈడీఎం నదీమ్, కంట్రోల్ రూమ్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఆడబిడ్డలు ఆకాశమే హద్దుగా ఎదగాలి

## బాలికల్లో ఆత్మస్థైర్యం నింపడమే మన లక్ష్యం: జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, జనవరి 29 (భారత శక్తి): ఆడపిల్లలు ఆత్మవిశ్వాసంతో ఆకాశమే హద్దుగా ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. జాతీయ బాలికా దినోత్సవం పురస్కరించుకుని గురువారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌తో కలిసి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించిన అనంతరం విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలను ఆమె ఆసక్తిగా తిలకించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నేటి సమాజంలో బాలికలు బాలురతో సమానంగా అన్ని రంగాల్లోనూ రాణిస్తున్నారని కొనియాడారు. చదువుతో పాటు ఆటలు, సాంస్కృతిక రంగాల్లోనూ బాలికలు అద్భుతమైన ప్రతిభను కనబరుస్తున్నారని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని, తమకు ఇష్టమైన రంగంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. జిల్లాలోని కేజీబీవీలు, వసతి గృహాల్లో విద్యార్థినులకు మెరుగైన వసతులు కల్పిస్తూ వారి మేధోవికాసానికి ప్రభుత్వం తరపున పూర్తి సహకారం అందిస్తున్నట్లు తెలిపారు.

స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ మాట్లాడుతూ, బాలికలకు చిన్నతనం నుంచే సరైన ప్రోత్సాహం అందిస్తే వారు అద్భుతాలు సృష్టిస్తారని పేర్కొన్నారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదివే విద్యార్థినుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. అనంతరం వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలను అందజేశారు.

అనంతరం...వివిధ పనుల నిమిత్తం చంటి పిల్లలతో కలెక్టరేట్‌కు వచ్చే మహిళా సందర్శకుల సౌకర్యార్థం ప్రజావాణి హాలు సమీపంలో ఏర్పాటు చేసిన 'బేబీ ఫీడింగ్ రూమ్' (తల్లులు పాలు ఇచ్చే గది)ను కలెక్టర్ రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. కార్యాలయాలకు వచ్చే తల్లులకు ఇబ్బంది కలగకుండా ఈ ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. ఈ వేడుకల్లో భాగంగా విద్యార్థినులు వేసిన ముగ్గులు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సీడబ్ల్యూసీ చైర్మన్ వాహిద్, డీఈఓ భోజన్న, డీఆర్‌డీఓ విజయలక్ష్మి, సీడీపీఓలు, ఉపాధ్యాయులు, మహిళా శిశు సంక్షేమ శాఖ సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మీడియా మాధ్యమాల్లో వచ్చే ఎన్నికల వార్తలపై నిఘా ఉంచాలి:జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, జనవరి 29 (భారత శక్తి) : నిర్మల్ డీపీఆర్వో కార్యాలయంలో మీడియా సెంటర్ ప్రారంభించిన కలెక్టర్. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా మాధ్యమాలలో వచ్చే రాజకీయ వార్తలపై పటిష్ట నిఘా ఉంచాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశించారు.

గురువారం కలెక్టరేట్లోని డిపిఆర్ఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సర్టిఫికేట్ అండ్ మానిటరింగ్ కమిటీ (మీడియా సెంటర్) ను జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ)కిషోర్ కుమార్, డిపిఆర్ఓ విష్ణువర్ధన్ తో కలిసి రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు.

డిపిఆర్ఓ కార్యాలయానికి వచ్చిన కలెక్టర్ కు డిపిఆర్ఓ పూల మొక్కను అందించి స్వాగతం పలికారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రోజువారీగా వార్త పత్రికలు, లోకల్ చానళ్లలో వచ్చే వార్తలను ప్రతిరోజు నిశితంగా గమనిస్తూ ఉండాలని అన్నారు. అనుమానిత పెయిడ్ న్యూస్ వివరాలు నమోదు చేయాలని అన్నారు. అన్ని రకాల రిజిస్టర్లను జాగ్రత్తగా నమోదు చేయాలని పేర్కొన్నారు. వివిధ రకాల సామాజిక మాధ్యమాల్లో వచ్చే వార్తలపై నిఘా ఉంచాలని తెలిపారు. ఈ మీడియా సెంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# భైంసాలో ఎన్నికల కోడ్ ఉల్లంఘన -- రెండు కేసులు నమోదు: భైంసా ఏఎస్పీ రాజేష్ మీనా.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, జనవరి 29 (భారత శక్తి): నిర్మల్ జిల్లా,మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో అమలులో ఉన్న ఎన్నికల నియమావళి (మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్)ను ఉల్లంఘించిన ఘటనలో భైంసా పట్టణంలో పోలీసులు రెండు కేసులు నమోదు చేశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న సమయంలో ఎలాంటి ర్యాలీలు, రాస్తారోకోలు, ధర్నాలు నిర్వహించరాదని జిల్లా పోలీస్ శాఖ ఇప్పటికే ప్రజలకు స్పష్టంగా సూచించినప్పటికీ ఈ ఘటన చోటుచేసుకుంది.

నిన్న రాత్రి సుమారు 8.30 గంటల సమయంలో భైంసా పట్టణంలోని జూనియర్ కాలేజీ ప్రాంతం నుంచి ముందస్తు అనుమతి లేకుండా సుమారు 20 నుంచి 30 మంది వీ×వీ పార్టీకి చెందిన వ్యక్తులు బైక్‌లపై ర్యాలీ నిర్వహించినట్లు పోలీసులు గుర్తించారు. ఈ చర్య ఎన్నికల నియమావళికి విరుద్ధమని భావించిన పోలీసులు సంబంధిత వ్యక్తులపై చట్టప్రకారం రెండు కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా భైంసా ఏఎస్పీ రాజేష్ మీనా మాట్లాడుతూ, ఎన్నికల కోడ్‌ను తప్పనిసరిగా పాటించాలని ప్రజలకు సూచించారు. ముందస్తు అనుమతి లేకుండా



ర్యాలీలు, రాస్తారోకోలు, ధర్నాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఎన్నికలు ప్రశాంతంగా, న్యాయంగా జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని జిల్లా పోలీస్ శాఖ విజ్ఞప్తి చేసింది.

# 2026 జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) జనవరి 29: జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు--2026ను పురస్కరించుకొని జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో కామారెడ్డి జిల్లా కుప్రియల్ లో ని మహాత్మ గాంధీ జ్యోతిబా పూలే పాఠశాల నందు రహదారి భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు.

ఈ సందర్భంగా సహాయక మోటార్ వాహనాల తనిఖీ అధికారులు ఇర్షాద్, కృష్ణ తేజ , రఫీ మాట్లాడుతూ, ప్రతి విద్యార్థి రహదారి భద్రతపై అవగాహన కలిగి ఉండటం ఎంతో అవసరమని తెలిపారు. పాదచారులుగా, బస్సులు, ఇతర వాహనాలలో ప్రయాణించే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను సరళమైన భాషలో విద్యార్థులకు వివరించారు.



అనంతరం విద్యార్థులతో రహదారి భద్రతపై ప్రతిజ్ఞ చేయించారు. చిన్న వయసులోనే రహదారి భద్రతపై అవగాహన కల్పిస్తే రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని అధికారులు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమాల్లో సహాయక మోటార్ వాహనాల తనిఖీ అధికారులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


# సినిమా

# అందమైన ప్రయాణం



చిరకాల ప్రేమికుడు ఆంటోనీ తటిల్ తో కీర్తి సురేశ్ 2024లో ఏడడుగులు వేసిన విషయం తెలిసిందే. రెండు సంప్రదాయాల ప్రకారం వివాహం చేసుకున్నారు. 2024 డిసెంబర్ 12న హిందూ సంప్రదాయం, 15న క్రైస్తవ సంప్రదాయం ప్రకారం వారి పెళ్లి జరిగింది. ఫొటోలు కూడా నెట్టింట అప్పట్లో బాగా వైరలయ్యాయి. ఘనంగా జరిగిన వారి వివాహ వేడుక గురించి తాజాగా నటి ఒక ఇంటర్వ్యూలో మాట్లాడింది. ఆ మధుర క్షణాలను గుర్తు చేసుకుంది. పెళ్లి అంత గ్రాండ్‌గా అవుతుందని అనుకోలేదట. ఇద్దరూ 15 ఏళ్లు ప్రేమలో ఉన్నారట. కచ్చితంగా పారిపోయి పెళ్లి చేసుకుంటామనే అనుకుందట. కానీ ఇంట్లో అంగీకరించడంతో ఘనంగా జరిగి కల నిజమైనట్లు అనిపించిందట. అందుకే తమ వివాహ వేడుకలో తాను భావోద్వేగానికి గురయ్యానని చెప్పింది. ఒక్క క్షణం నోట మాట రాలేదని పేర్కొంది. 15 ఏళ్ల ప్రేమ 30 సెకన్లలో తాళి కట్టే సమయంలో కళ్ల ముందు కదలాడిందని, దీంతో ఆనంద బాష్పాలు ఆగలేదని చెప్పింది. తానే కాదు. ఆంటోనీ కూడా నమ్మలేకపోయాడట. అతడు కూడా ఎమోషనల్ కావడంతో మొదటిసారి ఆంటోనీ కళ్లల్లో నీళ్లు చూశానని, ఇది ఓ అందమైన ప్రయాణం అని గుర్తు చేసుకుంది.


## దీపిక స్థానంలో సాయి పల్లవి!



రెబెల్‌స్టార్ ప్రభాస్ ఇటీవల ది రాజాసాబ్ సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చిన విషయం తెలిసిందే. మారుతి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ హారర్ ఫాంటసీ బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో వసూళ్లను రాబట్టలేక పోయింది. దీని తర్వాత ఏమిటనే చర్చ జరుగుతన్న నేపథ్యంలో కల్కి2 వచ్చే నెలలో సెట్స్ మీదకు తీసుకు రా బో తున్నా రని, ఇందుకోసం ప్రభాస్ ఫిబ్రవరిలో 10 రోజులు కాల్షీట్లు కూడా కేటాయించాడని వార్తలు వస్తున్నాయి. ప్రశాంత్ నీల్ ప్రస్తుతం జూనియర్ ఎన్టీఆర్ డ్రాగన్ మూవీతో బిజీగా ఉన్నందున.. ముందుగా నాగ్ అశ్విన్ తో కల్కి 2898 ఏడీ పార్ట్2 పూర్తి చెయ్యాలని నిర్ణయించుకున్నాడట. ఇక కల్కి 2లో దీపికా భాగం కాదని మేకర్స్ ఇప్పటికే అధికారికంగా ప్రకటించారు. దీంతో ఆమె స్థానంలో ఎవరిని తీసుకుంటారనే చర్చ నడిచింది. ఈ క్రమంలో పలువురు హీరోయిన్ల పేర్లు తెర మీదకు వచ్చాయి. ఇందులో భాగంగా సాయి పల్లవి పేరు గట్టిగా వినిపిస్తోంది. పార్ట్2లో ఆమె కల్కికి జన్మనివ్వబోతోంది. అంటే దాదాపు రెండో భాగం కథంతా ఆ పాత్ర చుట్టూనే తిరుగుతుంది. అలాంటి బలమైన పాత్రను ఇప్పుడు సాయి పల్లవి అయితే మోయగలదని మేకర్స్ భావిస్తున్నారట.

# విలువైన టైమ్‌వేస్ట్

1992లో ఇండస్ట్రీకి వచ్చిన గుణశేఖర్ వరుస సినిమాలతో అలరించాడు. ప్రేమ కథలనైనా, దేశభక్తి చిత్రాలైనా, చారిత్రక సినిమాలనైనా తనదైన శైలిలో తెరకెక్కించగల దర్శకుడాయన. 2015లో రుద్రమదేవి మూవీ తర్వాత 8 సంవత్సరాలు విరామం తీసుకుని 2023లో సమంతతో శాకుంతలం సినిమా తీశాడు. అది కూడా అనుకున్న స్థాయిలో విజయం సాధించలేదు. ఇప్పుడాయన యుఫోరియాతో ప్రేక్షకులను పలకరించేందుకు సిద్ధమయ్యాడు. ఈ సినిమా ఫిబ్రవరి 6న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో తాజాగా ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆయన తన కెరీర్ గురించి మాట్లాడాడు. కొన్ని సినిమాలు ఆశించిన స్థాయిలో విజయాన్ని అందుకోలేదని, కొన్ని సంవత్సరాలు సినిమాలకు దూరంగా విలువైన సమయాన్ని వృథా చేశానని చెప్పాడు. ఇకపై ఎలాంటి విరామం లేకుండా నిరంతరం సినిమాలు చేస్తానని, బలమైన కంటెంట్‌తో ప్రేక్షకుల ముందుకు రావడమే తన లక్ష్యమని వెల్లడించాడు. యుఫోరియాతో హిట్ సొంతం చేసుకుంటానన్న నమ్మకం ఉందన్నాడు. భూమిక, సారా అర్జున్, నాజర్, రోహిత్, విఘ్నేశ్ గవిరెడ్డి ఇందులో ప్రధాన పాత్రలు పోషించారు.



# ఓటీటీలో 'ధురంధర్'.. స్ట్రీమింగ్ డేట్ ఫిక్స్..




బాక్సాఫీసు వద్ద ఘన విజయం సాధించిన 'ధురంధర్' ఓటీటీలో స్ట్రీమింగ్ అయ్యేందుకు సిద్ధమైంది. శుక్రవారం (జనవరి 30) నుంచి 'నెట్‌ఫ్లిక్స్'లో అందుబాటులోకి రానుంది. ఈ విషయాన్ని తెలియజేస్తూ నెట్‌ఫ్లిక్స్ పోస్టర్‌ను పంచుకుంది. థియేట్రికల్ వెర్షన్ రన్‌టైమ్ 3 గంటలా 34 నిమిషాలు కాగా, ఓటీటీలో దాన్ని 3.25 గంటలకు కుదిరించారు. ఓటీటీలో అన్‌కట్ వెర్షన్ రిలీజ్ చేస్తారని సామాజిక మాధ్యమాల వేదికగా ప్రచారం జరిగినా రన్‌టైమ్ తగ్గడం గమనార్హం.


**రికార్డులే రికార్డులు..**

ఎలాంటి అంచనాల్లేకుండా 2025 డిసెంబరు 5న థియేటర్లలో విడుదలైన ఈ సినిమా.. తొలి షో నుంచే మౌత్ టాక్‌తో దూసుకెళ్లింది. సీక్రెట్ ఏజెంట్‌గా హీరో రణ్‌వీర్ సింగ్ లుక్స్, యాక్టింగ్, విలన్‌గా అక్షయ్ ఖన్నా పెర్ఫామెన్స్, పోరాటాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అందుకు తగ్గట్టే ఈ చిత్రం వసూళ్ల రికార్డులు సృష్టించింది. దాదాపు రూ.1400 కోట్లతో అత్యధిక వసూళ్లు సాధించిన సినిమాగా 'ధురంధర్' రికార్డు నెలకొల్పింది. ఎక్కువ కలెక్షన్లు రాబట్టిన భారతీయ చిత్రాల జాబితాలో నాలుగో స్థానంలో ఉండగా, కేవలం ఒక్క భాషలోనే (హిందీ) విడుదలై, అత్యధిక వసూళ్లు సాధించిన రెండో మూవీగా రికార్డు సాధించింది. హిందీలో విడుదలైన కొన్ని రోజులకే తెలుగులోనూ రిలీజ్ చేసేందుకు ప్రయత్నాలు జరిగినా.. సాధ్యం కాలేదు. మరి ఓటీటీలో తెలుగు ఆడియో అందుబాటులో ఉంటుందో లేదో తెలియాలంటే మరికొన్ని గంటలు ఆగాల్సిందే.

**కథేంటంటే..**

1999లో జరిగిన ఐసీ814 విమాన హైజాక్, 2001 భారత పార్లమెంట్‌పై జరిగిన ఉగ్రదాడి ఘటనల తర్వాత భారత ఇంటెలిజెన్స్ బ్యూరో చీఫ్ అజయ్ సన్యాల్ (మాధవన్) ఓ కీలక నిర్ణయం తీసుకుంటాడు. పాకిస్థాన్‌ను చావు దెబ్బ కొట్టేందుకు ఆ దేశంలోని ఉగ్రవాద సంస్థల్ని సమూలంగా అంతం చేసేందుకు ఆపరేషన్ ధురంధర్ పేరుతో ఓ రహస్య మిషన్‌కు శ్రీకారం చుడతాడు. ఈ మిషన్‌లో భాగంగా పంజాబ్‌లో జైలు జీవితం గడుపుతున్న ఓ కుర్రాడిని భారత ఏజెంట్‌గా హమ్జా (రణ్‌వీర్ సింగ్) అనే మారుపేరుతో పాక్‌లోకి పంపుతాడు. మరి ఆ తర్వాత ఏమైంది? రహస్య ఏజెంట్‌గా శత్రు దేశంలో అతడి ప్రయాణం ఎలా సాగింది? ఈ కథలో సంజయ్ దత్, అర్జున్ రాంపాల్ పాత్రలకున్న ప్రాధాన్యత ఏంటి? అన్నది చిత్ర కథ.

## మళ్లీ మూడు చిత్రాలతో



ఒక సినిమా పూర్తయ్యాక మరొక సినిమా అనే పద్ధతికి ఎప్పుడో ఫుల్‌స్టాప్ పెట్టేశారు ప్రభాస్. ఆయన కొంతకాలంగా ఒకేసారి రెండు, మూడు చొప్పున సినిమాల్ని ముందుకు నడిపిస్తున్నారు. 'ది రాజాసాబ్' సినిమాతో బిజీగా ఉన్న సమయంలోనే, 'కల్కి 2898 ఎ.డి', 'ఫౌజీ' సినిమాల్నీ చేశారు. దేశవ్యాప్తంగా బలమైన మార్కెట్ ఉన్న ఆయన కోసం పలు కథలు సిద్ధం అవుతున్నాయి. అన్నీ కూడా పాన్ ఇండియా స్థాయిలో, భారీ హంగులతో రూపొందుతున్న కథలే. ఏడాదికి రెండు సినిమాలైనా ప్రేక్షకుల ముందుకు తీసుకు రావాలనే లక్ష్యంతో ఆయన ఆయా ప్రాజెక్టుల్ని వెంట వెంటనే పట్టాలెక్కిస్తూ వాటి కోసం డేట్లు కేటాయిస్తున్నారు. ప్రస్తుతం 'ఫౌజీ', 'స్పిరిట్' సినిమాల చిత్రీకరణ సాగుతుండగా, 'కల్కి2' సినిమానీ పట్టాలెక్కించాలని నిర్ణయించారు. విజయవంతమైన 'కల్కి 2898 ఏడీ'కి కొనసాగింపుగా రూపొందుతున్న చిత్రమే 'కల్కి 2'. నాగ్ అశ్విన్ కొంతకాలంగా ఈ సినిమా పూర్వ నిర్మాణ పనుల్ని చేస్తూ వస్తున్నారు. వచ్చే నెలలోనే ప్రారంభం కానున్న ఈ సినిమాకీ ప్రభాస్ కొన్ని రోజులు డేట్స్ కేటాయించినట్టు తెలుస్తోంది. అంటే... మళ్లీ మూడు సినిమాల్ని ఒకేసారి ముందుకు నడిపిస్తారన్నమాట.

## వీరిద్దరినీ ఒకే తెరపై చూడాలని నాకూ ఉంది



రజనీకాంత్, కమల్‌హాసన్ కలిసి నటించనున్న సినిమా ప్రాజెక్టు గురించి దర్శకుడు లోకేశ్ కనగరాజ్ మాట్లాడారని రజనీకాంత్ కుమార్తె, నిర్మాత సౌందర్య రజనీకాంత్ తెలిపారు. 'టూరిస్ట్ ఫ్యామిలీ' చిత్రదర్శకుడు అభిషాన్ జీవింత్ కథానాయకుడిగా పరిచయమవుతున్న 'విత్ లవ్' ఫిబ్రవరి 6న విడుదల కానున్న సందర్భంగా ప్రమోషన్‌లో భాగంగా కోయంబత్తూర్‌లో ఇటీవల విలేకర్ల సమావేశం నిర్వహించారు. చిత్ర నిర్మాతల్లో ఒకరైన సౌందర్య రజనీకాంత్ మాట్లాడుతూ.. తన తండ్రి రజనీకాంత్, కమల్‌హాసన్‌లను ఒకే తెరపై చూడాలనే ఆసక్తి తనకూ ఉందన్నారు. ఈ చిత్రం గురించి దర్శకుడు లోకేశ్ కనగరాజ్ మాట్లాడారని, మిగతా విషయాలను వెల్లడించలేనని తెలిపారు.

# 'అరవింద సమేత'.. నాకు ఆ భయం ఉండేది: ఈషారెబ్బా





కమర్షియల్ సినిమాలో హీరోయిన్‌గా కాకుండా వేరే పాత్ర చేస్తే.. తదుపరి చిత్రాల్లోనూ అలాంటి అవకాశాలే వస్తాయని నటి ఈషారెబ్బా అభిప్రాయపడ్డారు. అందుకే 'అరవింద సమేత'లో నటించే అవకాశం వచ్చినప్పుడు భయపడ్డానని పేర్కొన్నారు. తాను హీరోయిన్‌గా నటించిన కొత్త సినిమా 'ఓం శాంతి శాంతి శాంతిః' ప్రమోషన్స్‌లో భాగంగా గత అనుభవాలు గుర్తుచేసుకున్నారు. ''దర్శకుడు త్రివిక్రమ్ సినిమాలు, వాటిలోని డైలాగ్స్ నాకు ఇష్టం. ఆయన 'అరవింద సమేత' కథ నాకు చెప్పినప్పుడే అందులో నటించాలని నిర్ణయించుకున్నా. ఆ సమయంలో నాదీ లీడ్ రోల్ అని చెప్పారు. ఓ వైపు ఆనందంగా ఉన్నా.. భవిష్యత్తులో స్టీరియోటైప్ చేసేస్తారని మరోవైపు టెన్షన్ ఉండేది. రోజులు గడిచేకొద్దీ ఆ భయం పోయింది. పెద్ద నిర్మాణ సంస్థ, పెద్ద దర్శకుడు, పెద్ద సినిమా కాబట్టి అందరూ నా గురించి మాట్లాడుకునేవారు. 'అరవింద సమేత'లో ఈషారెబ్బా.. నిజమా? కాదా? అంటూ ఎఫ్.ఎం.లో వచ్చే న్యూస్ విని కంగారు పడేదాన్ని. సెట్స్‌లో అడుగుపెట్టిన తర్వాత ఏ విషయాలు పట్టించుకోకుండా నా పని నేను చేసుకుంటూ వెళ్లిపోయా. సినిమా విడుదల తర్వాత చాలామంది ఫోన్ చేసి 'అనవసరంగా చేశారు. ఏముంది ఆ పాత్రలో?' అని అడిగారు. దీంతో, చాలా బాధపడ్డా. నాకు క్యారెక్టర్లు చేసేందుకు ఎలాంటి అభ్యంతరం లేదు. కానీ, అవే చేసుకుంటూ వెళితే హీరోయిన్‌గా నన్ను అంగీకరించరేమోనన్న భయం అంతే'' అని వివరించారు. అతి తక్కువమంది తెలుగు హీరోయిన్లలో ఈషా ఒకరు. 'అంతకు ముందు ఆ తరువాత'తో తొలి ప్రయత్నంలోనే కథానాయికగా మెప్పించిన ఆమెకు కోలీవుడ్, మాలీవుడ్‌లోనూ అవకాశాలొచ్చాయి. 'ఓం శాంతి శాంతి శాంతిః' లో ఈషానే హీరో అని చిత్ర బృందం చెప్పిందంటేనే.. ఆమె పాత్ర, నటనకు ఎంత ప్రాధాన్యం ఉందో అర్థం చేసుకోవచ్చు. దర్శకుడు తరుణ్ భాస్కర్ హీరోగా ఏఆర్ సజీవ్ తెరకెక్కించిన ఈ సినిమా శుక్రవారం విడుదల కానుంది.

# వ్యవస్థాగత సంస్కరణలు మరియు నైపుణ్య వృద్ధి రైల్వేల అభివృద్ధికి కీలకం

**: దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ**








సికింద్రాబాద్,భారతశక్తి ప్రతినిధి, జనవరి29: జనరల్ మేనేజర్ ఓవర్ ఆల్ బెస్ట్ పెర్ఫార్మెన్స్ ఎఫిషియెన్సీ షీల్డ్‌ను సంయుక్తంగా సాధించిన హైదరాబాద్ & గుంతకల్లు డివిజన్‌లు. ఉత్తమ పనితీరుకు గాను 86 సిబ్బంది/అధికారులకు విశిష్ట్ రైల్ సేవా పురస్కార్ అవార్డులను అందుకున్నారు. 35 ఎఫిషియెన్సీ షీల్డ్‌లను జోన్‌లోని వివిధ డివిజన్ & డిపార్ట్మెంట్ లకు ప్రదానం చేశారు. దక్షిణ మధ్య రైల్వే జనవరి 29, 2026న సికింద్రాబాద్‌లోని న్యూ భోయిగూడలో ఉన్న రైల్ కళారంగ్‌లో 70వ రైల్వే వారోత్సవాలను ఘనంగా జరుపుకుంది. ఈ కార్యక్రమానికి దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ ముఖ్య అతిథిగా హాజరై, డివిజన్లు మరియు విభాగాలకు జోనల్ సామర్థ్య షీల్డ్‌లను, అలాగే అధికారులు మరియు సిబ్బందికి వ్యక్తిగత విశిష్ట రైల్ సేవా పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు జనరల్ మేనేజర్ సత్య ప్రకాష్, సీనియర్ డిప్యూటీ జనరల్ మేనేజర్ ఆశిష్ మెహ్రోత్రా, డిప్యూటీ జనరల్ మేనేజర్(జి) ఉదయనాథ్ కోట్లా, వివిధ శాఖలకు చెందిన ప్రధానాధిపతులు, డివిజనల్ రైల్వేమేనేజర్లు, ఇతర ఉన్నతాధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంజయ్ కుమార్ శ్రీవాస్తవ అవార్డు గ్రహీతలను అభినందించి, 2024సంవత్సరంలో వారు అందించిన అత్యుత్తమ సేవలను ప్రశంసించారు. సంస్థ యొక్క నిజమైన బలం ఉద్యోగులే అని పేర్కొంటూ, జోన్ తన సిబ్బంది సంక్షేమానికి కట్టుబడి ఉందని ఆయన హామీ ఇచ్చారు. జనరల్ మేనేజర్ జవాబు దారీతనం మరియు కార్యాచరణతో కూడిన, రైలు వినియోగదారుల సేవ, నిర్వహణ, ఉత్పత్తి మొదలైన అన్ని రంగాలలో కాలపరిమితితో కూడిన మార్పులతో వ్యవస్థాగత సంస్కరణలను తీసుకురావాలని పిలుపునిచ్చారు. నూతన ఆలోచనలను ప్రోత్సహిస్తూ వాటిని స్వాగతించాలని మరియు మూల్యాంకనం చేసి, అమలు చేయాలని ఆయన అన్నారు. జనరల్ మేనేజర్ ఆధునికయుగ సాంకేతిక పరిజ్ఞానాలతో ముందుకు సాగడానికి నైపుణ్యాలను నిరంతరం అభివృద్ధి చేయవలసిన అవసరాన్నినొక్కి చెప్పారు. వివిధ డిజిటల్ మాధ్యమాలలో అందుబాటులోనున్న అపారమైన జ్ఞానాన్ని ఉపయోగించుకుని సమర్థవంతమైన శ్రామిక శక్తిని నిర్మించాలని ఆయన అధికారులు మరియు సిబ్బందిని ప్రోత్సహించారు. సంజయ్ కుమార్ శ్రీవాస్తవ భారత రైల్వేలు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ద్వారా నిరంతరం అభివృద్ధి వైపు కృషి చేస్తోందని భద్రతపై ప్రత్యేక ప్రాధాన్యతనిస్తున్నాయని పునరుద్ఘాటించారు. దక్షిణ మధ్య రైల్వే అదే వృద్ధి స్ఫూర్తితో ముందుకు సాగుతూ, తన విజయపతాకాన్ని ఉన్నత శిఖరాలకు చేర్చుతుందని నేను గట్టిగా నమ్ముతున్నానని ఆయన అన్నారు. జోనల్ స్థాయిలో ఓవర్ ఆల్ బెస్ట్ పెర్ఫార్మెన్స్ ఎఫిషియెన్సీ షీల్డ్‌ను హైదరాబాద్ & గుంతకల్లు డివిజన్‌లకు సంయుక్తంగా జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ చే ప్రదానంచేయబడింది. జనరల్ మేనేజర్ క్రింద వివరించిన విధంగా జోన్‌లోని వివిధ డివిజన్‌లు మరియు వర్క్‌షాప్‌లకు మరో 35 జోనల్ స్థాయి ఎఫిషియెన్సీ షీల్డ్‌లను కూడా అందజేశారు.


1. సికింద్రాబాద్ డివిజన్: ఫైనాన్స్(అకౌంట్స్) షీల్డ్; పరిశుభ్రత కోసం జీఎం షీల్డ్ (స్టేషన్ - గుంటూరు డివిజన్‌తో సంయుక్తంగా) ట్రాక్షన్ డిస్ట్రిబ్యూషన్ షీల్డ్; ఉత్తమ ట్రాక్ షీల్డ్ (విజయవాడ డివిజన్‌తో సంయుక్తంగా); సివిల్ ఇంజనీరింగ్ షీల్డ్ (విజయవాడ డివిజన్‌తో సంయుక్తంగా); మెకానికల్ షీల్డ్; ఉత్తమంగా నిర్వహించబడే సుదూర రైళ్లు (ట్రైన్ నం.12727/12728 గోదావరి ఎక్స్‌ప్రెస్) మరియు ఆపరేటింగ్ షీల్డ్లను సికింద్రాబాద్ డివిజన్ అందుకుంది.
2. హైదరాబాద్ డివిజన్: వర్క్స్ షీల్డ్; సేఫ్టీ షీల్డ్; సిగ్నల్ & టెలికాం షీల్డ్; పర్యావరణం మరియు హౌస్ కీపింగ్ నిర్వహణ ; రాజభాష (హిందీ) షీల్డ్ మరియు జనరల్ మేనేజర్ ఓవరాల్ ఎఫిషియెన్సీ షీల్డ్ లను గుంతకల్లు డివిజన్‌తో కలిసి అందుకున్నారు.
3. విజయవాడ డివిజన్: కమర్షియల్ షీల్డ్; ఎలక్ట్రికల్ జనరల్ సర్వీసెస్ షీల్డ్; సివిల్ ఇంజనీరింగ్ షీల్డ్ (సికింద్రాబాద్ డివిజన్‌తో సంయుక్తంగా); హెచ్.ఆర్.డి (పర్సనల్) షీల్డ్; ఉత్తమంగా నిర్వహించబడిన ఎం.ఆర్.వి షీల్డ్ (నాందేడ్ డివిజన్‌తో సంయుక్తంగా); మరియు ఇన్నోవేషన్స్(ఆవిష్కరణలు) షీల్డ్‌ను విజయవాడ డివిజన్ అందుకుంది.
4. గుంతకల్లు డివిజన్: ఆపరేషన్స్ & రన్నింగ్ రూమ్ షీల్డ్; బెస్ట్ ట్రాక్ షీల్డ్ (సికింద్రాబాద్ డివిజన్‌తో కలిసి); లెవెల్ క్రాసింగ్‌ల తొలగింపు కోసం ఉత్తమ డివిజన్ (నాందేడ్ డివిజన్‌తో కలిసి); ఉత్తమ లోడింగ్ కోసం ప్రయత్నం చేసిన డివిజన్; బెస్ట్ స్కూల్ (రైల్వే హై స్కూల్ /ఆంగ్ల మాధ్యమం /గుంతకల్లు); (ఫిర్యాదుల పరిష్కార యంత్రాంగం) గ్రీవెన్స్ రిడ్రెసల్ మెషినరీ షీల్డ్; సెక్యూరిటీ షీల్డ్ మరియు జనరల్ మేనేజర్ ఓవరాల్ ఎఫిషియెన్సీ షీల్డ్ (హైదరాబాద్ డివిజన్‌తో కలిసి) గుంతకల్లు డివిజన్ అందుకుంది.
5. గుంటూరు డివిజన్: పరిశుభ్రత (స్టేషన్ సికింద్రాబాద్ డివిజన్‌తో సంయుక్తంగా) కోసం జనరల్ మేనేజర్ షీల్డ్; ట్రాక్ మెషీన్ల ఉత్తమ వినియోగం; మెడికల్; సేఫ్టీ షీల్డ్; ఉత్తమంగా నిర్వహించబడిన ఎ.ఆర్.టి (ప్రమాదం ఉపశమనం రైలు) షీల్డ్ మరియు స్క్రాప్ డిస్పోజల్ షీల్డ్లను గుంటూరు డివిజన్ అందుకుంది.
6. నాందేడ్ డివిజన్: లెవెల్ క్రాసింగ్‌ల తొలగింపుకు ఉత్తమ డివిజన్ ( గుంతకల్లు డివిజన్‌తో కలిసి); బ్రిడ్జెస్ షీల్డ్; ఉత్తమంగా నిర్వహించబడిన ఎం.ఆర్.వి షీల్డ్ (విజయవాడ డివిజన్‌తో కలిసి) మరియు ఉత్తమ డివిజన్ కు లభించే రైల్ మదద్ షీల్డ్‌లను నాందేడ్ డివిజన్ అందుకున్నది.
7. సర్వే మరియు కన్‌స్ట్రక్షన్ షీల్డ్ డిప్యూటీ సి.ఈ/ కన్‌స్ట్రక్షన్/ కాజీపేట కు అందజేయబడింది.
8. ఉత్తమ డీజిల్ /ఎలక్ట్రిక్ లోకో షెడ్: ఎలక్ట్రిక్ లోకో షెడ్/విజయవాడ కు అందజేయబడింది.
9. ఉత్తమ మెకానికల్ వర్క్ షాప్ : తిరుపతి వర్క్ షాప్ కు అందజేయబడింది.
10. ఉత్తమంగా నిర్వహించబడుతున్న డెమూ/ మెమూ/ఈ.ఎం.యూ షెడ్: డీజిల్ లోకో షెడ్/ మౌలా-అలీ కు అందజేయబడింది.
11. ఉత్తమ స్టోర్స్ డిపో షీల్డ్ : ఎమ్ &ఈ లాలా గూడకు అందజేయబడింది జనరల్ మేనేజర్ 70వ రైల్వే వారోత్సవాల సందర్భంగా అధికారులు మరియు సిబ్బందికి వారి విశిష్ట సేవలకు గుర్తింపుగా 86 వ్యక్తిగత అవార్డులను కూడా ప్రదానం చేశారు. ముందుగా, దక్షిణ మధ్య రైల్వే అదనపు జనరల్ మేనేజర్ సత్య ప్రకాష్ స్వాగతొపన్యాసంలో ఎఫిషియెన్సీ షీల్డ్‌లు పొందిన డివిజన్‌లను మరియు వ్యక్తిగత అవార్డు గ్రహీతలను ఆయన అభినందించారు. అదనపు జనరల్ మేనేజర్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జోన్ సాధించిన ముఖ్యమైన విజయాల గురించి కూడా వివరించారు. రైల్వే సిబ్బంది ప్రదర్శించిన పాటలు మరియు నృత్య ప్రదర్శన వంటి సాంస్కృతిక కార్యక్రమాలు సభికులను ఎంతగానో అలరించాయి.







# కొబ్బరి అలంకరణలు..!

**ఇల్లు కొత్తగా అందంగా కనిపించేందుకు ఎప్పటికప్పుడు సరికొత్త ట్రెండ్స్ అనుసరిస్తుంటారు గృహాలంకరణ ప్రియులు. అయితే అందంతోపాటు ఇల్లు ఎకో ఫ్రెండ్లీగానూ ఉండాలనుకుంటోంది నేటితరం. ఈ క్రమంలో వచ్చినవే ఈ కొబ్బరి మట్టలతో చేసిన అలంకరణలు. ఇంట్లో ఏ శుభకార్యం జరిగినా కొబ్బరి ఆకులతో తోరణాలు, పందిళ్లు, బొమ్మలు విరివిగా కనిపిస్తాయి. అంతేకాదు, కొబ్బరి పీచు, మట్టలతో తయారైన తాళ్లు, డోర్ మ్యాట్‌లు, కుర్చీ సీట్లు, పూల కుండీలు... వంటివి ఇప్పటికే మన ఇంట్లో భాగం అయిపోయి ఉంటాయి. ఇప్పుడు కొబ్బరి మట్టలు, కొబ్బరి ఆకులతో రకరకాల జంతువుల బొమ్మలుగా చేసి వాటిపై పెయింటింగ్స్ వేసి టీపాయ్, కాఫీ టేబుల్, వాల్, కార్నర్ డెకార్లుగా వీటిని అమర్చేస్తున్నారు.**











# చిన్న చిట్కా.. పెద్ద మార్పు..!

**వంట చేసే క్రమంలో వెలువడే కొన్ని వాయువులు పర్యావరణాన్ని కలుషితం చేయడంతో పాటు మన ఆరోగ్యానికీ ముప్పు తెచ్చిపెడతాయి. ఇలా జరగకుండా ఉండాలంటే.. వంట చేసే క్రమంలో చిన్న చిన్న జాగ్రత్తలు, చిట్కాలు పాటించడం మంచిదంటున్నారు నిపుణులు. అవేంటో తెలుసుకుందాం రండి..**



* వంట చేసే క్రమంలో కొంతమంది పాత్రలపై మూత పెట్టరు. మరికొంతమంది సగం వరకే పెట్టి వదిలేస్తారు. మూత పెట్టకుండా వండుకోవడం వల్ల 20 శాతం అదనంగా ఇంధనం వాడాల్సి వస్తుందని పలు అధ్యయనాలు చెబుతున్నాయి. కాబట్టి ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకోవడం మంచిది.
* ఆహారాన్ని మాటిమాటికీ వేడి చేయడం ఆరోగ్యకరం కాదు. పైగా దీనివల్ల కూడా గ్యాస్ వృథా అవుతుంది. తద్వారా పర్యావరణానికీ నష్టమే.
* కిచెన్‌లో పోగయ్యే తడి చెత్త కూడా వాతావరణ కాలుష్య కారకమే! అయితే ఈ వృథాతో పాటు కుళ్లిపోయిన కాయగూరలు/పండ్లు, వాడిన కాఫీ/టీ పొడి పిప్పి, కోడిగుడ్డు పెంకులు, టీబ్యాగ్స్.. వంటివన్నీ కలిపి కంపోస్ట్ ఎరువుగా మార్చితే.. అటు కాలుష్యమూ తగ్గుతుంది.. ఇటు దీన్ని ఇంట్లో పెంచుకునే మొక్కలకు ఎరువుగానూ ఉపయోగించచ్చు.
* కొంతమంది కిచెన్‌లో ప్లాస్టిక్ డబ్బాలు, ప్లాస్టిక్ కవర్లే దర్శనమిస్తుంటాయి. నిత్యావసరాలు, కాయగూరలు తీసుకురావడానికీ చాలామంది ప్లాస్టిక్ సంచుల్నే ఉపయోగిస్తుంటారు. వీటికి బదులుగా క్లాత్ బ్యాగ్స్ ఉపయోగించడం, నిత్యావసరాల్ని గాజు/స్టీల్/సిలికాన్‌తో తయారుచేసిన డబ్బాల్లో భద్రపరచుకోవడం.. వంటివీ కిచెన్‌లో కాలుష్యాన్ని తగ్గించుకునేందుకు చక్కటి ప్రత్యామ్నాయ మార్గాలే అంటున్నారు నిపుణులు.



# అనుమతుల్లేని వెంచర్లతో 'ఎస్.ఎస్.ఎల్ ఇన్ఫ్రా' భారీ మోసం!

* **గుంటల లెక్కన అమ్మకాలు.. సర్కారు ఆదాయానికి గండి**
* **క్యాష్ బ్యాక్ పేరుతో మధ్యతరగతికి 'బురిడీ'**
* **పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు**

మర్పల్లి/హైదరాబాద్ (జనవరి 28): మర్పల్లి మండల కేంద్రంతో పాటు తుమ్మలపల్లి, పొట్లూర్ గ్రామాల్లో రియల్ ఎస్టేట్ మాఫియా రెచ్చిపోతోంది. ఎస్.ఎస్.ఎల్ ఇన్ఫ్రా పేరుతో వెలసిన అక్రమ వెంచర్లు, ఫాం ల్యాండ్లు సామాన్య ప్రజలను నిలువునా ముంచుతున్నాయి. డీటీసీపీ లేదా పంచాయతీ అనుమతులు లేకుండానే సాగు భూములను ప్లాట్లుగా మార్చి, అమాయక కొనుగోలుదారులకు అంటగడుతున్నారు. ఈ అక్రమాలపై బాధితులు ఇచ్చిన ఫిర్యాదుతో హైదరాబాద్‌లోని పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది.

**మొలకల వెనుక 'ముసుగు' దందా:**

నిబంధనల ప్రకారం వెంచర్లలో 33 ఫీట్ల రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ సౌకర్యాలు కల్పించడంతో పాటు 10 శాతం భూమిని పంచాయతీకి కేటాయించాలి. అయితే, ఎస్. ఎస్ ఎల్ ఇన్ఫ్రా నిర్వాహకులు ఈ నిబంధనలను తుంగలో తొక్కారు. ల్యాండ్ కన్వర్షన్ ఫీజు ఎగ్గొట్టేందుకు హద్దు రాళ్లకు బదులు మొక్కలు నాటి, వాటిని సాగు భూమిగానే చూపుతూ రిజిస్ట్రేషన్లు కానిచ్చేస్తున్నారు. గజాల్లో కాకుండా గుంటల లెక్కన (121 గజాలు) విక్రయిస్తూ తహసీల్దార్ కార్యాలయాల్లో వ్యవసాయ భూమిగా రిజిస్ట్రేషన్ చేయిస్తూ ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారు.






**క్యాష్ బ్యాక్ ఆశచూపి నిలువు దోపిడీ:**

తక్కువ ధరకు ప్లాట్లు, పెట్టిన పెట్టుబడిపై 'క్యాష్ బ్యాక్' వస్తుందంటూ మధ్యతరగతి ప్రజలను ఆకర్షించి ఈ సంస్థ బురిడీ కొట్టిస్తోంది. డీటీసీపీ అనుమతులు ఉన్నాయంటూ నమ్మబలికి తీరా డబ్బులు వసూలు చేశాక చేతులెత్తేస్తున్నారు. సర్వే నంబర్ 223/ఎ/2/1 తో పాటు పలు ప్రాంతాల్లో ఎటువంటి అనుమతుల్లేని ఈ వెంచర్లలో ప్లాట్లు కొన్నవారు భవిష్యత్తులో ఇల్లు కట్టుకోవాలన్నా, ఎల్‌ఆర్‌ఎస్ కట్టాలన్నా తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది.



**పోలీసుల రంగప్రవేశం:**

ఎస్.ఎస్.ఎల్ ఇన్ఫ్రా సంస్థ చేతిలో మోసపోయిన బాధితులు పంజాగుట్ట పోలీసులను ఆశ్రయించగా, నిర్వాహకులపై సెక్షన్ 420.406.r/w 34 IPC క్రింద కేసు నమోదు చేశారు. ఎస్.ఎస్.ఎల్ ఇన్ఫ్రా సంస్థలో మోసపోయిన బాధితులు ఎవరైనా ఉంటే పంజాగుట్ట పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు ఇవ్వాల్సిందిగా స్టేషన్ హౌస్ ఆఫీసర్ రామకృష్ణ తెలిపారు. ఇరిగేషన్, రెవెన్యూ అధికారుల అండదండలతోనే ఈ అక్రమ దందా సాగుతోందని రైతులు, బాధితులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, మర్పల్లి మండలంలోని అక్రమ వెంచర్ల రిజిస్ట్రేషన్లను నిలిపివేసి, సదరు భూములను నిషేధిత జాబితాలో చేర్చాలని డిమాండ్ చేస్తున్నారు.



## కార్యకర్తలకు వారి కుటుంబాలకు అండగా ఉంటాను

* **: బద్వేల్ వై సి పి అదనపు సమన్వయ కర్త నల్లేరు విశ్వనాథ్ రెడ్డి**

పోరుమామిళ్ల, భారత శక్తి ప్రతినిధి, జనవరి 29: కలసపాడు మండలము ముద్దిరెడ్డిపల్లె గ్రామ వాస్తవ్యులు శ్రీమతి బైరెడ్డి విమలమ్మ (48 సం.) భర్త సుబ్బారెడ్డి (ఏఎస్ ఐ) నిన్నటి రోజున గుండెపోటుతో మరణించడం జరిగినది. ఈ విషయం తెలుసుకున్న బద్వేల్ నియోజకవర్గ వైస్సార్సీపీ అదనపు సమన్వయకర్త నల్లేరు విశ్వనాథ రెడ్డి పార్థీవ దేహముపై పుష్పగుచ్ఛమును ఉంచి నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేయడం జరిగినది.

## రాజ్యాంగాన్ని పాఠ్యాంశంగా ప్రవేశ పెట్టాలి

* **నేదునూరి కనకయ్య**

భారత శక్తి ప్రతినిధి, జనవరి 29: భారతదేశం బ్రిటిష్ పాలన నుండి విముక్తి పొందిన తర్వాత స్వతంత్ర పరిపాలన వ్యవస్థ కొరకు 1930 సంవత్సరంలో ఇదే రోజున భారత జాతీయ కాంగ్రెస్ పూర్ణ స్వరాజ్ ప్రకటించిన రోజు జ్ఞాపకార్థంగా 26 జనవరి నాడు 77వ గణతంత్ర దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం రాజ్యాంగబద్ధమైన పాలన ఈరోజు నుండి ప్రారంభమైంది . భారతదేశంలో ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యాంగా అవతరించిన రోజు. ప్రజలకు సార్వభౌమాధికారం స్వేచ్ఛ సమానత్వం సౌభ్రాతృత్వం రాజ్యాంగం పీఠికలో పొంద పరచడం జరిగింది. ఈరోజు రాజ్యాంగ విలువల గురించి స్మరించుకుంటారు. బ్రిటిష్ పరిపాలన చట్టాల స్థానంలో సొంత పాలన ప్రారంభమైంది.

* **2026 సంవత్సరం గణతంత్ర దినోత్సవ యొక్క థీమ్***

వందేమాతరం ఆత్మనిర్భర్ భారత్ ఇతివృత్తంగా నిర్వహించడం జరుగుతుంది. 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ప్రభుత్వం వందేమాతర గీతం జాతి విముక్తి పై కలిగించిన ప్రభావాన్ని రిపబ్లిక్ డే లో ప్రత్యేకంగా ప్రదర్శిస్తారు

**ప్రజాస్వామ్య స్ఫూర్తి**

ప్రజలే ప్రభువులు అన్న సూత్రంతో అధికార పీఠం అత్యున్నత స్థానంప్రజలకు( ఓటర్లకు) రాజ్యాంగంలో ఇవ్వడం జరిగింది ప్రజాస్వామిక విధానాలే దేశానికి శరణ్యం. రాజ్యాంగం ప్రజాస్వామ్య స్ఫూర్తికి పునాదిగా నిలిచింది.

* **రాజ్యాంగం పై అవగాహన కల్పించాలి**

ప్రభుత్వం విద్యా సంస్థల్లో ప్రాథమిక స్థాయి నుండి 'పీ'జీ స్థాయి వరకు రాజ్యాంగాన్ని పాఠ్యాంశంగా ప్రవేశ పెట్టి రాజ్యాంగంపై అవగాహన కలిగించాలి. భారత రాజ్యాంగం ఉనికిలోకి వచ్చి77 సం" రాల సందర్భంగా గణతంత్ర దినోత్సవం జరుపు కుంటున్నప్పటికి జన బాహుళ్యంలోకి రాజ్యాంగం గురించి ప్రచారం చేయడం అవగాహన కల్పించడంలో కేంద్ర 'రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమైనాయి.

* **హక్కులు పరిపాలన చట్టాల మీధ అవగాహన కల్పించాలి**

రాజ్యాంగంలోని అంశాలు స్థానిక' రాష్ట్ర :కేంద్ర ప్రభుత్వాల ఏర్పాటు పరిపాలన చట్టాలు మానవ హక్కులు'ప్రాథమిక హక్కులు ఆదేశిక సూత్రాలు రాష్ట్ర' కేంద్ర జాబితా ఉమ్మడి జాబితాలోని అంశాలుమరియు సూక్ష్మ స్థూల స్థాయి ఆర్థిక ప్రణాళికల అమలు అధికార వికేంద్రీకరణ మొదలగు అంశాల పై అవగాహన చైతన్యం కలిగించాలి. సామాజిక భద్రత చట్టాలపట్ల ప్రజలకు అవగాహన కలిగించే ప్రయత్నం జరుగలేదు.

* **రాజ్యాంగం బ్రహ్మ పదార్థం**

రాజ్యాంగం అంటే ఎవ్వరికీ అర్థం కాని బ్రహ్మపదార్థం ఐయ్యింది.రాజ్యాంగ మంటే ఆంభేడ్కర్ రచించాడు అని మాత్రమే చాలా మందికి తెలుసు.

* **రాజ్యాంగాన్ని ఉచితంగా పంపిణీ చెయ్యాలి**

రోడు మీద! భగవద్గీత' బైబిల్' కురాన్ మత గ్రంథాలను ఉచితంగా లేదా తక్కువ ధరలకు అమ్మినట్లు రాజ్యాంగాన్ని వాడుక బాషలో ప్రింట్ చేసి ప్రజలకు ఉచితంగా పంచిపెట్టాలి.

* **మీడియా కళారూపాల ద్వారా అవగాహన కల్పించాలి**

విద్యాసంస్థల్లో కళాశాలలో రాజ్యాంగ పట్ల అవగాహన చైతన్య సదస్సులు చర్చా గోష్టులు నిర్వహించాలి .వివిధ సామాజికమాధ్యమాలద్వారా కళారూపాల ద్వారా వాడుక బాషలో నాటకాల ప్రదర్శన ద్వారా గ్రామీణులకు రాజ్యాంగం పట్ల అవగాహన కలిగించాలి.ఇటీవల రాజ్యాంగం మార్చాలని రద్దు చేయాలని కొత్త రాజ్యాంగం రూపొందించాలని జాతీయ స్థాయిలోచర్చలు వాదోపవాదాలు జరుగుతున్నాయి.

* **రాజ్యాంగబద్ధమైన పాలన విఫలం**

78 సం" రాల స్వాతంత్ర్య చరిత్ర లో అధికారంలో వున్న పార్టీలు ప్రభుత్వాలు రాజ్యాంగ బద్ధంగా పాలనా వ్యవహారాలను నిర్వహిస్తే ఆశించిన ప్రజా సంక్షేమం సామాజిక ఆర్థిక ప్రగతి సిద్ధించేది. నిజానికి రాజ్యాంగం గురించి తెలిస్తే ప్రజలు పాలకులను ప్రభుత్వ అధికారులను ప్రశ్నిస్తారు.

## లోక కల్యాణార్థం 'మహారుద్ర సహిత సహస్రచండీ' యాగం

* **భక్తిశ్రద్ధలతో పాల్గొన్న కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి.**

ఎల్బీనగర్ జనవరి 29 భారత శక్తి: లోక కల్యాణాన్ని కాంక్షిస్తూ, దేశ విదేశాల్లోని ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని రాగన్నగూడలో "మహారుద్ర సహిత సహస్రచండీ" మహాయాగాన్ని అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. శ్రీ రేణుక రాజరాజేశ్వరి పీఠం ఆధ్వర్యంలో, ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త శ్రీ మెల్లూరి నవీన్ శర్మ గారి పర్యవేక్షణలో జరుగుతున్న ఈ జగన్మాత సేవలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది.



**ప్రత్యేక పూజల్లో కార్పొరేటర్:**

ఈ పవిత్ర క్రతువులో భాగంగా బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్ఎంసి కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి శనివారం యాగశాలను సందర్శించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజ హితం కోసం ఇలాంటి మహాయాగాలు నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. అమ్మవారి దివ్య ఆశీస్సులు ప్రజలందరికీ లభించాలని, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆయన ప్రార్థించారు. ఆధ్యాత్మిక మార్గంలో సామాజిక హితం ప్రస్తుత యాంత్రిక జీవనంలో ఆధ్యాత్మికత ద్వారానే మానసిక ప్రశాంతత లభిస్తుందని నిర్వాహకులు ఈ యాగం ద్వారా చాటిచెబుతున్నారు. సహస్రచండీ యాగం వంటి శక్తివంతమైన పూజలు ప్రకృతి వైపరీత్యాలను నివారించి, లోక శాంతిని చేకూరుస్తాయని భక్తుల విశ్వాసం. నవీన్ శర్మ గారి ఆధ్వర్యంలో వేద మంత్రోచ్చారణల మధ్య జరుగుతున్న ఈ కార్యక్రమం భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ వెంట బిజెపి డివిజన్ ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి, సీనియర్ నాయకులు వెంకట్రాంరెడ్డి, బీజేవైఎం అధ్యక్షులు సురేష్ కుమార్ తో పాటు పలువురు పార్టీ నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. యాగశాల పరిసరాలు అమ్మవారి నామస్మరణతో మారుమోగుతున్నాయి.

## విద్యార్థులు నిరంతరం శ్రమించాలి

* **నిరంతర శ్రామికుడు జాతి శ్రేయస్సుకోసం పాటుపడుతాడు**
* **రోడ్డు భద్రత పట్ల సమాజాన్ని విద్యార్థులు జాగృతం చేయాలి**
* **తలిదండ్రులు ప్రత్యక్ష దైవాలు,వారిని గౌరవిస్తూ, వారి ఆశయాలను పిల్లలు నెరవేర్చాలి**
* **వేధింపుల పట్ల విద్యార్థులు ఉపేక్షించకుండా ఆదిలోనే వాటిని అనిచివేయాలి, పోలీసు వారికి ఫిర్యాదులు చేయాలి: సూర్యాపేట జిల్లా ఎస్పీ కె.నరసింహ**



సూర్యాపేట(భారత శక్తి జిల్లా ప్రతినిధి) : జనవరి 29: రోడ్డు భద్రత,రోడ్డు ప్రమాదాల నివారణ, నియమ నిబంధనలు పాటించడం పట్ల ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఉండాలని చుట్టుప్రక్కల వారిని చైతన్యవంతం చేయాలని సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ తెలిపారు.రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాలలో భాగంగా సూర్యాపేట పట్టణానికి చెందిన ఎమ్మెస్సార్ పాఠశాల యజమాన్యం విద్యార్థులు చేపట్టిన రోడ్డు భద్రతా కార్యక్రమం ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని అవగాహన కల్పించే కార్యక్రమం చేపట్టడం చాలా మంచి ఉద్దేశమని వారిని అభినందించారు. ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించాలి అంటూ రూపొందించిన పోస్టర్లను సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయం నందు ఏర్పాటుచేసిన రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమంలో ఆవిష్కరించి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. హెల్మెట్ ధరించడం సీటు బెల్టు పెట్టుకోవడం అతివేగాన్ని నివారించడం వంటి పోస్టర్లను విద్యార్థులతో కలిసి ఎస్పీ ఆవిష్కరించారు.విద్యార్థులు నిరంతరం శ్రమించాలని, కష్టపడి చదువుకోవాలని ఉన్నత ఆశయాలతో ముందుకు వెళ్లాలని కోరారు.నిత్యం శ్రమించే వారు జాతి శ్రేయస్సు కోసం జాతి రక్షణ కోసం పాటుపడతారని తెలిపారు. రోడ్డు భద్రత పట్ల తల్లిదండ్రులను చుట్టుపక్కల వారిని చైతన్యవంతం చేయాలని ప్రతి ఒక్క విద్యార్థి అంబాసిడర్ గా ఉండాలని కోరారు.విద్యార్థులు రోడ్డు భద్రతను ఇంటి నుండే ప్రారంభించాలని ద్విచక్ర వాహనం పై ప్రయాణం చేసే సమయంలో తల్లిదండ్రులు హెల్మెట్ పెట్టుకునేలా తెలియజేయాలని అన్నారు. సీట్ బెల్ట్ పెట్టుకోవడం గురించి వివరించాలని తెలిపారు. తల్లిదండ్రులు ప్రత్యక్ష దైవ్యాలు తల్లిదండ్రులను గౌరవిస్తూ పిల్లలు వారి ఆశయాలను నెరవేర్చాలని సూచించారు. మంచి చెడులపై అవగాహన కలిగి ఉండాలని కోరారు. ఎవరైనా వేధింపులకు గురి చేసినట్లయితే అలాంటి వారి గురించి తల్లిదండ్రులకు లేదా ఉపాధ్యాయులకు తెలియజేయాలని వేధింపులను ఉపేక్షించకూడదు పోలీసు వారికి ఫిర్యాదు చేసి సమస్యను ఆదిలోనే అణచివేయాలని కోరారు. పోక్సో చట్టం గురించి తెలియజేశారు. ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నియమాలను తూచా తప్పకుండా పాటించాలని మద్యం సేవించి వాహనాలు నడపరాదని హెచ్చరించారు ప్రమాద రహిత జిల్లాగా సూర్యాపేటలో చూపించడం అందరి బాధ్యత అని కోరారు.ఈ కార్యక్రమం నందు అదనపు ఎస్పి రవీందర్ రెడ్డి, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ ఆదిత్య, సూర్యాపేట రూరల్ సీఐ రాజశేఖర్, ఎమ్మెస్సార్ పాఠశాల డైరెక్టర్ శ్రీనివాస్, అధికారులు, సిబ్బంది, పాటశాల విద్యార్థులు ఉన్నారు.కార్యక్రమం అనంతరం పాఠశాల విద్యార్థులు సూర్యాపేట పట్టణ ముఖ్య కూడలలో కార్యక్రమాలు నిర్వహిస్తూ ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ ధరించాలంటూ వాహనాలకు స్టిక్కర్లను అంటి పెడుతూ అవగాహన కల్పించారు.

## బంగారం ధర పెరగడంతో స్నాచింగ్‌లు ఎక్కువయ్యాయా?.. క్లారిటీ ఇచ్చిన సజ్జనార్

హైదరాబాద్, (భారత శక్తి జిల్లా ప్రతినిధి) : బంగారం ధరలు భారీగా పెరిగిన నేపథ్యంలో చైన్ స్నాచింగ్‌లు విపరీతంగా పెరిగిపోయాయని సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారంపై హైదరాబాద్ సీపీ సజ్జనార్ స్పందించారు. బంగారం ధరలు పెరిగినందున రాష్ట్రంలో అంతర్రాష్ట్ర ముఠాలు హైదరాబాద్ నగరంలో మకాం వేశాయని, చైన్ స్నాచింగ్‌లు ఎక్కువయ్యాయని సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని ఆయన 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. దయచేసి సోషల్ మీడియాలో వచ్చే ధృవీకరించని వార్తలను నమ్మవద్దని, భయపెట్టే పోస్టులను ఫార్వార్డ్ చేయవద్దని సూచించారు. భయాందోళనలు సృష్టించేలా అసత్య ప్రచారాలు చేసే వారిపై చట్టపరమైన, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హైదరాబాద్ నగరం పూర్తిగా సురక్షితమని అన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులకు సహకరించాలని సూచించారు. ఏదైనా అనుమానం వస్తే డయల్ 100కు కాల్



# మౌలిక సదుపాయాల్లో దూసుకెళుతున్న భారత్.. ఆర్థిక సర్వే 2026లో కీలక విషయాలు

ఢిల్లీ, జనవరి 29 (భారత శ)క్తి: భారతదేశ వృద్ధి వ్యూహంలో మౌలిక సదుపాయాల రంగం కేంద్ర స్థానంలో ఉందని, ఈ రంగంలో ప్రభుత్వ మూలధన వ్యయం స్థిరంగా పెరుగుతోందని ఆర్థిక సర్వే 202526 స్పష్టం చేసింది. ఇవాళ విడుదల చేసిన ఈ సర్వే ప్రకారం, ప్రైవేట్ పెట్టుబడులను ఆకర్షించడంలో భారత్ ప్రపంచంలోనే అగ్రగామి దేశాల్లో ఒకటిగా నిలిచింది. తక్కువ, మధ్య ఆదాయ ఆర్థిక వ్యవస్థలలో మౌలిక సదుపాయాల కల్పనలో ప్రైవేట్ పెట్టుబడుల విషయంలో ప్రపంచ బ్యాంకు ర్యాంకింగ్స్‌లో భారత్ టాప్5 దేశాల్లో ఒకటిగా నిలిచింది. పీఎం గతిశక్తి, జాతీయ లాజిస్టిక్స్ పాలసీ వంటివి ఈ వృద్ధికి దోహదపడ్డాయని సర్వే పేర్కొంది. దీనివల్ల లావాదేవీల ఖర్చులు, ప్రాజెక్టుల అమలులో రిస్కులు తగ్గాయి. ప్రభుత్వ మూలధన వ్యయం ఎఫ్‌వై18లో రూ. 2.63 లక్షల కోట్ల నుంచి ఎఫ్‌వై26 నాటికి రూ. 11.21 లక్షల కోట్లకు, అంటే దాదాపు 4.2 రెట్లు పెరిగింది. జాతీయ రహదారుల నెట్‌వర్క్ 2014లో 91,287 కిలోమీటర్ల నుంచి 2026 డిసెంబర్ నాటికి 1,46,572 కిలోమీటర్లకు విస్తరించింది. విమానయాన రంగంలో విమానాశ్రయాల సంఖ్య 2014లో 74 నుంచి 2025 నాటికి 164కు పెరిగింది. రైల్వే నెట్‌వర్క్‌లో 99.1 శాతం విద్యుదీకరణ పూర్తయింది. 'మారిటైమ్ ఇండియా విజన్' వంటి పథకాలతో భారత పోర్టుల పనితీరు మెరుగుపడి, 7 పోర్టులు ప్రపంచ బ్యాంకు టాప్ 100 జాబితాలో స్థానం దక్కించుకున్నాయి. విద్యుత్ రంగంలోనూ భారీ విస్తరణ జరిగింది. మొత్తం స్థాపిత సామర్థ్యం 509.74 గిగావాట్లకు చేరగా, ఇందులో పునరుత్పాదక ఇంధన వాటా దాదాపు 49.83 శాతంగా ఉంది. గత దశాబ్ద కాలంలో పునరుత్పాదక ఇంధన సామర్థ్యం మూడు రెట్లకు పైగా పెరిగి 253.96 గిగావాట్లకు చేరుకుందని సర్వే తెలిపింది. పునరుత్పాదక ఇంధన ఉత్పత్తిలో భారత్ ప్రపంచంలో మూడో స్థానంలో ఉంది.

## అజిత్ పవార్ అంత్యక్రియల్లో నారా లోకేశ్..



మహారాష్ట్ర, జనవరి 29 (భారత శ)క్తి: మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ భౌతికకాయాన్ని రాష్ట్ర విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేశ్ సందర్శించి నివాళులు అర్పించారు. బారామతిలో నిర్వహించిన అజిత్ పవార్ అంత్యక్రియల్లో మంత్రి లోకేశ్ పాల్గొన్నారు. దివంగత అజిత్ పవార్‌కు నివాళులర్పించిన వారిలో రాష్ట్ర రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీనేత లావు కృష్ణదేవరాయలు, ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి ఉన్నారు. మరోవైపు అజిత్ పవార్ అంత్యక్రియలను ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో నిర్వహించారు. అంత్యక్రియలకు కేంద్రమంత్రులు అమిత్ షా, నితిన్ గడ్కరీ హాజరయ్యారు. మహారాష్ట్ర సీఎం, డిప్యూటీ సీఎంతో పాటు రాష్ట్ర మంత్రులు, ఇతర పార్టీలకు చెందిన కీలక నేతలు కూడా హాజరయ్యారు.

## ఏపీలో 2 లేన్ల జాతీయ రహదారులను 4 లేన్లుగా మార్చండి

అమరావతి, జనవరి 29 (భారత శ)క్తి: రాష్ట్రంలో రోడ్ నెట్‌వర్క్‌ను మరింత బలోపేతం చేయడంపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఇందులో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతిలోని తన క్యాంప్ కార్యాలయంలో జాతీయ రహదారుల ప్రాజెక్టులపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం 2 లేన్లుగా ఉన్న జాతీయ రహదారులను 4 లేన్లుగా విస్తరించేందుకు తక్షణమే ప్రణాళికలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో రాష్ట్రంలో జాతీయ రహదారుల నెట్‌వర్క్ విస్తరణ, రాష్ట్ర రహదారుల అభివృద్ధి, రోడ్ డెన్సిటీ పెంపుదల వంటి కీలక అంశాలపై చర్చించారు. ప్రస్తుతం కొనసాగుతున్న ఎన్‌హెచ్ ప్రాజెక్టుల పురోగతిని, కొత్తగా చేపట్టాల్సిన రహదారుల నిర్మాణం గురించి అధికారులతో సమీక్షించారు. ప్రాజెక్టుల అమలులో ఆంధ్రప్రదేశ్ దేశానికే ఒక బెంచ్‌మార్క్‌గా నిలవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. పనుల్లో నాణ్యత, వేగం పాటించాలని స్పష్టం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి, ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు, జాతీయ రహదారుల సంస్థ (NHAI)కు చెందిన పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## అజిత్ పవార్ విమాన దుర్ఘటన... బ్లాక్ బాక్స్ దొరికింది!

మహారాష్ట్ర, జనవరి 29 (భారత శ)క్తి: బారామతి సమీపంలో జరిగిన ఘోర విమాన ప్రమాదంలో మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ మృతి చెందిన ఘటనపై దర్యాప్తులో కీలక పురోగతి చోటుచేసుకుంది. ప్రమాదానికి గురైన విమానం బ్లాక్ బాక్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు వెల్లడించారు. ఈ మేరకు మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌కు గురువారం ఆయన అధికారికంగా లేఖ రాశారు. ఈ దురదృష్టకర ఘటన పట్ల కేంద్ర విమానయాన మంత్రిత్వ శాఖ తీవ్ర విచారం వ్యక్తం చేస్తోందని రామ్మోహన్ నాయుడు తన లేఖలో పేర్కొన్నారు. ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ విషయాన్ని అత్యంత సీరియస్‌గా తీసుకున్నట్లు స్పష్టం చేశారు. ప్రమాదం జరిగిన వెంటనే ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (AAIB), డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (DGCA) బృందాలు ఘటనాస్థలానికి చేరుకుని ఉన్నత స్థాయి విచారణ ప్రారంభించినట్లు తెలిపారు. ఫ్లైట్ డేటా రికార్డర్ అయిన బ్లాక్ బాక్స్‌ను స్వాధీనం చేసుకోవడం దర్యాప్తులో అత్యంత కీలకమని భావిస్తున్నారు. విమానం చివరి క్షణాల్లో ఏం జరిగిందనే దానిపై ఇది స్పష్టత ఇవ్వనుంది. అధికారులు ప్రస్తుతం సాంకేతిక రికార్డులు, ఆపరేషనల్ లాగ్స్, ఘటనాస్థలంలోని ఆధారాలను పరిశీలిస్తున్నారు. ఈ దర్యాప్తు పూర్తి పారదర్శకంగా, నిర్దిష్ట కాలపరిమితిలో జరుగుతుందని రామ్మోహన్ నాయుడు హామీ ఇచ్చారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా చూసేందుకు, ప్రాథమిక, తుది నివేదికల ఆధారంగా అవసరమైన భద్రతాపరమైన సిఫార్సులు, చర్యలు అమలు చేస్తామని ఫడ్నవీస్‌కు హామీ ఇచ్చారు. దర్యాప్తునకు సహకరిస్తున్న మహారాష్ట్ర ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## పంజాబ్ సరిహద్దుల్లో భారీ కుట్ర భగ్నం..

పంజాబ్, జనవరి 29 (భారత శ)క్తి: పంజాబ్ సరిహద్దు ప్రాంతాల్లో పోలీసులు పెద్ద ఎత్తున సాగుతున్న మాదకద్రవ్యాలు, ఆయుధాల అక్రమ రవాణా కుట్రను భగ్నం చేశారు. విలేజ్ డిఫెన్స్ కమిటీ (వీడీసీ) నుంచి అందిన కీలక సమాచారంతో అమృత్‌సర్ రూరల్ పోలీసులు మెరుపు దాడి నిర్వహించి భారీ మొత్తంలో హెరాయిన్‌తో పాటు మారణాయుధాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఆపరేషన్‌కు సంబంధించిన వివరాలను పంజాబ్ డీజీపీ గౌరవ్ యాదవ్ సోషల్ మీడియా వేదిక ఎక్స్ ద్వారా వెల్లడించారు. దాడుల్లో మొత్తం 42,983 కిలోల హెరాయిన్, నాలుగు హ్యాండ్ గ్రెనేడ్లు, ఒక స్టార్ మార్క్ పిస్టల్, 46 లైవ్ బుల్లెట్లు, అలాగే నిందితులు వదిలివెళ్లిన ఒక మోటార్‌సైకిల్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. విలేజ్ డిఫెన్స్ కమిటీ సభ్యుల అప్రమత్తత వల్లే ఈ భారీ స్మగ్లింగ్ ప్రయత్నాన్ని అడ్డుకోవడం సాధ్యమైందని పోలీసులు పేర్కొంటూ, వారి సహకారాన్ని ప్రశంసించారు. ఈ ఘటనకు సంబంధించి అమృత్‌సర్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేయగా, పరారీలో ఉన్న ఇతర నిందితుల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. స్వాధీనం చేసుకున్న డ్రగ్స్, ఆయుధాలు ఎక్కడి నుంచి వచ్చాయి? వీటి వెనుక పనిచేస్తున్న అంతర్జాతీయ స్మగ్లింగ్ నెట్‌వర్క్ ఏమిటి? అన్న అంశాలపై దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు తెలిపారు. దేశ భద్రతకు ముప్పు కలిగించే ఇలాంటి కుట్రల వెనుక ఉన్న అసలు సూత్రధారులను త్వరలోనే పట్టుకుంటామని డీజీపీ గౌరవ్ యాదవ్ స్పష్టం చేశారు.

## మేడారంలో మొక్కులు చెల్లించుకున్న
# కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, జువల్ ఓరం



ములుగు, జనవరి 29 (భారత శ)క్తి: ఆసియాలోనే అతిపెద్ద గిరిజన పండుగగా ప్రసిద్ధి చెందిన మేడారం సమ్మక్క సారలమ్మ జాతరను కేంద్ర మంత్రులు గురువారం సందర్శించారు. కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ మంత్రి జువల్ ఓరం, బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి వనదేవతలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రవేశ ద్వారం వద్ద వారికి రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సాదర స్వాగతం పలికారు. గిరిజన డప్పు వాయిద్యాల మధ్య ఆలయంలోకి ప్రవేశించిన కేంద్ర మంత్రులు, గద్దెలపై 'నిలువెత్తు బంగారం' సమర్పించి తమ మొక్కులను చెల్లించుకున్నారు. అనంతరం జువల్ ఓరం మీడియాతో మాట్లాడుతూ, సమ్మక్క సారలమ్మ జాతర గిరిజనుల మహా కుంభమేళా అని అభివర్ణించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదేశాల మేరకు, 20 ఏళ్ల తర్వాత మళ్లీ ఇక్కడికి రావడం సంతోషంగా ఉందన్నారు. గిరిజన సంక్షేమానికి కేంద్రం కట్టుబడి ఉందని, పీఎం జన్‌మన్ పథకం కింద రూ. 24,000 కోట్లు, తెలంగాణకు 23 ఏకలవ్య పాఠశాలలు కేటాయించినట్లు తెలిపారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ, జాతర అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పనిచేస్తున్నాయని చెప్పారు. ఈ ప్రాంత పర్యాటక అభివృద్ధికి రూ. 80 కోట్లు, రామప్ప ఆలయానికి రూ. 40 కోట్లు, జాతర ఏర్పాట్లకు ఈ ఏడాది రూ. 3.70 కోట్లు కేటాయించినట్లు వివరించారు. మేడారంలో సమ్మక్క సారలమ్మ పేరుతో రూ. 890 కోట్ల వ్యయంతో సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నామని, ఇప్పటికే పనులు ప్రారంభమయ్యాయని వెల్లడించారు. త్వరలోనే ప్రధాని ఈ ప్రాజెక్టును లాంఛనంగా ప్రారంభిస్తారని ఆయన స్పష్టం చేశారు.

## యూజీసీ 2026 నిబంధనలపై
# సుప్రీంకోర్టు స్టే

ఢిల్లీ, జనవరి 29 (భారత శ)క్తి: ఉన్నత విద్యా సంస్థల్లో సమానత్వ ప్రోత్సాహం కోసం యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) తీసుకొచ్చిన 2026 నిబంధనల అమలుపై సుప్రీంకోర్టు ఇవాళ మధ్యంతర స్టే విధించింది. తదుపరి ఉత్తర్వులు ఇచ్చేంత వరకు 2012 నాటి పాత నిబంధనలే అమల్లో ఉంటాయని స్పష్టం చేసింది. ఈ వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వానికి, యూజీసీకి నోటీసులు జారీ చేసింది. యూజీసీ కొత్త నిబంధనలు జనరల్ కేటగిరీ విద్యార్థుల పట్ల వివక్ష చూపించేలా ఉన్నాయని, వారికి ఫిర్యాదు చేసే యంత్రాంగాన్ని నిరాకరిస్తున్నాయని ఆరోపిస్తూ పలు పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిపై విచారణ చేపట్టిన సీజేఐ సూర్యకాంత్, జస్టిస్ జాయ్ మాల్యా బాగ్చీలతో కూడిన ధర్మాసనం ఈ ఉత్తర్వులు జారీ చేసింది. "మేము జోక్యం చేసుకోకపోతే, ఇది ప్రమాదకరమైన ప్రభావాన్ని చూపుతుంది. సమాజాన్ని విభజిస్తుంది, తీవ్ర పరిణామాలకు దారితీస్తుంది" అని ధర్మాసనం ఈ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేసింది. కొత్త నిబంధనల ప్రకారం 'కుల ఆధారిత వివక్ష' అనే పదాన్ని కేవలం ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాలకే పరిమితం చేశారని పిటిషనర్లు ఆరోపించారు. దీనివల్ల జనరల్ కేటగిరీకి చెందిన వారికి ఎలాంటి వివక్ష ఎదురైనా ఫిర్యాదు చేసే అవకాశం లేకుండా పోతుందని, ఇది రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 15(1), 21లను ఉల్లంఘించడమేనని వాదించారు. పిటిషనర్ల వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం, 'సంపూర్ణ న్యాయం' కోసం రాజ్యాంగంలోని ఆర్టికల్ 142 కింద తమకున్న ప్రత్యేక అధికారాలను ఉపయోగించి ఈ నిబంధనలను నిలిపివేస్తున్నట్లు తెలిపింది. అనంతరం తదుపరి విచారణను మార్చి 19వ తేదీకి వాయిదా వేసింది.

## ఆత్మవిశ్వాస భారత్‌కు ఈయూ ఒప్పందం నిదర్శనం: ప్రధాని

ఢిల్లీ, జనవరి 29 (భారత శ)క్తి: బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ పార్లమెంట్ వెలుపల మీడియాతో మాట్లాడారు. భారత్‌యూరోపియన్ యూనియన్ మధ్య కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (FTA), "ఆశావహ, ఆత్మవిశ్వాస, ఆత్మనిర్భర్ భారత్" స్ఫూర్తిని ప్రతిబింబిస్తోందని అన్నారు. 21వ శతాబ్దపు ఈ త్రైమాసికంలో భారతదేశం ప్రపంచానికి ఒక ఆశాకిరణంగా, ఆకర్షణ కేంద్రంగా మారిందని పేర్కొన్నారు. దేశ ఆర్థిక, ప్రజాస్వామ్య బలంపై ప్రపంచానికి పెరుగుతున్న విశ్వాసానికి ఇదే నిదర్శనమని తెలిపారు. ఈ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం ద్వారా భారతదేశానికి, ముఖ్యంగా యువతకు ఉజ్వల భవిష్యత్తు లభిస్తుందని మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు. "భారత్, యూరప్ మధ్య ఈ చారిత్రాత్మక ఒప్పందం కుదిరినప్పుడు మన పారిశ్రామికవేత్తలు, తయారీదారులు కేవలం పన్నుల తగ్గింపు గురించే ఆలోచించకూడదు. ఇది నాణ్యతను చాటుకోవాల్సిన గొప్ప అవకాశం. ఇప్పుడు మార్కెట్ మన కోసం తెరుచుకుంది. అత్యుత్తమ నాణ్యతతో యూరప్‌లోని 27 దేశాల హృదయాలను మనం గెలుచుకోవాలి. ఇది దీర్ఘకాలంలో మనకు ఎంతో మేలు చేస్తుంది" అని ప్రధాని వివరించారు. ఈ ఒప్పందం ద్వారా భారత రైతులు, యువత, సేవల రంగంలోని నిపుణులకు ప్రపంచ మార్కెట్లలో గణనీయమైన అవకాశాలు లభిస్తాయని విశ్వాసం వ్యక్తం చేశారు.

*** వికసిత్ భారత్ లక్ష్య సాధనలో బడ్జెట్ సమావేశాలు కీలకం: ప్రధాని**


2047 నాటికి 'వికసిత్ భారత్' సాధించాలనే సంకల్పంలో ఈ బడ్జెట్ సమావేశాలు ఒక ముఖ్యమైన అడుగు అని ప్రధాని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం 'రిఫార్మ్ ఎక్స్‌ప్రెస్'పై వేగంగా ముందుకు సాగుతోందని, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలకు శాశ్వత పరిష్కారాలు చూపుతోందని తెలిపారు. తమ ప్రభుత్వ పనితీరు "సంస్కరణ, పనితీరు, పరివర్తన" అనే సూత్రంపై ఆధారపడి ఉంటుందని స్పష్టం చేశారు. టెక్నాలజీని అందిపుచ్చుకుంటూనే, మానవతా దృక్పథాన్ని విస్మరించబోమని, చిట్టచివరి వ్యక్తి వరకు లబ్ధి చేకూరేలా చూస్తామని హామీ ఇచ్చారు.

*** వరుసగా 9వ బడ్జెట్.. నిర్మలా సీతారామన్‌పై మోదీ ప్రశంసలు**

అలాగే, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వరుసగా తొమ్మిదోసారి బడ్జెట్ ప్రవేశపెట్టడం దేశ పార్లమెంటరీ చరిత్రలో ఒక గర్వకారణమైన క్షణమని అభివర్ణించారు. అంతకుముందు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పార్లమెంటులో చేసిన ప్రసంగం 140 కోట్ల మంది భారతీయుల ఆత్మవిశ్వాసాన్ని, ఆకాంక్షలను ప్రతిబింబించిందని కొనియాడారు. దేశాభివృద్ధిని వేగవంతం చేసేందుకు ఎంపీలందరూ నిర్మాణాత్మక చర్చల్లో పాల్గొనాలని ప్రధాని కోరారు.

## కేసీఆర్ కు నోటీసులు అందించిన సిట్..

తెలంగాణ రాజకీయాల్లో ప్రకంపనలు పుట్టిస్తున్న ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ కు నోటీసులు అందాయి. హైదరాబాద్ లోని నందినగర్ లో ఉన్న కేసీఆర్ నివాసానికి వెళ్లిన సిట్ అధికారులు నోటీసులు అందించారు. రేపు మధ్యాహ్నం 3 గంటలకు విచారణ జరుపుతామని నోటీసుల్లో సిట్ అధికారులు పేర్కొన్నారు. కేసీఆర్ వయసు దృష్ట్యా విచారణ కోసం పోలీస్ స్టేషన్ కు రావాల్సిన అవసరం లేదని సిట్ తెలిపింది. హైదరాబాద్ నగర పరిధిలోని ఏదైనా ప్రాంతం వివరాలను తెలిపితే... అక్కడకే వచ్చి విచారణ జరుపుతామని పేర్కొంది. ఇప్పటికే ఈ కేసులో కేటీఆర్, హరీశ్ రావు, సంతోష్‌కుమార్ లను సిట్ విచారించింది. మళ్లీ అవసరమైతే విచారణకు పిలుస్తామని వారికి తెలియజేసింది. ఇప్పుడు గులాబీ బాస్ ను విచారణకు పిలవడంతో ఆ పార్టీలో ఉత్కంఠ నెలకొంది. రాబోయే రోజుల్లో ఈ కేసులో మరెన్ని మలుపులు చోటుచేసుకుంటాయో అనే ఆసక్తి సర్వత్ర నెలకొంది.



## పసిడి, వెండి ధరలకు రెక్కలు.. ఆల్ టైమ్ రికార్డ్

ఢిల్లీ, జనవరి 29 (భారత శ)క్తి: అంతర్జాతీయంగా నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో బంగారం, వెండి ధరలు ఇవాళ రికార్డు స్థాయికి చేరాయి. ఇరాన్‌పై సైనిక చర్యకు దిగుతామంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించడంతో సురక్షితమైన పెట్టుబడిగా భావించే బంగారం వైపు ఇన్వెస్టర్లు భారీగా మొగ్గుచూపారు. దీంతో పసిడి, వెండి ధరలు ఆల్‌టైమ్ గరిష్ఠాన్ని తాకాయి. భారత మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (MCX)లో ఈరోజు ఉదయం 10.45 గంటల సమయంలో ఫిబ్రవరి గోల్డ్ ఫ్యూచర్స్ ధర 5.99 శాతం పెరిగి 10 గ్రాములకు రూ. 1,75,885కి చేరింది. అదేవిధంగా మార్చి సిల్వర్ ఫ్యూచర్స్ 4.24 శాతం వృద్ధితో కిలోకు రూ. 4,01,699 పలికింది. అంతర్జాతీయ మార్కెట్లలోనూ ఇదే ధోరణి కనిపించింది. యూఎస్ డాలర్ బలహీనపడటం, వివిధ దేశాల సెంట్రల్ బ్యాంకులు పెద్ద ఎత్తున బంగారాన్ని కొనుగోలు చేస్తుండటం కూడా ఈ ర్యాలీకి కారణమైంది.

# కొరడా ఝుళిపించిన హైడ్రా!



* **జూబ్లీహిల్స్ నీరూస్ షాపు సీజ్**
* **అగ్నిగుండంలా నాంపల్లి ఫర్నీచర్ షోరూమ్.. తాళం వేసిన అధికారులు..**
* **షాపులా? చావు.. డెన్నులా? కమిషనర్ రంగనాథ్ ఫైర్...**
* **ప్రాణాలతో చెలగాటమాడితే ఖబర్దార్!**

హైదరాబాద్, జనవరి 29 (భారత శక్తి) : నిబంధనలు గాలికి.. జనం ప్రాణాలు బలికి అన్నట్టుగా తయారైంది సిటీలోని బడా వ్యాపారాల తీరు. అగ్నిప్రమాదాలు జరుగుతున్నా, అమాయకులు చనిపోతున్నా అడ్డగోలు దందాలు ఆపని షోరూమ్‌లపై 'హైడ్రా' విరుచుకుపడింది. గురువారం జూబ్లీహిల్స్, నాంపల్లి ఏరియాల్లో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్వయంగా రంగంలోకి దిగి తనిఖీలు చేపట్టారు. ఫైర్ సేఫ్టీని తుంగలో తొక్కడమే కాకుండా, అనుమతి లేని అక్రమ నిర్మాణాలతో ప్రమాదకరంగా మారిన నీరూస్ షోరూమ్‌తో పాటు ఓ భారీ ఫర్నీచర్ దుకాణాన్ని సీజ్ చేశారు.

**నీరూస్‌లో అన్నీ అక్రమాలే..**

>> జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్ 36లోని నీరూస్ వస్త్ర షోరూమ్‌లో అధికారులు తనిఖీ చేస్తే షాకింగ్ నిజాలు బయటపడ్డాయి.

>> రూఫ్ టాప్ గోదాము: భవనం పైన పర్మిషన్ లేకుండా రూఫ్ షెడ్డు వేసి, వందల టన్నుల వస్త్రాలను నింపేశారు.

>> చిమ్మచీకటి సెల్లార్లు: మూడు సెల్లార్లలో గాలి కూడా ఆడని రీతిలో స్టాక్ కుక్కేశారు. అమ్మకాలు చేసేది రెండు ఫ్లోర్లే అయినా, పైన మరో మూడు ఫ్లోర్లను డేంజర్ గోదాములుగా మార్చేశారు.

>> పనిచేయని ఆర్పే యంత్రాలు: కనీసం ఫైర్ ఎన్వోసీ లేదు సరికదా.. మంటలు చెలరేగితే ఆర్పే ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లు కూడా పనిచేయట్లేదు. దీంతో కనెక్షన్ కట్ చేసి అధికారులు షాపుకు సీల్ వేశారు.

* **ఐదుగురు చనిపోయినా బుద్ధి రాలే!**

>> నాంపల్లిలో మొన్ననే ఐదుగురు ప్రాణాలు కోల్పోయినా వ్యాపారుల తీరు మారలేదు. స్టేషన్ రోడ్డులోని 'రహీమ్, మన్నన్ ఎస్టేట్స్ స్టాండర్డ్ ఫర్నీచర్' షాపును తనిఖీ చేసిన కమిషనర్ అక్కడి పరిస్థితి చూసి షాక్ అయ్యారు.

>> మెట్ల దారిలోనూ సామాన్లే: ఆరు అంతస్తుల భవనంలో కనీసం నడవడానికి చోటు లేకుండా ఫర్నీచర్‌ను నింపేశారు.

>> ఎమర్జెన్సీ దారి క్లోజ్: అగ్నిప్రమాదం జరిగితే బయటకు వెళ్లే మెట్ల మార్గాన్ని కూడా వదలకుండా స్టాక్ పేర్చారు. ఒక్క ఫైర్ సేఫ్టీ పరికరం కూడా లేకపోవడంతో వెంటనే షాపును సీజ్ చేయించారు.



* **మీరు చూస్తున్నారా? అయితే ఫిర్యాదు చేయండి!**

>> మీ ఏరియాలో అక్రమంగా గోదాములు పెట్టినా, సెల్లార్లను వ్యాపారాలకు వాడుతూ ప్రాణాలకు ముప్పు కలిగిస్తున్నా భయపడకుండా ఫిర్యాదు చేయండి.

>> హైడ్రా హెల్ప్ లైన్: 90001 13667

>> నేరుగా కమిషనర్‌కు: 72079 23085 (వాట్సాప్ ద్వారా ఫోటోలు, వీడియోలు పంపవచ్చు)

>> సోషల్ మీడియా: X (ట్విట్టర్) @Commissioner_HYDRAA

>> "వ్యాపారం అంటే కేవలం లాభం కాదు.. జనం భద్రత కూడా ఉండాలి. షాపులను గోదాములుగా మార్చేసి ప్రజల ప్రాణాలను రిస్కులో పెడితే వెనకాముందు చూడకుండా కఠిన చర్యలు తీసుకుంటాం."

**- ఏవీ రంగనాథ్, కమిషనర్, హైడ్రా**

>> అక్రమ కట్టడాలపైనే కాదు.. అగ్నిప్రమాదాలకు కారణమయ్యే అడ్డగోలు నిల్వలపై కూడా హైడ్రా పంజా విసిరింది.




## కేసీఆర్‌పై రాజకీయ కక్షసాధింపు తగదు : రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం..

ఎల్బీనగర్, జనవరి 29 (భారత శక్తి ) : తెలంగాణ స్వరాష్ట్ర స్వప్నాన్ని సాకారం చేసి, పదేళ్లపాటు రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలిపిన అపర భగీరథుడు, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కేసీఆర్)పై కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని బీఆర్ఎస్వీ శ్రేణులు మండిపడ్డాయి. చరిత్రాత్మక నాయకుడైన కేసీఆర్‌పై బురద చల్లే ప్రయత్నంలో భాగంగానే సిట్ విచారణ పేరుతో నోటీసులు జారీ చేశారని ఆరోపిస్తూ, రంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో గురువారం ఎల్బీనగర్ ఫ్లైఓవర్ వద్ద భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

* **ప్రభుత్వంపై ధ్వజమెత్తిన షేర్ రమణ్**

ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి షేర్ రమణ్ మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. కుట్రపూరిత రాజకీయం: కేసీఆర్ పట్ల ప్రజల్లో ఉన్న ఆదరణను చూసి ఓర్వలేకనే రేవంత్ సర్కార్ ఇటువంటి కుట్రలకు తెరలేపిందని విమర్శించారు.

* **అభివృద్ధిని చూసి ఓర్వలేక:**

కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా తెలంగాణను సస్యశ్యామలం చేసిన నాయకుడిపై విచారణల పేరుతో వేధింపులకు గురిచేయడం దుర్మార్గమన్నారు.

* **సిట్ నోటీసులపై ఆగ్రహం:**

ఎటువంటి ఆధారాలు లేకుండా కేవలం రాజకీయ లబ్ధి కోసమే సిట్ నోటీసులు పంపించారని, దీనిని రాష్ట్రవ్యాప్తంగా ఉన్న విద్యార్థి లోకం తీవ్రంగా ఖండిస్తోందని హెచ్చరించారు.

* **నిరసనతో హోరెత్తిన ఎల్బీనగర్:**

ఈ నిరసన కార్యక్రమంలో బీఆర్ఎస్వీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. "జై తెలంగాణ జై కేసీఆర్" అనే నినాదాలతో ఎల్బీనగర్ చౌరస్తా హోరెత్తింది. ప్రజా సమస్యలను గాలికి వదిలేసి, ప్రతిపక్ష నాయకులను లక్ష్యంగా చేసుకోవడం మానుకోకపోతే రానున్న రోజుల్లో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు.

## బడంగ్‌పేట్ సర్కిల్‌లో ముమ్మరంగా 'స్పెషల్ శానిటేషన్ డ్రైవ్'

* **క్షేత్రస్థాయిలో పర్యవేక్షించిన డిప్యూటీ కమిషనర్ వి. సరస్వతి**
* **జీవీపీల తొలగింపు.. రంగవల్లికలతో ముస్తాబు**

బడంగ్‌పేట్, జనవరి 29 (భారత శక్తి ) : బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ సర్కిల్ 16 పరిధిలో పారిశుధ్య పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. గురువారం డిప్యూటీ కమిషనర్ శ్రీమతి వి. సరస్వతి ఆధ్వర్యంలో అన్ని డివిజన్లలో 'స్పెషల్ శానిటేషన్ డ్రైవ్' నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటించి, పారిశుధ్య పనులను పర్యవేక్షించడమే కాకుండా సిబ్బందికి పలు కీలక సూచనలు చేశారు.

* **డివిజన్ల వారీగా పారిశుధ్య పనులు:**


>> నగరంలోని ప్రధాన కూడళ్లు, అంతర్గత వీధుల్లో ఉన్న గార్బేజ్ వల్నరబుల్ పాయింట్స్ (GVP) లను పూర్తిగా శుభ్రం చేసి, అక్కడ మళ్లీ చెత్త వేయకుండా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు.

>> డివిజన్ 57: శివాజీ చౌక్, కళావతి నగర్ కమాన్, అల్మాస్‌గూడ, గుర్రంగూడ సాగర్ రోడ్, నాదర్గుల్ గొంది కాలనీల్లో చెత్త కుప్పలను తొలగించారు.

>> డివిజన్ 58: ప్రశాంతి హిల్స్, బడంగ్‌పేట్ కమాన్, హుడా కమ్యూనిటీ హాల్, రైతు బజార్ ప్రాంతాల్లో శుభ్రం చేసి, ఆకర్షణీయమైన ముగ్గులు వేశారు.

>> డివిజన్ 59: గాయత్రీ నగర్, అంబేద్కర్ నగర్, జిల్లెలగూడ కల్లు కాంపౌండ్, RCI రోడ్, DNR కాలనీలలో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు.

>> డివిజన్ 60: మీర్‌పేట్ మెయిన్ రోడ్, పెట్రోల్ పంప్ ఏరియా, మీర్‌పేట్ ఎక్స్ రోడ్స్, SLNS కాలనీల్లో జి.వి.పిలను తొలగించి ముగ్గులు వేశారు.




>> డివిజన్ 61: కాకతీయ స్కూల్, అంగన్‌వాడీ కేంద్రం, అంబేద్కర్ విగ్రహం, రామచంద్ర కాలనీ, రాక్ గార్డెన్ ఆపోజిట్, కుర్మల్‌గూడ విలేజ్ పరిధిలో రంగోలి ముగ్గులతో పరిసరాలను అందంగా తీర్చిదిద్దారు

>> డివిజన్ 62: బాలాపూర్ అంబేద్కర్ విగ్రహం, సాయి నగర్ కాలనీ, మల్లాపూర్ వీక్లీ మార్కెట్ ఏరియాల్లో ప్రత్యేక క్లీనింగ్ డ్రైవ్ నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు డిప్యూటీ కమిషనర్ సరస్వతితో పాటు డీఈఈ (SWM) ఎం. అభినయ్ కుమార్, ఏఈ గంగా ప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ వి. యాదగిరి, జూనియర్ అసిస్టెంట్ ఎం. నర్సింహ, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ రాము, వార్డు అధికారులు, జవాన్లు మరియు పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు. నగర పరిశుభ్రత విషయంలో ప్రజలు సహకరించాలని, చెత్తను రోడ్లపై వేయకుండా కేటాయించిన వాహనాలకే అందించాలని అధికారులు ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

## లింగోజిగూడలో పోలీసుల 'గల్లీ గల్లీ' పత్రోలింగ్

సరూర్ నగర్, జనవరి 29 (భారతశక్తి) : లింగోజిగూడ డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో పోలీసులు గురువారం భారీ పట్రోలింగ్ నిర్వహించారు. ఎల్బీనగర్ ఏసీపీ కృష్ణయ్య, సరూర్ నగర్ సీఐ సైదీ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది వీధి వీధినా తిరుగుతూ తనిఖీలు చేపట్టారు. సాయి నగర్, బృందావన్ కాలనీ, జనప్రియ అపార్ట్‌మెంట్స్, జానకి ఎన్‌క్లేవ్, కామేశ్వర్ కాలనీతో పాటు సరూర్ నగర్ పోస్ట్ ఆఫీస్ పరిసరాల్లో ఈ సోదాలు కొనసాగాయి.

అసాంఘిక కార్యకలాపాలపై నిఘా:

స్థానికంగా శాంతి భద్రతలను కాపాడటమే లక్ష్యంగా ఈ పట్రోలింగ్ చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై నిఘా ఉంచడం, అసాంఘిక కార్యకలాపాలకు చెక్ పెట్టడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని వెల్లడించారు. కాలనీల్లో ఎవరైనా కొత్త వ్యక్తులు కనిపిస్తే లేదా అనుమానాస్పదంగా ప్రవర్తిస్తే వెంటనే డయల్ 100కు గానీ, స్థానిక పోలీస్ స్టేషన్‌కు గానీ సమాచారం అందించాలని సూచించారు.



**ప్రజల హర్షం:**

పోలీసులు నేరుగా కాలనీల్లోకి వచ్చి పట్రోలింగ్ నిర్వహించడంపై స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి తనిఖీలు నిరంతరం కొనసాగితే నేరాలు తగ్గుముఖం పడతాయని అభిప్రాయపడ్డారు. ప్రజల భద్రత కోసం పోలీసులు తీసుకుంటున్న చర్యలకు తాము పూర్తి సహకారం అందిస్తామని ఈ సందర్భంగా కాలనీవాసులు పేర్కొన్నారు.

## స్కూటీపై నుంచి పడ్డ వృద్ధుడు.. అక్కున చేర్చుకున్న ట్రాఫిక్ పోలీసులు!

* **స్వయంగా ఫస్ట్ ఎయిడ్ చేసిన ఏసీపీ శంకర్ రాజు**
* **సకాలంలో స్పందించి ఆసుపత్రికి తరలింపు**



కార్ఖానా, హైదరాబాద్, జనవరి 29, భారత శక్తి: రోడ్డు ప్రమాదంలో గాయపడి సాయం కోసం ఎదురుచూస్తున్న ఓ వృద్ధుడికి ట్రాఫిక్ పోలీసులు అండగా నిలిచారు. ఖాకీ డ్రెస్సులో ఉన్నా కడుపులో ఈరము (కరుణ) ఉందని చాటుకున్నారు. స్కూటీ స్కిడ్ అయి పడిపోయిన పెద్దాయనకు ఏసీపీ స్వయంగా ప్రథమ చికిత్స అందించి ప్రాణాలు కాపాడారు.

**అసలేం జరిగిందంటే..**

వాసవి నగర్‌కు చెందిన ప్రదీప్ కుమార్ (65) గురువారం మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో తన స్కూటీపై బయలుదేరిండు. త్రిముల్గెరి ట్రాఫిక్ పీఎస్ పరిధిలోని కార్ఖానా కేఎఫ్‌సీ ముందుకు రాగానే బైక్ ఒక్కసారిగా స్కిడ్ అయ్యింది. దీంతో ఆయన రోడ్డుపై పడిపోయి తీవ్రంగా గాయపడ్డాడు.

**ఏసీపీ సమయస్ఫూర్తి..**

అదే టైంలో అటుగా వెళ్తున్న బేగంపేట్ ట్రాఫిక్ ఏసీపీ జి. శంకర్ రాజు, మొబైల్ 4 సిబ్బందితో కలిసి వెంటనే ఆగారు. రక్తంతో ఇబ్బంది పడుతున్న ప్రదీప్ కుమార్‌ను చూసి ఏమాత్రం ఆలస్యం చేయకుండా దగ్గరికి వెళ్లారు. వాహనంలో ఉన్న మెడికల్ కిట్ తీసి గాయాలకు కట్లు కట్టారు. వెంటనే అంబులెన్స్‌కు ఫోన్ చేసి, దగ్గరుండి చిక్కడపల్లి శ్రీకర్ ఆసుపత్రికి పంపించారు. పోలీసుల సమయస్ఫూర్తిని చూసి జనం 'శభాష్' అంటున్నారు. ముసలివాళ్లు బండ్లు నడిపేటప్పుడు కొంచెం జాగ్రత్తగా ఉండాలని, హెల్మెట్ పెట్టుకోవాలని ఈ సందర్భంగా పోలీసులు సూచించారు.

## చనిపోయిన వారి కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్సీ గోవిందరెడ్డి



పోరుమామిళ్ల, భారత శక్తి ప్రతినిధి, జనవరి 29: కలసపాడు మండలం లింగారెడ్డిపల్లెకలసపాడు మండలం లింగారెడ్డిపల్లె పంచాయతీ ముదిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన ASI బైరెడ్డి సుబ్బారెడ్డి గారి సతీమణి బైరెడ్డి విమలమ్మ గారు గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలిసిన వెంటనే ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి గారు వారి స్వగృహానికి వెళ్లి పార్థివదేహానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి, సంతాపం తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ బూత్ కన్వీనర్లు సమన్వయకర్త కల్లూరి రమణారెడ్డి, జడ్పిటిసి గురివిరెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు సుదర్శన్, మాజీ సింగిల్ విండో చైర్మన్ పురుషోత్తం రెడ్డి, మాజీ ఎంపీపీ రామకృష్ణారెడ్డి, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సుబ్బారెడ్డి గారి సతీమణి బైరెడ్డి విమలమ్మ గారు గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలిసిన వెంటనే ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి గారు వారి స్వగృహానికి వెళ్లి పార్థివదేహానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి, సంతాపం తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ బూత్ కన్వీనర్లు సమన్వయకర్త కల్లూరి రమణారెడ్డి, జడ్పిటిసి గురివిరెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు సుదర్శన్, మాజీ సింగిల్ విండో చైర్మన్ పురుషోత్తం రెడ్డి, మాజీ ఎంపీపీ రామకృష్ణారెడ్డి, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.